రెండు మహానగరాలు
రూ.॥250/-
పేజీలు:245



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


నేనూ ఒక 'దిమాగి నక్సల్'


80% భారతీయులు మాంసాహారులు

తమిళనాడు ఉప ఎన్నికల్లో వామపక్షాలు స్వతంత్రంగా పోటీ

07


సంపుటి 09, సంచిక: 285 | సోమవారం | 14-09-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' వినాయక చవితి శుభాకాంక్షలు

### సెలవు

వినాయక చవితి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి సోమవారం సెలవు. మంగళవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

– ఎడిటర్




## సాంకేతికతను ఆయుధంగా మార్చొద్దు

- అది ఉమ్మడి పురోగతికి, శ్రేయస్సుకు ఆటంకం కలిగించొచ్చు
- బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ హెచ్చరిక

**న్యూఢిల్లీ :** పెరుగుతోన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ఈ సవాళ్లను ఎదుర్కొని, మానవాళి కోసం వర్థిల్లేందుకు 'బ్రిక్స్' కూటమి సహకారం, సమ్మిళిత వృద్ధి ద్వారా ఎదగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఆకాంక్షించారు. భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన

తరువాయి 8లో

BRICS
INDIA 2026

### నియమాలు లేని ప్రపంచం... ట్రాఫిక్ లైట్లు లేని కూడలి

**చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్**

వాణిజ్యం, తయారీ, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించేందుకు 'బ్రిక్స్' దేశాలు వర్థమాన మార్కెట్లు, గ్లోబల్ సౌత్‌లో తమకున్న సన్నిహిత సంబంధాలను ఉపయోగించుకోవాలని, సరఫరా గొలుసులను కాపాడాలని, ఒక పెద్ద సమీకృత మార్కెట్‌ను ప్రోత్సహించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదివారం అన్నారు. 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో చేసిన ప్రసంగంలో 'బలమే హక్కు' అనే తర్కాన్ని ఎప్పుడో విడనాడాల్సిందని నొక్కిచెబుతూ 'గ్లోబల్ సౌత్ కోసం ఐక్యత ద్వారా బలానికి సంబంధించిన ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించే దిశగా

తరువాయి 8లో

### సవాళ్లను ఎదుర్కొనేందుకు సమగ్ర విధానం

**'బ్రిక్స్' దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలుపు**

అత్యవసరమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో సమగ్ర విధానాన్ని అవలంభించాలని 'బ్రిక్స్' దేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఆ కూటమి దేశాల మధ్య ధాన్యం మార్కెట్‌కు సంబంధించి ఒక కొత్త బీమా విధానాన్ని, ఉమ్మడి కార్యాచరణను ప్రతిపాదించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా పాశ్చాత్య శక్తులు మాస్కోపై విధించిన తీవ్రమైన ఆంక్షల మధ్య పుతిన్ బ్రిక్స్ దేశాలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాల మధ్య ఆర్థిక వృద్ధి కోసం కొత్త కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఒక నిర్దిష్ట ధర పరిమితికి లోబడి లేదా అంతకంటే తక్కువ

తరువాయి 8లో

### ఆహారభద్రత, ప్రజా సంక్షేమంపై ఏకపక్ష ఆంక్షల ప్రభావం

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్**

ప్రస్తుత ఆర్థిక, వాణిజ్య వ్యవస్థలపై అధికంగా ఆధారపడటం వల్ల, వర్థమాన దేశ ఆర్థికవ్యవస్థలు రాజకీయ ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఉన్నందున, బ్రిక్స్ దేశాలు జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని విస్తరించాలని, సమ్మిళిత ప్రపంచ ఆర్థిక చట్రం దిశగా కృషి చేయాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కోరారు. ఆదివారం ఇక్కడ 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో పెజెష్కియన్ ప్రసంగిస్తూ, పాశ్చాత్య శక్తులను ఘాటుగా విమర్శించారు. ఏకపక్ష ఆంక్షలు ప్రపంచ ఆహార భద్రత, ప్రజల సంక్షేమంపై నేరుగా ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఇరుపక్షాల

తరువాయి 8లో



## సంఘటితమవ్వండి

**ఏకతాటిపైకి వస్తే అందరూ గౌరవిస్తారు**



- ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- సౌమ్యంగా, ఆత్మాభిమానంతో, ఆత్మ గౌరవంతో నిలబడేవారే ఆర్యవైశ్యులని ప్రశంస
- హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు శంకుస్థాపన

ప్రజాపక్షం/ఉప్పల్ (హైదరాబాద్)

కష్టాలు, బాధలు ఎన్ని ఉన్నప్పటికీ ఆర్యవైశ్యులు వాటిని కనపడనీయకుండా సమాజంలో సౌమ్యంగా, ఆత్మాభిమానంతో, ఆత్మ గౌరవాన్ని కాపాడుకొంటూ ప్రతి ఒక్కరికి చేదోడు వాదోడుగా ఉంటారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమైక్యంగా ఒక్క తాటిపై నడిస్తే అందరూ గౌరవిస్తారన్నారు. హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ప్రాముఖ్యతని కొనియాడుతూ ప్రపంచ స్థాయి నాయకుడిగా ఆర్యవైశ్య బిడ్డ మహాత్మా గాంధీ ఎదిగారని, ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా గాంధీ గొప్పతనం తెలియని వారుండరన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారని, పొట్టి శ్రీరాములు పోరాటంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, దేశ సమగ్రత కోసం గాంధీ ప్రాణాలిస్తే పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఆర్యవైశ్యులకు రావాల్సిన గుర్తింపు రాలేదని, ఆర్యవైశ్యుల పట్ల తమ ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని, పేదల ఆర్యవైశ్య బిడ్డలకు నూతనంగా నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనం సంపూర్ణంగా ఉపయోగపడాలని, రాష్ట్ర ప్రభుత్వం భవన

తరువాయి 8లో



## విస్తారంగా వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- మూడు రోజుల్లో భారీ వర్షాలు : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

తరువాయి 12లో



## పూజలకు బడా గణేశ్ సిద్ధం

- భక్తులకు దర్శనమివ్వనున్న 70 అడుగుల ఖైరతాబాద్ పంచముఖ సంకటహర మహాగణపతి
- నేడు 11 గంటలకు గవర్నర్ దంపతుల చేతులమీదుగా తొలిపూజ

12




## రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం

- వరంగల్ ఈస్ట్ నుంచి నా గెలుపులో ఆయన పాత్ర కీలకం
- కాంగ్రెస్‌లోనే ఉంటాం: 2028లోనూ గెలుస్తా
- మాజీమంత్రి కొండా సురేఖ ప్రకటన
- బర్తరఫ్ తరువాత తొలిసారిగా కార్యకర్తలతో భేటీ

ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి తాను ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాత్ర ఉందని మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్‌ను వీడేది లేదని వారు స్పష్టం చేశారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికవుతా, ప్రభుత్వంలోకి వస్తా అని సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తమ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సారీ చెప్పమన్నారని, కానీ చెప్పలేదన్నారు. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ తర్వాత, వరంగల్‌లో తొలిసారి కొండా సురేఖ, కొండా మురళీ ఆదివారం కార్యకర్తలతో సమావేశం

తరువాయి 8లో



## సౌదీ సైనికస్థావరంపై హౌతీల దాడి

- దెబ్బతిన్న మసీదు, పౌర నివాసాలు
- ఓడిపోతున్న యెమెన్ సైన్యం : వేలాదిగా ప్రజలు పరార్
- హోర్ముజ్‌లో ఇరాన్ నౌక ధ్వంసం : ఒకరు మృతి



**కైరో:** ఇరాన్ మద్దతు ఇస్తున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై ఆదివారం తెల్లవారకముందుగానే కొత్త దాడులకు దిగారు. యెమెన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హౌతీ వ్యతిరేక, సౌదీ అరేబియా మద్దతు ఇస్తున్న ప్రభుత్వంతో తిరుగుబాటుదారులు పోరాటం చేస్తూనే సౌదీ ప్రాంతాలపై దాడులు చేశారు.మరోవైపు యెమెన్‌లో హౌతీల ప్రభావం కారణంగా వేలాదిమంది ప్రజలు భయంతో నివాసిత ప్రాంతాలు వదిలి పారిపోతున్నారు. గడచిన

తరువాయి 12లో

## ఈ వారంలోనే కేటాయింపులు

- తుది దశకు చేరిన ఇందిరమ్మ టవర్స్ ఎల్‌ఐజి గృహాల కేటాయింపు ప్రక్రియ
- లక్కీ డ్రా ద్వారా 7,340 మంది అభ్యర్థుల ఎంపిక
- హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్


ప్రజాపక్షం/హైదరాబాద్


ఇందిరమ్మ టవర్స్ ఎల్‌ఐజి గృహాల కేటాయింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు. లక్కీ డ్రా విధానం ద్వారా మొత్తం 7,340 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా, వారిలో 6,643 మందికి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయిందన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు 5,521 మంది అర్హులుగా నిర్ధారించబడ్డారని, మిగిలిన


తరువాయి 12లో

# తెలంగాణ పోరాటంలో ఆయుధం పట్టిన సాహిత్యం


సురవరం ప్రతాపరెడ్డి


మఖ్దూమ్ మొహియుద్దీన్


కాళోజీ


దాశరథి

తెలంగాణ సాయుధ పోరాటానికి అనేకానేక కారణాలు ఉన్నాయి. అదే విధంగా కమ్యూనిజం నుంచి జానపదాల వరకూ ఎన్నో అంశాలు పోరాటానికి ఊపిరి పోశాయి. సాహిత్యం పోషించిన పాత్ర అద్వితీయం. అందుకే, తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం తుపాకులు పట్టిన రైతుల తిరుగుబాటుగా అర్థం చేసుకుంటే దాని చరిత్రలోని ఒక ముఖ్యమైన పార్శ్వాన్ని కోల్పోయినట్టు అవుతుంది. 1946 నుంచి 1951 వరకు సాగిన ఈ పోరాటం భూమి, భుక్తి, విముక్తి కోసం రైతాంగం సాగించిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఉద్యమం. నిజాం నిరంకుశ పాలన, దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల దోపిడీ, వెట్టి చాకిరీ, అధిక పన్నులు, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా గ్రామీణ తెలంగాణ తిరుగుబాటు చేసింది. కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ ఈ అసంతృప్తికి రాజకీయ రూపాన్ని ఇచ్చాయి. ఆ పోరాటానికి సాహిత్యం ప్రజల భాషలో స్వరమిచ్చింది. అవసరమైన బలాన్ని అందించింది. ఉద్యమ నెగడులు రాజేసింది. పోరాట స్ఫూర్తిని రగిలించింది. అక్షరాస్యత పరిమితంగా ఉన్న గ్రామీణ సమాజంలో పుస్తకం కంటే పాట వేగంగా ప్రయాణిస్తుంది. వార్తాపత్రిక చదవని రైతు కూడా పాట వింటాడు. సభకు వెళ్లని మహిళ కూడా బుర్రకథ వింటుంది. అక్షరం తెలియని కూలీ కూడా జానపద గేయాన్ని గుర్తుంచుకుంటాడు. అందుకే తెలంగాణ సాయుధ పోరాటంలో సాహిత్యం ఒక అలంకారంగా కాకుండా, ప్రజా సమీకరణానికి పనిచేసిన రాజకీయ సాధనంగా ఉపయోగపడింది. ఆ కాలంలో వందలాది పాటలు, కథలు పుట్టాయి. కొన్ని నాటకాలు, నవలలు కూడా వెలువడ్డాయి. పోరాటం సాగుతున్న సమయంలో దీర్ఘమైన నవల రాయడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో పాట, గేయం, కథ, నాటకం వంటి తక్షణ ప్రసార రూపాలే ఎక్కువ ప్రభావం చూపాయి. ఎన్నో విప్లవాల మాదిరిగానే తెలంగాణ సాయుధ పోరాటంలోనూ సాహిత్యం కీలక భూమిక పోషించింది. ఈ క్రమంలో వచ్చిన సాహిత్య ప్రత్యేకత దాని భాషలోనే ఉంది. అది గ్రంథాలయాల్లో మాత్రమే కనిపించే భాష కానేకాదు. గ్రామాల మాట.. రైతుల నుడికారం.. కూలీల అనుభవం.. దొరల దౌర్జన్యంపై నిరసన గళం.. వెట్టి చాకిరీ బాధను మోసిన అక్షర రూపం.. పోలీసురజాకార్ల హింసను కళ్లకు కట్టిన ఇవన్నీ పాటల్లోకి వచ్చాయి. అందువల్ల ఆ పాటలు ప్రజల సొంత అనుభవాలుగా మారాయి. సుద్దాల హనుమంతు, కాళోజీ నారాయణరావు, దాశరథి రంగాచార్య, దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వార్‌స్వామి.. ఇలా ఎంతో మంది రచయితలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. పేరు కూడా ప్రకటించుకోని ఎంతో మంది జానపద రచయితలు రాసిన పాటలు వాడవాడలా మారుమోగాయి. ప్రజలకు స్ఫూర్తిమంత్రాలయ్యాయి. అలాంటి ప్రజా కవిత్వానికి సుద్దాల హనుమంతు అత్యంత ముఖ్యమైన ప్రతినిధి. ఆయన అసాధారణ కవి. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సాంస్కృతిక కార్యకర్త. ఆయన పాటలు వెట్టి చాకిరీ, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచాయి. 'పల్లెటూరి పిల్లగాడా...' వంటి పాటలు గ్రామీణ తెలంగాణలో అపారమైన ప్రజాదరణ పొందాయి. 'వేయ్ వేయ్.. దెబ్బకు దెబ్బ' వంటి గేయాలు పోరాటానికి ప్రతిఘటన స్వరాన్ని ఇచ్చాయి. హనుమంతు పాటలపై జరిగిన పరిశోధనలు ఆయన గేయాలు అణగారిన వర్గాలను సమీకరించడంలో కీలక పాత్ర పోషించాయని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో బండి యాదగిరి వంటి ప్రజా కవులు పుస్తక రచయితలుగా కాకుండా, ప్రజల మధ్య పాడే కవులుగా చరిత్రలో నిలిచారు. 'బండెనక బండి కట్టి...' అనే గేయం తెలంగాణ సాయుధ పోరాటపు సామూహిక జ్ఞాపకంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ పాటలో రైతు ప్రపంచం, దోపిడీపై ఆగ్రహం, దొరలపై తిరుగుబాటు అన్నీ ఒకేసారి వినిపిస్తాయి. బండి యాదగిరి వంటి కవులు ప్రజల కోసం పాటలు రాయకుండా, ప్రజల మధ్య నుంచే పాటను సృష్టించారు. ఇలాంటి పాటలకు రచయిత పేరు ఉండటం కూడా అవసరం లేని పరిస్థితి. కొన్ని పాటలు ఒకరి దగ్గర పుట్టి మరొకరి గొంతులో మారాయి. గ్రామం నుంచి గ్రామానికి వెళ్లే కొద్దీ పదాలు మారాయి, బాణీ మారింది, సందర్భం మారింది. చివరకు ఆ పాట వ్యక్తిగత రచనగా కాకుండా ప్రజల సామూహిక సృష్టిగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ మౌఖిక సాహిత్య సంప్రదాయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.

ఇక తెలంగాణ సాయుధ పోరాట కాలపు ప్రముఖ కవుల్లో ఒకరైన దాశరథి కృష్ణమాచార్య కవిత్వంలో నిజాం పాలనపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. 1947లో ఆయన అరెస్టయ్యాడు. వరంగల్, నిజామాబాద్ జైళ్లలో నిర్బంధాన్ని అనుభవించాడు. జైలు జీవితంలోనూ ఆయన కవిత్వం ఆగలేదు. ఆ అనుభవాలే తరువాత ఆయన విప్లవ కవిత్వానికి పదును పెట్టాయి. ఆయన తొలి ప్రముఖ కృతి అగ్నిధారలో తెలంగాణ 'పోరాటపు అగ్ని' స్పష్టంగా కనిపిస్తుంది. దాశరథి కవిత్వంలో తెలంగాణ భూమి ఒక భౌగోళిక ప్రాంతంగా మాత్రమేగాక, దోపిడీకి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ప్రతీకగా ఆవిష్కృతమవుతుంది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అనే భావప్రపంచం తరువాతి తరాలకు తెలంగాణను పరిపాలనా ప్రాంతంగా కాకుండా ఒక సాంస్కృతిక అస్తిత్వంగా చూడటానికి సహకరించింది. దాశరథి ప్రాముఖ్యత నిజాం వ్యతిరేక కవిత్వానికి పరిమితం కాలేదు. ఆయన కవిత్వం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని వ్యక్తం చేసింది. జైలు, నిర్బంధం, దౌర్జన్యం మధ్య కూడా కవి స్వరం కొనసాగుతుందనే నమ్మకాన్ని ఆయన రచనలు కలిగించాయి. 'జనపదం', 'మోదుగుపూలు' వంటి అద్భుత రచనలతో తెలంగాణలో దొరల దౌర్జన్యాలను కళ్లకు కట్టిన దాశరథి రంగాచార్య చేసిన సాహితీ సేవలు అద్వితీయం. ప్రజల తరఫున మాట్లాడిన స్వరం కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజా కవిత్వంలో మరో విశిష్టమైన పేరు. ఆయనకు కవిత్వం ఒక సాహిత్య వ్యాయామం. సమాజంతో కవికి ఉండే నైతిక సంబంధం. నిజాం పాలనను, నిరంకుశత్వాన్ని, ఫాసిజాన్ని, సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించే తీవ్రమైన గళం. కాళోజీ తన రచనల్లో సాధారణ మనిషికి పట్టం కట్టాడు. ఆయన భాషలో పాండిత్య ప్రదర్శన కంటే సంభాషణా ధోరణి ఎక్కువ. అందువల్ల ఆయన కవిత్వం సభలో చదివే పద్యంగా కాకుండా ప్రజలతో మాట్లాడే మాటగా మారింది. 'నా గొడవ' అనే రచనలో ఈ స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వం గురించి కూడా కాళోజీ చాలా ముందుగానే ఆలోచించాడు. ఆయన దృష్టిలో ప్రాంతీయ ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరస్పరం సంబంధం ఉన్న అంశాలు. అందుకే ఆయన తెలంగాణ సమాజపు రాజకీయ చైతన్యానికి ఆయన ఒక ప్రజా మేధావిగా గుర్తింపు పొందాడు. తెలంగాణ సాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి పాత్రను ప్రత్యేకంగా గుర్తించాలి. ఆయన రచయిత, పాత్రికేయుడు, ప్రచురణకర్త, గ్రంథాలయ ఉద్యమకారుడు, రాజకీయ కార్యకర్త. నిజాం పాలనకు వ్యతిరేకంగా పనిచేసినందుకు జైలుకు వెళ్లాడు. జైలు లోపలలో ఆయన జైలు అనుభవాలను నమోదు చేశాడు. 'ప్రజల మనిషి'లో తెలంగాణ సామాజిక వాస్తవికతను ప్రతిబింబించాడు. అంతకంటే ముఖ్యంగా దేశోద్ధారక గ్రంథమాల ద్వారా పుస్తకాలను సామాన్య ప్రజలకు చేరువ చేశాడు. సాహిత్యం అంటే చదువుకున్న వర్గం వినోదం కాదని, ప్రజలలో ఆలోచన పెంచే సాధనమని నమ్మాడు. ఆచరణలో చూపాడు. ఆయన ప్రచురణా కార్యక్రమం గ్రామీణ సమాజంలో పఠన సంస్కృతిని పెంచడంలో కీలకంగా పనిచేసింది. తెలంగాణ సాయుధ పోరాటానికి సాహిత్యం అందించిన మరో గొప్ప ఆయుధం పాట. ఎందుకంటే, ఒక పాట వెంటనే ప్రజలను కదిలిస్తుంది. ఒక పుస్తకం మాత్రం ఆలోచనను దీర్ఘకాలం నిలబెడుతుంది. పాట ప్రజలను సమీకరిస్తే, పుస్తకం ఆ సమీకరణానికి సిద్ధాంతపరమైన పునాది వేస్తుంది. ఆళ్వారుస్వామి ఈ రెండో పనిని చేశాడు.

సాహిత్యం పుస్తకంలోనే ఉండిపోతే తెలంగాణ సాయుధ పోరాటంలో దాని ప్రభావం ఇంతటి విస్తృతంగా ఉండేది కాదు. నాటకం, బుర్రకథ, గోల్లసుద్దులు, ఫకీర్, పిట్టలదొర, బైరాగులు వంటి స్థానిక జానపద కళారూపాలను రాజకీయ చైతన్యానికి ఉపయోగించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి సాంస్కృతిక బృందాలు గ్రామాలకు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చాయి. సాయుధ పోరాటం తీవ్రమైన దశలో ఈ కళాకారులు గెరిల్లా దళాల రక్షణలో కూడా ప్రదర్శనలు నిర్వహించారు. 'మా భూమి' నాటకం ఈ సాంస్కృతిక ఉద్యమానికి ఒక ముఖ్యమైన ఉదాహరణ. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు రచించిన ఈ నాటకం భూమి, దోపిడీ, రైతాంగ జీవితం వంటి అంశాలను రంగస్థలంపైకి తెచ్చింది. 1947లోనే ఈ నాటకాన్ని అనేక బృందాలు విస్తృతంగా ప్రదర్శించాయి. తరువాత అది నిషేధానికి గురైంది. సాహిత్యం రాజకీయ అధికారాన్ని ఎందుకు కలవరపెడుతుందో మా భూమి చరిత్ర స్పష్టం చేస్తుంది. స్థూలంగా చూస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో సాహిత్యం మూడు ప్రధాన పనులు చేసింది. మొదటిది, బాధకు పేరు పెట్టింది. వెట్టి చాకిరీ, దోపిడీ, భూస్వామ్య అణచివేత వంటి అనుభవాలను పాటగా మార్చినప్పుడు వ్యక్తిగత బాధ సామూహిక అనుభవంగా మారింది. రెండవది, భయాన్ని ప్రతిఘటనగా మార్చింది. దొరను, రజాకారును, అధికారాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పాటలు, బుర్రకథలు, నాటకాలు ప్రజల్లో పెంచాయి. ఒక గ్రామంలో జరిగిన సంఘటన మరుసటి రోజే మరో గ్రామంలో పాటగా వినిపించేది. అలా సమాచారం, ఆగ్రహం, ధైర్యం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించాయి. మూడవది, పోరాటానికి జ్ఞాపకాన్ని నిర్మించింది. యుద్ధం ముగిసిన తరువాత కూడా పాటలు మిగిలాయి. పుస్తకాలు మిగిలాయి. కథలు మిగిలాయి. అందువల్ల పోరాటం ఒక చారిత్రక తేదీల సమాహారంగా కాకుండా ప్రజల స్మృతిలో జీవించే అనుభవంగా మారింది. ఈ విషయంలో మహిళా సాంస్కృతిక కార్యకర్తల పాత్రను కూడా విస్మరించలేం. బుర్రకథలు, నాటకాలు, పాటల ద్వారా మహిళలు కూడా రాజకీయ ప్రచారంలో పాల్గొన్నారు. జైలు జీవితంలో ఉన్నప్పటికీ సాంస్కృతిక రచనలు చేసిన కార్యకర్తల ఉదాహరణలు కూడా ఉన్నాయి. అంటే సాహిత్యసాంస్కృతిక పోరాటం పురుష రచయితల పరిధిలోనే నిలవలేదు. తెలంగాణ సాహిత్య సంప్రదాయం 1946లో మొదలుకాలేదు. నన్నయకు పూర్వపు జైన సాహిత్యం నుంచి పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన, మల్లినాథసూరి వరకు విస్తరించిన దీర్ఘమైన సాహిత్య పరంపర ఈ నేలపై ఉంది. కుతుబ్ షాహీ కాలంలో దక్కనీ ఉర్దూ వికసించింది. మహాలఖా బాయి చందా వంటి కవయిత్రులు హైదరాబాద్ సాంస్కృతిక ప్రపంచానికి విశిష్టమైన కృషి చేశారు. ఇరవయ్యో శతాబ్దంలో సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, దాశరథి, మఖ్దూమ్ మొహియుద్దీన్, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజు వంటి మేధావులు తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని విస్తరించారు. సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రిక ద్వారా సాహిత్య, సామాజిక చర్చలకు వేదిక నిర్మించారు. ఆయన గోలకొండ కవుల సంచిక తెలంగాణలో కవిత్వం లేదనే అపోహకు సమాధానంగా నిలిచింది. మఖ్దూమ్ మొహియుద్దీన్ ఉర్దూ కవిత్వంలో విప్లవ భావజాలాన్ని, ప్రేమను, మానవతను కలిపిన కవి. ఆయన సాహిత్య ప్రభావం తెలంగాణ భాషా సరిహద్దులను దాటి విస్తరించింది. ఈ బహుభాషా సాహిత్య వాతావరణం కూడా తెలంగాణ సాయుధ పోరాట సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం.

– బిఎల్

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను అధ్యయనం చేసినప్పుడు నాయకులు, గెరిల్లా దళాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, రజాకార్ల హింస, నిజాం పాలన, పోలీస్ యాక్షన్ వంటి అంశాలకు సహజంగానే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుంది. కానీ ప్రజల మనస్సుల్లో ఆ పోరాటాన్ని నిలబెట్టింది మాత్రం సాహిత్యమే. తుపాకీ ఒక శత్రువును ఎదుర్కొంటుంది. పాట మాత్రం వేల మందిలో ఒకే భావాన్ని కలిగిస్తుంది. తుపాకీ ఒక యుద్ధాన్ని గెలిపించవచ్చు. కవిత్వం ఒక తరానికి తన చరిత్రను గుర్తుచేయగలదు. తుపాకీ కాలం ముగిసిన తరువాత మౌనమవుతుంది. పాట మాత్రం తరతరాలకు పాడబడుతుంది. అందుకే తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం సాయుధ తిరుగుబాటుగా చూడటం చారిత్రకంగా అసంపూర్ణమైన దృష్టి. అది ఒక సాంస్కృతిక విప్లవం కూడా. రైతు తన బాధను పాటగా చెప్పుకున్నాడు. కవి ఆ పాటకు పదం ఇచ్చాడు. కళాకారుడు దాన్ని వేదికపైకి తీసుకెళ్లాడు. రచయిత దాన్ని పుస్తకంలో నమోదు చేశాడు. పత్రిక దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజల రాజకీయ చైతన్యాన్ని నిర్మించింది. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిపోయినా, దాని సాహిత్యం ముగియలేదు. సుద్దాల హనుమంతు పాటలు, బండి యాదగిరి గేయాలు, దాశరథి కవిత్వం, కాళోజీ స్వరం, ఆళ్వారుస్వామి రచనలు, ప్రజానాట్యమండలి ప్రదర్శనల జ్ఞాపకం వంటివన్నీ తరువాతి తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు పునాది అయ్యాయి. ఏదిఏమైనా, ప్రజలు తిరుగుబాటు చేయడానికి ముందు తమ బాధను భాషలో వ్యక్తం చేస్తారు. ఆ భాష పాటగా మారినప్పుడు అది ఒకరి గొంతులా కాకుండా, సమూహపు హోరులా మారుతుంది. తెలంగాణలో ఆ గొంతు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం వినిపించింది. అందుకే తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో కవికి, గాయకుడికి, కథకుడికి, నాటకకర్తకు కూడా గెరిల్లా యోధుడి పక్కనే ఒక ప్రత్యేక స్థానం ఉంది.

## చదవాల్సిన పుస్తకం

### తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం

తెలంగాణ సాయుధ పోరాటంపై ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయిగానీ, నాటి పోరాటానికి ఊపిరిలూదిన సాహిత్యంపై విశ్లేషణాత్మక పుస్తకాలు చాలా అరుదు. అలాంటి అరుదైన పుస్తకాల్లో ఆణిముత్యం ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రాసిన 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'. ఈ పుస్తకంలో మొదటి అధ్యాయంలో 'తెలంగాణ సాయుధ పోరాటం' రగిలిరగిలి ప్రళయ ఘోషలా ఎలా మారిందో... కార్చిచ్చులా ఎలా వ్యాపించి భూస్వామ్య విధానాలను, దోపిడీ వ్యవస్థలను ఎలా దహించివేసిందో వివరిస్తారు. చారిత్రక తెలంగాణ రైతాంగ పోరాటాన్ని వివరిస్తుంది. రెండో అధ్యాయం 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'. ఇందులో నాటి పోరాట కాలంలో ఆవిర్భవించిన సాహిత్యాన్ని, అది పోరాటానికి ఊపిరులూదిన వైనాన్ని ఆవిష్కరిస్తుంది. ఉద్యమం సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. సాహిత్యం ఉద్యమానికి ఊతమిచ్చింది. ఈ రెండూ పరస్పర పూరకాలు. పుస్తకాల్లో, అక్షరబద్ధమైన సాహిత్యమేగాక, వివిధ కళారూపాల్లో




నిక్షిప్త, జనపదాల్లో జానపదాలై రైతాంగ పోరాటానికి బాటలు వేసిన ప్రజాసాహిత్యం కూడా ప్రపంచ చరిత్రలోనే గొప్ప ప్రజాతిరుగుబాటుల్లో ఒకటైన తెలంగాణ సాయుధ పోరాటానికి తన వంతు కృషి చేసింది. బుర్రకథలు, ఒగ్గు కథలు, గొల్ల సుద్దులు, నాటకాలు వంటి అనేకానేక రూపాల్లో ఉద్యమ సాహిత్యం ప్రజల మనసుల్లోకి దూసుకెళ్లింది. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా వారిలో పోరాట స్ఫూర్తిని నింపింది. ఈ రెండు రకాల సాహిత్య విధానాలను ఎస్వీ సోదాహరణంగా ఈ పుస్తకంలో మనకు అందిస్తారు. తిరునగరి రామాంజనేయులు నుంచి ఆరుద్ర వరకు, కాంచినేపల్లి నుంచి గంగినేని వరకు, కొండేపూడి నుంచి గోగంటి వరకు ఎంతో మంది పోరాట కవులను పరిచయం చేస్తారు. వారి తెలంగాణ సాయుధ పోరాటానికి అందించిన అక్షరాల సమిధలను గుర్తుచేస్తారు. పోరాట కవులను ఆయన ప్రవాహికులు, ప్రవాహ ప్రభావితులు, ప్రవాహ ప్రేరితులు, తటస్థులుగా వర్గీకరించిన విధానం అద్భుతం. బండి యాదగిరి, అలువాల మాచయ్య, ఆవుల పిచ్చయ్య, బి. గంగారాం, అప్పన్న, సర్వదేవభట్ల నరసింహమూర్తి, పెండ్యాల వెంకటేశ్వరరావు మొదలైన వారు ప్రత్యక్షంగా గన్నుపట్టి పోరాటంలోనూ, పెన్నుబట్టి సాహితీ రంగంలోనూ చేసిన సేవలను ఎస్వీ వివరించారు. 1948 సెప్టెంబర్ 14వ తేదీన ఒడ్డు గ్రామానికి చెందిన భూమస్వామి రంగారెడ్డిని చంపారన్న అభియోగంపై 12 మందికి 1950 జులై 19న ఉరిశిక్ష విధించిన ఘటనపై స్పందించిన పోలిష్ యువకవి 'ఉరికంబం కదులుతోంది' కవిత తెలుగు అనువాదాన్ని ప్రస్తావించారు. 'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి' అంటూ సాగే యాదగిని రచించి, గానం చేసిన గీతాన్ని విశాలాంధ్ర మాసపత్రిక ప్రచురించింది. ఆ గీతం ఎంతటి ప్రాచుర్యం సంపాదించిందో, తెలంగాణ ప్రత్యేకతను నిలబట్టే రచనగా ఏ విధంగా వెలుగుతున్నదో మనకు తెలుసు. ఆ పాట వాస్తవ రూపాన్ని ఎస్వీ రాసిన 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'లో చూడవచ్చు. ఒకరుకాదు... ఇద్దరు కాదు.. ఎంతో మంది రచయితలను, వారి రచనలను ఎస్వీ ఈ పుస్తకంలో పాఠకులకు పరిచయం చేస్తారు. బాధగాథల తెలంగాణ గురించి తెలుసుకోవడానికి, ఉద్యమ నేపథ్యం అర్థం కావడానికి, సాహిత్యం పోషించిన పాత్రను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి. 1998లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ పుస్తకాన్ని ఉద్యమ గ్రంథ శీర్షికలో చేర్చడమే, దీని ప్రత్యేకత నిదర్శనం.

## సాయుధ పోరాట కాలం నాటి ప్రముఖుల కవితలు

నైజాము సర్కరోడా
నాజీల మించినోడా
యమబాధపెస్తివి కొడుకో
నైజాము సర్కరోడా!
పండిన పంటనంతా
తిండికైన ఉంచకుండా
తీసుకవెళ్ళినావు కొడుకో
నైజాము సర్కరోడా!

దున్నాను భూమిలేక
ఉండాను ఇల్లులేక
పరదేశమెల్తిమి కొడుకో
నైజాము సర్కారోడా!
పోలీసు మిల్ట్రి జూసి
మేము లొంగి వస్తమని
నువు ఆశపడ్తివి కొడుకో
నైజాము సర్కారోడా!

లాఠీల దెబ్బలు గాని
తుపాకీ కాల్పులు గాని
మిషీను గన్నులు గాని
తుపాకీ బాంబులుగాని
నీవెన్ని తెచ్చినగాని
మేం లొంగిరాము కొడుకో
నైజాము సర్కారోడా!
కంచారు గాడుదలాను
లంచగొండి పోలిసోల్లా
నువు పెంచినావు కొడుకో
నైజాము సర్కారోడా!

చుట్టుపట్ల సూర్యపేట
నట్టనడుమ నల్లగొండ
ఆవాల హైద్రాబాద్
తర్వాత గోలకొండ
గోలకొండ ఖిల్లా కింద –

నీ గోరి కర్తం కొడుకో
నైజాము సర్కరోడా!
గోలకొండ ఖిల్లా కింద
నీ గోరి కర్తం కొడుకో
నైజాము సర్కరోదా!

– యాదగిరి

ఒంటరి తుంటరి
ఒ తొండి దొరా!
ఎంతకు మారని మొండి దొరా!
చాలు చాలు నీ పెత్తనమిక
సాగించగ బోకుమోయ్'

– హన్మంతు

గ్రామాధికారులు భీమస్వరూపులై
పెక్కు టక్కుల వెతల్ బెట్టుచుండ
వ్యాపార వర్గంబులా
పూర్తి ధూర్తులై
లాభంబు పూర్తిగా
లాగుచుండ

పాలకోద్యోగులు పట్టాభిషిక్తులై
చిప్ప ముంతల పాలు
సేయుచుండె. '

– గంగుల శాయిరెడ్డి

ఓ నిజాము పిశాచమా!
కానరాడు. నిన్ను బోలిన
రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో
దింపినావు
నా తెలంగాణా,
కోటి రత్నాల వీణ''

'ప్రాణము లొడ్డి ఘోర గహ
నాటవులన్ బడగొట్టి, మంచి
మాగాణములన్ సృజించి,

ఎముకల్ నుసి జేసి
పొలాలు దున్ని,
భో షాణములన్ నవాబునకు
స్వర్ణము నింపిన రైతుదే,
తెలంగాణము రైతుదే, ముసలి
నక్కకు రాజరికంబు దక్కునే?'

– దాశరథి




## సాంస్కృతిక పునరుజ్జీవనం

ఈ శతాబ్దారంభం నుండే తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. రావిచెట్టు రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు, శ్రీ రాజా నాయని వేంకట రంగారావు వారి మిత్ర బృందంతో కలిసి 1901లోనే సుల్తాన్ బజార్లో 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించారు. దీనికి గ్రంథాలను సమకూర్చడానికి 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి'ని ప్రారంభించారు. వరంగల్లు జిల్లాలోని 'ఇనుగుర్తి' అనే గ్రామంలో వద్దిరాజు సీతారామచంద్రారావు రాఘవ రంగారావు అనేక నవలలు, నాటకాలు, భాషా విషయిక గ్రంథాలు రాయడమేగాక, 'విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల'ను నెలకొల్పి సారస్వత సృజనకు దోహదం చేశారు. 'తెలుగు పత్రిక' అనే వారపత్రికను కూడా వెలువరించారు. అదే కాలంలో నల్లగొండలో షబ్నవీసు వేంకట నరసింహారావు 'నీలగిరి పత్రిక' పేరుతో ఒక వారపత్రికను, 'వీరేశలింగ కంఠాభరణ గ్రంథమాల' ను నెలకొల్పారు. వీరు ప్రచురించిన గ్రంథాలన్నింటికీ రెండణాలే వెల, నల్లగొండ జిల్లా సూర్యాపేటలో పువ్వాడ వెంకటప్పయ్య' కృషి ప్రచారిణీ గ్రంథమాల' ను నెలకొల్పారు. సికింద్రాబాద్‌లో వట్టికోట ఆళ్వారెస్వామి' దేశోద్ధారక గ్రంథమాల' ను స్థాపించి, అభ్యుదయకరమైన అనేక పుస్తకాలను వెలువరించడమే కాక, సంచీ భుజాన వేసుకుని ఇంటింటికీ తిరిగి పుస్తకాలను అమ్మేవారు. శ్రీవెల్దుర్తి మాణిక్యరావు, కె.సి. గుప్తా 'అణా గ్రంథమాల'ను నెలకొల్పి చాలా చిరుపొత్తాలను ప్రచురించి అణాకే విక్రయించేవారు. వీరి ప్రచురణలపై తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యం ప్రభుత్వం కన్నెర్ర జేయడం, కోర్టుకు పోవడం కూడా జరిగింది. 'సురవరం ప్రతాపరెడ్డి స్థాపించి చాలాకాలం పాటు సంపాదకత్వం వహించిన 'గోల్కొండ పత్రిక' ఖచ్చితమైన రాజకీయ దృక్పథంతో వెలువడటమే గాక, అనేక ప్రచురణలను వెలువరించింది. ప్రతాపరెడ్డి సంకలనం చేసిన 'గోలకొండ కవుల సంచిక' ద్వారా ఎందరో అజ్ఞాత తెలంగాణా కవుల వివరాలు వెలుగు చూశాయి.

– ఎస్వీ

## 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్'

### హైదరాబాద్ విలీనానికి నవలా రూపం

హైదరాబాద్ సంస్థానాన్ని 1948లో, భారతదేశంలో విలీనం చేసిన సంఘటన చరిత్ర పుస్తకాల్లో ఒక అధ్యాయంగా మిగిలిపోయింది. అయితే ఆ కాలపు రాజకీయ కుట్రలు, రాజసిక జీవితం, వ్యక్తిగత సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలు, ఒక ప్రపంచం కళ్లముందే కూలిపోతున్న అనుభూతిని నవలగా ఆవిష్కరించారు రచయిత్రి జీనత్ ఖాన్. ఆమె తొలి నవల 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్' హైదరాబాద్ విలీనానికి దారితీసిన పరిణామాలను వాస్తవ, కల్పిత పాత్రల ద్వారా చెప్పే చారిత్రక నవల. 2017 వేసవిలో ముంబయి సముద్రం వెంబడి ఉన్న రహదారిపై నడుస్తున్నప్పుడు ఈ నవలకు సంబంధించిన ఆలోచన తనకు వచ్చిందని ఖాన్ చెబుతున్నారు. హైదరాబాద్ చరిత్రలోని ఆ ఘట్టంలో ఒక ఆసక్తికరమైన నవలకు అవసరమైన అన్ని అంశాలూ ఉన్నాయని ఆమెకు అనిపించింది. వైభవమైన రాజసౌధాలు, విభిన్న స్వభావాల వ్యక్తులు, రాజకీయ ఎత్తుగడలు, రహస్యాలు, పలు కారణాలతో మారిన నిర్ణయాలు వంటి అంశాలన్నీ కలసి ఒక ఉత్కంఠ భరితమైన కథకు నేపథ్యంగా నిలవగలవని ఆమె భావించారు. ఈ నవల 1948లో హైదరాబాద్ సంస్థానంపై భారతదేశం చేపట్టిన సైనిక చర్యను, ఆ పరిణామాల్లో చిక్కుకున్న వ్యక్తుల జీవితాలను కేంద్రంగా చేసుకుంటుంది. భారత విభజనపై అనేక పుస్తకాలు, సినిమాలు వెలువడినప్పటికీ,




అదే సమయంలో దక్షిణ భారతదేశంలో చోటుచేసుకున్న హైదరాబాద్ రాజకీయ పరిణామాలు మాత్రం ఎక్కువగా చరిత్ర, అకడమిక్ పరిశోధనలకే పరిమితమయ్యాయని ఖాన్ అభిప్రాయం. ఆమె దృష్టిలో 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్' ఒక కనుమరుగైన ప్రపంచం కథ. అమెరికా దక్షిణాది జీవనాన్ని చిత్రించిన 'గాన్ విత్ ది విండ్', సిసిలీ సమాజం పతనాన్ని ప్రతిబింబించిన 'ది లెపర్డ్' వంటి రచనల్లో కనిపించే గతకాలపు ప్రపంచం పట్ల నాస్టాల్జియా ఈ నవలలోనూ కనిపిస్తుందని ఆమె చెబుతున్నారు. హైదరాబాద్ సంస్థానం కూలిపోతున్న సమయంలో అక్కడి జీవితం, ఆ సమాజంలోని వ్యక్తుల మనస్తత్వం, రాజకీయ అనిశ్చితిని పాఠకుడి ముందుకు తీసుకురావడమే తన ప్రయత్నమని అంటున్నారు. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ పోలో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసే ప్రక్రియకు కీలక మలుపుగా నిలిచింది. అయితే ఈ నవల ఆ సంఘటనలను విజేతల దృష్టితో కాకుండా, ఓడిపోయిన పక్షం అనుభవించిన పరిణామాల కోణంలో చెబుతుంది. నవలలో ప్రధాన పాత్ర ఫరిష్తె. ఆమె 15 ఏళ్ల వయసున్న ఒక సంపన్న, కులీన కుటుంబానికి చెందిన యువతి. తన చుట్టూ ఉన్న ప్రపంచం రాజకీయ కల్లోలంలో కూరుకుపోతున్న సమయంలో ఆమె రాజకీయ కుట్రలు, అంతర్జాతీయ గూఢచర్యం, ఒక వైమానిక దళ క్యాడెట్‌తో దూర సంబంధం వంటి పరిణామాలను ఎదుర్కొంటుంది. ఫరిష్తె పాత్రను నవల కథాంశం పూర్తిగా రూపుదిద్దుకునే ముందే తన మనసులో సృష్టించుకున్నానని ఖాన్ చెబుతున్నారు. ఆదర్శవాది, తెలివైన, ధైర్యవంతమైన కులీన కుటుంబానికి చెందిన టీనేజ్ బాలికగా ఆమెను తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నానని అంటున్నారు. నవలలోని పెద్దల పాత్రలకు భిన్నంగా ఫరిష్తె వ్యక్తిత్వం ఉంటుంది. అధికారంలో ఉన్న పెద్దలలో స్వార్థం, క్రూరత్వం, కుతంత్రం వంటి లక్షణాలు బలంగా కనిపిస్తాయి. చారిత్రక కల్పనా రచనను ఒక యువతి దృష్టికోణంలో రాయడం అంత సులభం కాలేదని ఖాన్ అంటారు. 1948 నాటి సామాజిక పరిస్థితుల్లో ఒక యువతికి స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయి. అయినప్పటికీ కథను మధ్యవయస్కులైన పురుషుల దృష్టితో మాత్రమే చెప్పి ఉంటే అది మరింత విషాదభరితంగా మారేది. ఎందుకంటే పరిస్థితులు తమ చేతుల్లోంచి జారిపోతున్నాయని ఆ కాలపు అధికారంలో ఉన్నవారికి తెలిసినా, వారు ఒక మునిగిపోతున్న నౌకను నడిపిస్తున్నట్టే పరిస్థితిని ఎదుర్కొన్నారన్న రచయిత్రి వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. నవలా రచన కోసం ఖాన్ విస్తృతమైన పరిశోధన చేశారు. 1946 నుంచి 1948 మధ్య వెలువడిన తనకు అందుబాటులో ఉన్న పత్రికలను ఆమె పరిశీలించారు. అప్పటి వార్తలు, సామాజిక వాతావరణం, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి పాత దృశ్యచిత్రాలు కూడా ఉపయోగపడ్డాయని చెప్పారు. 1940ల జీవనశైలిని పాఠకుడి ముందుకు సజీవంగా తీసుకురావడానికి ఆ కాలానికి సంబంధించిన పుస్తకాలు, సినిమాలు పరిశీలించారు. రవాణా, సమాచార వ్యవస్థ, దుస్తులు వంటి అంశాలపై కూడా ఆమె ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. జీవిత చరిత్రలు, జ్ఞాపకాల పుస్తకాలు, ప్రత్యక్ష అనుభవ కథనాలు, ముఖ్యంగా ఆ కాలాన్ని స్వయంగా చూసిన కుటుంబ సభ్యుల అనుభవాలు తన పరిశోధనకు ఎంతో ఉపయోగపడ్డాయని ఖాన్ అంటారు. ఇలా చరిత్రలోని ఒక కీలక ఘట్టాన్ని కేవలం రాజకీయ లేదా సైనిక పరిణామంగా కాకుండా, ఒక ప్రపంచం కూలిపోతున్నప్పుడు అందులో జీవించిన వ్యక్తుల అనుభవాలుగా చెప్పే ప్రయత్నమే 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్'. వాస్తవ చరిత్రకు కల్పనను జోడించి, హైదరాబాద్ సంస్థానం చివరి దశను ఒక యువతి కళ్లతో చూపించడం ఈ నవలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది.



# సిఆర్‌పిలను రెగ్యులర్ చేసి.. సిఎం హామీ నిలబెట్టుకోవాలి

'ప్రామిస్ డే' సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి సిఆర్‌పిల సమస్యలను పరిష్కరించాలని సిఆర్‌పి యూనియన్ తెలంగాణ గౌరవ సలహాదారు బాలరాజు అన్నారు. విద్యాశాఖ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి)లుగా పనిచేస్తున్న సుమారు 2 వేల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి అనుబంధ సిఆర్‌పి యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, సిఆర్‌పిల డిమాండ్లు పరిష్కారం కాలేదని విమర్శించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాద్య నాగేశ్వరరావు మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2023 సెప్టెంబర్ 13న వరంగల్ ఏకశిలా పార్క్ వద్ద ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్‌పిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని గుర్తుచేస్తూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 13ను 'ప్రామిస్ డే'గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుని సిఆర్‌పిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి పోలే రమేష్, ఉపాధ్యక్షులు సేవియా, రాష్ట్ర నాయకులు మల్లేష్, యూసఫ్ అలీ, శివరాజ్, కృష్ణశంకర్, మధునాయక్, యాదగిరి, జలంధర్, సుదర్శన్, అశోక్, వెంకటేష్, నర్సింహ, లింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు

బిఆర్‌ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, డొల్లతనం శాసన మండలి సమావేశాల్లో బయట పడిందని శాసన మండలి బిఆర్‌ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆరోపించారు. సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని తేలిపోయిందన్నారు. ప్రభుత్వ అవసరాల కోసమే సభను నిర్వహించిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్.రమణ, సురభివాణి దేవి, దేశపతి శ్రీనివాస్‌తో కలిసి మదుసూదనాచారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపైన రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడంలేదన్నారు. తమ ప్రశ్నలకు మంత్రుల సమాధానాలు సరిగ్గా ఇవ్వలేదని, బిఎసిలో జరిగిన నిర్ణయాలకు విలువ లేదన్నారు. ఆరు రోజుల శాసనమండలి సమావేశాల్లో ఏ ఒక్క స్వల్పకాలిక చర్చ సక్రమంగా జరగలేదన్నారు. తాము 20 అంశాలను తాము చర్చకు ప్రతిపాదించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. 'క్యూర్ బిల్లు'ను సెలెక్ట్ పంపాలని డిమాండ్ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వినలేదన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ సాంకేతికంగా సభను నిర్వహించాలి కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం సభను నిర్వహించిందని ఆరోపించారు. సురభి వాణి దేవీ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు ఘోరమైన అవమానం జరిగిందని, ఇక్కడ న్యాయం జరగపోతేనే తాము ఢిల్లీకి వెళ్ళామని వివరించారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక ఆంక్షలు ఉన్నప్పటికీ శాసనమండలిలో తమకు దక్కిన కొద్ది సమయాన్ని కూడా సక్రమంగా వాడుకున్నామన్నారు.

# 'భావన' ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొందరు పాలకులు తమ సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో తెలంగాణ ప్రాంతం భారతభూభాగంలో విలీనమైన 'సెప్టెంబర్ 17ను' పురస్కరించుకుని ప్రతి ఏటా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ''భావన'' కవితా సంకలనం' సాహిత్య కార్యక్రమం జరిగింది. ఈ సభకు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా కె.శ్రీనివాస్, అతిథులుగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, సినీ దర్శకులు బాబ్జీ హాజరయ్యారు. రాపోలు సదర్శన్ సంపాదకత్వం వహించిన 85 మంది కవులకు చెందిన 'భావన 'కవితా సంకలనంలో పలువురు కవులు నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, పల్లేరు వీరస్వామి, నిధి, కెవిఎల్, రామకృష్ణ, చంద్రమౌళి, ఎస్.సూర్యప్రకాష్, పరమాత్మ, ఒద్దిరాజు, ప్రవీణ్ కుమార్, గులాబీల మల్లారెడ్డి, చందనాల చంద్రమోహన్ గౌడ్, హరనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం వ్యతిరేక పోరాటమంటే హిందూ భూస్వాముల వ్యతిరేకపోరాటమేనని, ఈ భూస్వాముల సహాయ సహకారాలతోనే రజాకారులు ఎవరిపైనేతే దౌర్జన్యానికి పాల్పడ్డారో, వారిని కమ్యూనిస్టులు సంఘటితం చేసి తెలంగాణ సాయుధ పోరాటం చేపట్టారని గుర్తు చేశారు.

# పునర్విభజన శాస్త్రీయంగా జరగాలి

- ప్రజా సంక్షేమం ఫరిడవిల్లే రాజ్యాంగ సవరణ జరగాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి
- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/అమరచింత :** చట్టసభలకు అత్యంత కీలకమైన పార్లమెంటరీ అసెంబ్లీ స్థానాల పునర్విభజనను కేంద్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలు పోకుండా ఇండియా, ఎన్‌డిఏ కూటమిలు రాష్ట్ర ప్రభుత్వాలు, మేధావులు విజ్ఞప్తులను పరిశీలించి శాస్త్రీయంగా జరపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగిస్తుందని రాజ్యాంగ హక్కులను ప్రాదేశిక సూత్రాలకు దేశ సమగ్రతకు విఘాతం కలిగించే విధంగా పరిపాలన విధానాలు కొనసాగుతున్నాయని ఇవి దేశ సార్వభౌమ అధికారానికి ప్రజాస్వామ్య మనుగడకు ఎంతో ప్రమాదకరమని అన్నారు. దేశంలో అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ లాంటి పన్నులతో పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం దేశ ఆర్థిక నేరగాళ్ల అప్పులకు మాత్రం రుణాల మాఫీలు, రాయితీలు కల్పించడం సిగ్గుచేటని ఆయన కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జన్‌జీ ఉద్యమం కేవలం పేపర్ లీకేజ్ ఉద్యమంగా చూడకూడదని ఇది దేశంలోని ప్రజల ఇబ్బందులకు ఆక్రోశాలకు పాలకులపై పెంచుకున్న పోరాట జ్వాల అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా సిపిఐ జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నదని అక్టోబర్ రెండున గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చారిత్రాత్మక చరిత్ర ఆనవాలు లేకుండా పాలకులు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం రజాకారులను, దేశకాముకులను, నైజాం సర్కారును, దొరలను, భూస్వాములను గ్రామ గ్రామాన తరిమికొట్టి లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర సిపిఐ పార్టీదని, తెలంగాణ గడ్డ విముక్తికై 4,500 మంది రక్తార్పణ చేశారని ఆయన వివరించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, వర్షాలు లేక రైతులు పంట పొలాలు ఎండిపోతు రైతుల కుమిలిపోతున్నారని ఆయన ఆందోళన చెందారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు ప్రాంతాలకు ప్రకటించి, రైతాంగానికి ఆదుకోవాలని డిమాండు చేశారు. లేనిచో పోరాటాల సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, సిపిఐ నాయకులు ఎ.అబ్రహం, శ్రీహరి, రమేష్, పి.సురేష్, శ్రీరాములు, రవీందర్, సి.నరసింహ శెట్టి, రాంపూర్ సర్పంచు నాగరాజు, శ్యాం సుందర్, పృథ్వీనాదం, భరత్, యం.డి.కుతుబ్, శివ, లక్ష్మినారాయణ, రఘు, కథలప్ప, ఎర్రన్న, బాలస్వామి, కురుమూర్తి, నాగేంద్రం, సౌలు, కుమార్, గీత, పద్మ, శారద, శ్యామల, భారతి గోవిందమ్మ, లయ, వీణ పద్మ పాల్గొన్నారు.

## విజయ రాములు కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు కుటుంబాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంలు పరామర్శించారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింత మండ ల కేంద్రంలో ఇటీవల సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు సతీమణి, కే.జ్యోతి అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం లు జ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి మరణం విజయ రాములు కుటుంబానికి, సిపిఐకి తీరని నష్టం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. జ్యోతి భౌతికంగా మన మధ్య లేకపోయిన ఆమె ఆశయాలను కొనసాగించాలి. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు, పి.సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, నాయకులు శ్రీహరి, సీఎన్ శెట్టి, రవీందర్, శ్యాంసుందర్, భరత్, ఎర్రన్న, ఆర్ఎన్ కుమార్, సైలు, లక్ష్మి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సైబర్ బాధితులకు భారీ ఊరట.. రూ.139.68 కోట్లు రీఫండ్

- ఈ ఏడాది ఇప్పటివరకు 24,189 మంది బాధితులకు నగదు వెనక్కి..
- లోక్ అదాలత్, ఎంఆర్ఎం ద్వారా వేగంగా పరిష్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ మోసాల బారి నపడిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) భారీ ఊరటనిచ్చింది. 2026లో ఇప్పటివరకు 24,189 మంది సైబర్ నేర బాధితులకు రూ.139.68 కోట్లను రీఫండ్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శనివారం వెల్లడించింది. ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో టీజీసీఎస్‌బీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు, పోలీస్ కమిషనరేట్లు, జిల్లా పోలీసు యూనిట్ల సమన్వయంతో 3,896 మంది బాధితులకు రూ.42.28 కోట్లను తిరిగి అందించేందుకు చర్యలు చేపట్టింది. లోక్ అదాలత్‌లో సైబర్ బాధితులకు ఆర్థిక సాయం అందించడంలో సైబరాబాద్ కమిషనరేట్ ముందంజలో నిలిచింది. 942 మంది బాధితులకు రూ.14.19 కోట్లు రీఫండ్ చేయగా, టిజిసిఎస్‌బి పరిధిలో 41 మంది బాధితులకు రూ.10.55 కోట్లు, మల్కాజిగిరిలో 1,024 మందికి రూ.5.27 కోట్లు, హైదరాబాద్‌లో 530 మందికి రూ.5.02 కోట్లు, సూర్యాపేటలో 34 మందికి రూ.0.76 కోట్లు రీఫండ్ చేయించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంశాఖ మంత్రిత్వ శాఖ మే 2026లో ప్రారంభించిన మనీ రెస్టొరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో జూన్ నుంచి అమలు చేస్తోంది. కోర్టు ఆదేశాలు అవసరం లేకుండానే సైబర్ మోసాల్లో కోల్పోయిన నగదును బాధితులకు తిరిగి అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. సెప్టెంబర్ 12 నాటికి ఎంఆర్ఎం ద్వారా 9,355 మంది బాధితులకు రూ.27.23 కోట్లు తిరిగి అందించినట్లు అధికారులు తెలిపారు. లోక్ అదాలత్, ఎంఆర్ఎం రెండు విధానాల ద్వారా ఈ ఏడాది ఇప్పటివరకు 13,251 మంది బాధితులకు ఆర్థిక ఉపశమనం లభించిందని టిజిసిఎస్‌బి పేర్కొంది. టిజిసిఎస్‌బి ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు 73,204 మంది బాధితులకు రూ.514.93 కోట్లను రీఫండ్ చేయడంలో సహకరించినట్లు తెలిపింది. సైబర్ మోసానికి గురైన బాధితులు నగదు రీఫండ్ కోసం ఎంఆర్ఎం విధానాన్ని వినియోగించుకోవాలని టిజిసిఎస్‌బి సూచించింది. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయడం ద్వారా 'గోల్డెన్ అవర్'లో చర్యలు తీసుకుంటే నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అధికారులు తెలిపారు.ఒటిపి, పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, కస్టమర్ కేర్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే నిర్ధారించుకోవాలని ప్రజలకు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.



# టిఆర్‌ఎస్‌లో చేరిన నాగోబా ఆలయ ప్రధాన పూజారి

అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో టిఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయ ప్రధాన పూజారి మేస్రం ఆనంద రావు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో ఆ పార్టీలో ఆదివారం చేరారు. ఆయనతో పాటు పలువురు సర్పంచులు, నాయకులు పార్టీలో చేరారు. నాగోబా ఆశీస్సులు తమపై సంపూర్ణంగా ఉన్నాయని కవిత అన్నారు. మేస్రం ఆనందరావుతో పాటు గిన్నెర గ్రామ సర్పంచ్ మేస్రం భీమ్ రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద గ్రామ సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్, సీనియర్ నాయకులు మేస్రం దయాకర్, తొడసం సాగర్, మేస్రం జంగురావు, కోట్నాక్ లక్ష్మ ణ్, సాయిగౌడ్, కోట్నాక్ కృష్ణా తదితరులు టిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ నెలలో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు టిఆర్‌ఎస్ వ్యూహ రచన చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ సక్సెస్‌తో కావడంతో పార్టీలో మరింత ఉత్సాహం నింపేందుకు ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో జోష్ వస్తుందని టిఆర్‌ఎస్ భావిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు జగిత్యాల. కొడంగల్ బహిరంగ సభ అనంతరం ఇంద్రవెల్లి సభ నిర్వహించే తేదీలను ప్రకటించనున్నారు.

# తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకివ్వండి

- మాక్ అసెంబ్లీ జబర్దస్త్ కామెడీ షోకంటే దిగదుడుపు
- బిఆర్‌ఎస్ నేతలపై మెట్టు సాయికుమార్ ఘాటు విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాక్ అసెంబ్లీ పేరుతో బిఆర్‌ఎస్ నేతలు కపట నాటకాలు, డ్రామాలు ప్రదర్శించారని తెలంగాణ మత్స్య అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఆ కార్యక్రమాన్ని చూస్తే జబర్దస్త్ కామెడీ షో కూడా దిగదుడుపేనని వ్యాఖ్యానించారు. ఇకపై తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకిచ్చి, 'ఇక్కడ నాటకాలు వేయబడును' అంటూ బోర్డు పెట్టుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, తలసాని తదితరులు ఆస్కార్ స్థాయి నటన ప్రదర్శించారని, వారికి 'గద్దర్ అవార్డులు' ఇవ్వాల్సిందేనని సాయికుమార్ వ్యంగ్యంగా అన్నారు. 'నవరస సార్వభౌమ', 'కళా ప్రపూర్ణ', 'కళా తపస్వి' వంటి బిరుదులు వారికి సరిపోతాయని పేర్కొన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీ సంప్రదాయాలను బిఆర్‌ఎస్ తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వని వారు ఇప్పుడు సభా సంస్కృతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రజల చేతిలో ఓడిపోయినప్పటికీ బిఆర్‌ఎస్ నేతలు నంగనాచి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు.


**మాక్ అసెంబ్లీలో పాల్గొన్న వారంతా మాజీలే..**

బిఆర్‌ఎస్‌కు ఉన్న 35 మంది ఎమ్మెల్యేల్లో కొద్దిమంది మాత్రమే కెసిఆర్, కెటిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని సాయికుమార్ అన్నారు. మాక్ అసెంబ్లీలో కేవలం కొద్దిమంది ఎమ్మెల్యేలే పాల్గొనడంపై ప్రశ్నలు లేవనెత్తారు. మాక్ అసెంబ్లీ సెట్‌లో నటించిన నేతలంతా వచ్చే ఎన్నికల్లో శాశ్వత మాజీలుగా మిగిలిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆ మాక్ అసెంబ్లీ సెట్‌ను మరికొన్నేళ్లు అలాగే ఉంచుకోవాలని, ప్రజలు వారికి నిజమైన అసెంబ్లీ గేట్లు తెరిచే పరిస్థితి లేదని సాయికుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# కమ్యూనిస్టుల పురోగమనం తప్పదు

- జనరేషన్ జెడ్ చేస్తున్న డిమాండ్లు కమ్యూనిస్టులవే
- 'ప్రజాపక్షం'తో పువ్వాడ నాగేశ్వరరావు
- నేడు పువ్వాడ 89వ పుట్టినరోజు

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో కమ్యూనిస్టుల పురోగమనం తప్పదని కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని సిపిఐ సీనియర్ నాయకులు, శాసనసభ, శాసన మండలి మాజీ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. పాలకులు ప్రజలను మరిచి పాలన సాగిస్తున్నారని తమ రాజకీయ అవసరాలు నెరవేర్చుకునేందుకు కొన్ని పథకాలను ప్రజలకు ఎరగా వేస్తున్నారని ఆయన ఆరోపించారు. కమ్యూనిస్టు ఉద్దండుడిగా సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పువ్వాడ నాగేశ్వరరావు సోమవారం 89వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. 88 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పువ్వాడ 70 సంవత్సరాల రాజకీయ జీవితాన్ని గడిపారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడే సమస్యలపై ప్రశ్నించి ఆందోళనకారుడిగా ముద్ర పడిన పువ్వాడ ఆ తర్వాత విద్యార్థి నాయకునిగా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. 29 సంవత్సరాలకే భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పువ్వాడ అనేక రాజకీయ ఎత్తుపల్లాలను చూశారు. అధికార పార్టీ నేతలతో సానుకూలంగా ఉంటూ అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తూనే మరో పక్క కమ్యూనిస్టు నేతగా అధికార పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎడతెగని పోరాటం చేసే వారు. పువ్వాడ ఓ సమస్యను తీసుకున్నారంటే అది పరిష్కారం కావాల్సిందేనన్న భావన అప్పట్లో ఉండేది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పువ్వాడ తిరగని ప్రాంతం చూడని ఊరు, తన గొంతు విప్పని సమస్య లేదంటే అతిశయోక్తి కాదు. 1/70 సమస్య అయినా, పోడు సమస్య అయినా, గోదావరి జలాలైనా మరేదైనా ఆయన పోరాటం ద్వారానే పరిష్కారం చూపాలనే భావనతో పనిచేసే వారు. ఈ వయస్సులోనూ నిరంతరం సమాజాన్ని అధ్యయనం చేస్తున్న పువ్వాడ విపక్ష, అధికార పక్ష కదలికలను గమనిస్తున్న పువ్వాడ అధ్యయనాన్ని మాత్రం వదులుకోలేదు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను సైతం గమనిస్తూ నిరంతరం సలహాలు ఇస్తున్న పువ్వాడ 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రజాపక్షం ఖమ్మం ప్రతినిధి ఏనుగు వెంకటేశ్వరరావుతో అనేక విషయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కమ్యూనిస్టులు ఎన్నికల విషయంలో వెనకబడి ఉండవచ్చు. ఎన్నికలను డబ్బు, అధికారం, యంత్రాలు శాసిస్తున్న రోజుల్లో కమ్యూనిస్టులకు ఆశించిన గెలుపు దక్కడం లేదు. అంత మాత్రాన కమ్యూనిస్టుల పని అయిపోలేదు. రెండు దశాబ్దాలుగా కేంద్రం లో, రాష్ట్రంలో పాలన చూసిన ప్రజలు కమ్యూనిస్టుల గురించి ఆలోచించడంతో పాటు ఎర్ర జెండాల అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఇప్పటికీ ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు కానీ కమ్యూనిస్టుల పురోగమనం తథ్యమని పువ్వాడ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బలహీనపడితే పేద, మధ్యతరగతి, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.



## ఈ తరం డిమాండ్లు కమ్యూనిస్టులవే

ప్రస్తుతం జనరేషన్ జెడ్ పేరుతో దేశంలో ఓ తరం ఆందోళన చేపట్టి పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచడం అభినందనీయమన్నారు. జనరేషన్ జెడ్ పేరుతో ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు అన్ని కమ్యూనిస్టు పార్టీల డిమాండ్లేనని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అవినీతి రహిత పాలన, అర్హులకు సంక్షేమం మొదలైనవి కమ్యూనిస్టుల డిమాండ్లేనని పువ్వాడ తెలిపారు. బలమైన ప్రజా పోరాటాలు ఉన్నప్పుడు ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపుదిద్దుకుంటాయని ఈ దేశంలో ప్రజా అనుకూల లేదా ప్రజా ప్రయోజన చట్టాలన్ని కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమేనన్నారు. రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరమని ఇది అన్ని వ్యవస్థలను ఛిద్రం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలు ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీలు స్వప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.


## మారిన పరిస్థితులకు అనుగుణంగా

మారిన పరిస్థితులకు అనుగుణంగా మనము మారాలని ప్రతి మార్పును ప్రజలకు అనుకూలంగా మార్చగలిగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కొంత కాలంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఇవే మార్పులు కొన్ని రంగాలను కనుమరుగు చేశాయని కార్పొరేట్లు, సంపన్నులు తప్ప సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఇది అవాంఛనీయ పరిణామమన్నారు. సగటు మనిషి పురోభివృద్ధి లక్ష్యంగా మార్పు రావాలన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం అత్యంత ప్రమాదకరమని ఇది దేశ అస్థిరతకు, అంతర్గత ఆందోళనలకు దారి తీస్తుందన్నారు. పాలకులే అక్రమ సంపాదనలకు ఆస్కారం ఇవ్వడం అత్యంత బాధాకరమని దీనిని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కమ్యూనిస్టులు సైతం మార్పులు అందిపుచ్చుకుని ప్రజా ఉద్యమాల తీరు మార్చుకున్నప్పుడు ఆశించిన ఫలితాలు దక్కుతాయన్నారు.

## కొరవడిన అంకిత భావం

ఇప్పటి రాజకీయ నాయకుల్లో అంతకిభావం కొరవడిందని తన అవసరానుగుణంగా మసులు కోవడం ద్వారా ప్రజల విశ్వాసం పొందలేరని పువ్వాడ తెలిపారు. కార్యకర్తలను రక్షించుకోగలిగిన నాయకులు సుదీర్ఘ కాలం ప్రజా క్షేత్రంలో మనగలుగుతారని, ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వారి గెలుపులు తాత్కాలికమేనని ఆయన అభిప్రాయ పడ్డారు. దేశంలో ఇప్పటికీ ఇప్పుడు మార్పు రాకపోవచ్చు కానీ మార్పు తథ్యమని ఆయన స్పష్టం చేశారు. యువత హక్కుల సాధన కోసం పోరు మార్గం ఎంచుకోవడం సరైనదే అన్నారు. మతం, కులం ఎన్నికల ఎజెండాలోకి రావడం దురదృష్టకర పరిణామమన్న పువ్వాడ ఆర్థిక అసమానతలు లేని, వివక్ష లేని సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తున్నానన్నారు. విలువలతో జీవించడం, ప్రజల మధ్య గడపడం, సమయపాలన పాటించడం ప్రజాప్రతినిధులు అలవర్చుకోవాలని ఆయన సూచించారు.

# 27న ఘనంగా ఎస్‌టియు 'ఎనభై వసంతాల వైభవోత్సవం'




**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) 80వ వార్షికోత్సవాన్ని ఈనెల 27న ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్‌టియు అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్‌లో దాదాపు 10 వేల మంది ఉపాధ్యాయులతో 'ఎనభై వసంతాల వైభవోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులను కూడా ఆహ్వానించామన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు కార్యాలయంలో 'ఎనభై వసంతాల వైభవోత్సవం' వాల్‌పేపర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ, నాయకులు ఎ.వి. సుధాకర్, దాసరి శ్రీధర్, రంగారావు, శంకర్, పోల్ రెడ్డి, పరమేశ, పున్నకుమార్‌లతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ గత ఎనిమిది దశాబ్దాలుగా ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాడుతూ, అనేక సమస్యలకు పరిష్కారాలు సాధించిన ఘనత ఎస్‌టియుకు దక్కుతుందని, 1946లో నిజాం కాలంలో సంఘం ఏర్పడి, అంచలంచలుగా ఎదుగుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్రను పోషించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయస్సు 55 నుండి 58 సంవత్సరాలకు పెంపు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, అప్రెంటీస్ రద్దు వంటి అనేక సౌకర్యాలను సాధించిన ఘనత ఎస్‌టియుదని వివరించారు. ఎస్‌టియు నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పలువురు ముఖ్యమంత్రులు (నీలం సంజీవరెడ్డి, జలగం వెంగళ్ రావు, నారా చంద్రబాబు నాయుడు, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి) హాజరయ్యారన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## అందం మాటున ఆందోళన



ప్రజాపక్షం/నెక్కొండ: పంట చేలల్లో కలుపు మొక్కగా పీకేస్తున్న వయ్యారి భామ..శుభకార్యాల అలంకరణలో మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తెల్లని పుష్పాలతో అందంగా కనిపించే ఈ మొక్కను డెకరేషన్ నిర్వాహకులు విపరీతంగా వినియోగిస్తున్నారు. అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు వయ్యారిభామను పంటచేలల్లో లేకుండా తొలగిస్తున్నారు. ఈ మొక్క పుష్పాలపై ఉండే పుప్పొడి, ఇతర భాగాల వలన కొందరికి అలర్జీ, దురద వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, పంటలకు కొత్త తెగుళ్లు సోకే అవకాశం ఉందని, పశువులకు సైతం వింత వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉందని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందం కోసం వినియోగిస్తున్న ఈ పుష్పాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అందంగా కనిపించే ప్రతి పుష్పం ఆరోగ్యానికి అనుకూలం కాదనే విషయాన్ని వయ్యారిభామ గుర్తు చేస్తోంది.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గళానికి హరీశ్‌రావు అండ



ప్రజాపక్షం/ఖిలావరంగల్: గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ వ్యవస్థలో సేవలందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిజిగ్నేషన్లు మార్చి జీతాల్లో కోతలు విధించడం అన్యాయమని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దృష్టికి ఉద్యోగుల ప్రతినిధులు తీసుకెళ్ళారు. ఉద్యోగుల సమస్యలను విన్న హరీశ్‌రావు... అన్యాయం జరిగితే తాము రంగంలోకి దిగి, ఉద్యోగులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రావయంతో పాటు సోషల్ మీడియా వేదికలుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. సిడిఎంఎ శ్రీదేవితో ఫోన్‌లో మాట్లాడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నాయకులు మియాపురం శ్రీకాంత్‌తో పాటు పలువురు మహిళా ఉద్యోగులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా 8,288 కేసులు పరిష్కారం: శ్వేత



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వీటి ద్వారా 8,288 కేసులు పరిష్కార మయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 93 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ స్టేషను కమిషనర్ శ్వేత తెలిపారు. మొన్న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1595, ఈ పెట్టి కేసులు 2171, మోటార్ వెహికల్ చట్టం కేసులు4522, సైబర్ కేసులు 134 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 93,30,616 రూపాయలు బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించింది.

## అకాల వర్షానికి కూలిన ఇండ్లు



ప్రజాపక్షం/రాయపర్తి: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఐత కొమురయ్యకు చెందిన పెంకుటిల్లు, మహమ్మద్ మహమూద్‌కు చెందిన రేకుల ఇల్లు ఇంటి గోడలు కూలిపోయి నిరాశ్రాయులయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి శనివారం వారం ఇండ్లను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి ప్రభుత్వం నుండి వచ్చే సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ మల్లయ్య, ఐత లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిల్లో పోస్టుల భర్తీకి ఎంపిక పరీక్ష



ప్రజాపక్షం/జనగామ: జిల్లాలోని కెజిబివిల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకులు, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టుల భర్తీకి ఎంపిక పరీక్ష ఆదివారం కలెక్టరేట్‌లో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. బచ్చన్నపేట, నర్మెట కెజిబివిల్లో ఇంగ్లీష్ బోధనకు రెండు పోస్టులకు ఐదుగురు అభ్యర్థులు హాజరయ్యారు. చౌడారం కెజిబివిలో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టుకు ఐదుగురు దరఖాస్తు చేసుకోగా ముగ్గురు పరీక్ష రాశారు.ఈ కార్యక్రమంలో జిసిడిఓ గౌసియా బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి



ప్రజాపక్షం/దేవరుప్పుల:మండలంలోని బంజారాగ్రామంలో ఇంటివద్ద గుడుంబా తయారుచేస్తున్నట్లు సమాచారం అందడంతో దేవరుప్పుల ఎస్ఐ సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. భూక్య శాంతమ్మ ఇంటి వద్ద గుడుంబా తయారీకి ఏర్పాటు చేసిన అట్టి బట్టిని పోలీసులు ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న సుమారు 15 లీటర్ల బెల్లం పానకా న్ని ధ్వంసం చేసి, 3 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భూక్య శాంతమ్మపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించాలి

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే వారికి పూర్తి సహకారం* స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్





ప్రజాపక్షం/హనుమకొండ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు.ఆదివారం హనుమకొండ మున్సిపల్ గెస్ట్ హౌస్ సమీపంలో శివకుమార్ అనే వ్యక్తి చెరువు మట్టితో సహజంగా, పర్యావరణహితంగా తయారుచేసిన మట్టి గణపతి విగ్రహాల స్టాల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల తయారీ విధానం, వాటి ప్రత్యేకతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మట్టి గణపతికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. గత పన్నెండుసంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు శివ కుమార్ కలెక్టర్ కు వివరించారు. మట్టి విగ్రహాలను చాలా ఆకర్షణీయంగా తయారు చేశారని కలెక్టర్ ప్రశంసించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించి, ప్రకృతి వనరులను కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు.చెరువు మట్టితో సహజంగా తయారు చేసిన గణపతి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండ ఉంటుందన్నారు. మట్టి విగ్రహాల నిమజ్జనం సులువుగా జరుగుతుందని, నిమజ్జనం అనంతరం లభించే మట్టిని చెట్లకు, పొలాలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మట్టి గణపతులను ప్రతిష్టించడంపట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని అన్నారు.మట్టి వినాయక విగ్రహాల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే వారికి జిల్లా యంత్రాంగం పరంగా పూర్తి సహకారం ఉంటుందన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకుందామన్నారు. పర్యావరణ హితమైన వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

## 220 పడకల ఆసుపత్రి పేరుకేనా?

బిజెపి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రాచారి డిమాండ్

ప్రజాపక్షం/ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 220 పడకలకు అనుగుణంగా కనీస మౌళిక వసతులు కల్పించాలని బిజెపి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి డిమాండ్ చేశారు. సుపత్రిలో సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మహిళా వార్డులో వాష్‌రూమ్ సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. పనిచేయని అత్యవసర వైద్య పరికరాలు పక్కన పడేయడంతో అత్యవసర సేవలు నామమత్రంగా మారాయని విమర్శించారు. డయాబెటిస్ రోగులకు అవసరమైన ఇన్సులిన్ సైతం అందుబాటులో లేక బయట నుండి తెచ్చుకోవాలని సిబ్బంది చెబుతున్నారని అన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి విషమించిన రోగులను వరంగల్‌కు తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యం లేక కేవలం 108 వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి సమస్యలపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా అధికారులు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సీతక్క కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లు, నిరంతర తాగునీరు, అత్యవసర వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది, ప్రత్యేక అంబులెన్స్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. 220 పడకల ఆసుపత్రికి అనుగుణంగా అన్ని మౌళిక వసతులను అభివృద్ధి చేసి పేదలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే బిజెపి ఆధ్వర్యంలో ప్రజల తరుపున పెద్ద యెత్తున ఆందోళన చేపడతామని రవీంద్రాచారి హెచ్చరించారు.

## వర్షంతో అన్నదాతలో కొత్త ఆశలు



ప్రజాపక్షం/గూడూరు;గత కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయుడంతో ఆందోళనకు గురైన అన్నదాతలకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొత్త ఆశలు రేపుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గూడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు అడపాదడపా భారీ వర్షం కురిసింది.వర్షాలు ఆలస్యం కావడంతో ఈ ఏడాది సాగు పరిస్థితులపై రైతుల్లో ఆందోళన నెలకొంది. తొలకరి వర్షాల ఆధారంగా పంటలు సాగు చేసినప్పటికీ అనంతరం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ముఖ్యంగా వర్షాదారంగా సాగు చేస్తుపన్న పత్తి మి, వరి తదితర పంటలకు సరైన సమయంలో వర్షం అందకపోవడంతో మొక్కలు వాడిపోతున్న పరిస్థితి నెలకొంది. ఎండిపోయిన మొక్కలకు జీవం తాజాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పోలాల్లో తేమ పెరిగింది. ఇప్పటికే కొంత మేర సాగు చేసిన వరి పంటతో పాటు పత్తి మిరప ఇతర పంటలకు వర్షపు నీరు అందడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగుకు ఊతమిచ్చిన వర్షాలు మహబూబబద్ జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుత వర్షాలు రైతులకు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. చెరువులు కుంటలు వాగుల్లోకి నీరు చేరితే రానున్న రోజుల్లో సాగునీటి సమస్య కొంతవరకు తీరుతుందని ఆశిస్తున్నారు . అయితే పంటలు పూర్తిస్థాయిలో కొలుకోవాలంటే మరికొన్ని రోజులు వర్షాలు అవసరమని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాలు ఇలాగే కొనసాగితే ఈఏడాది పంట దిగుబడులపై ఆశలు పెట్టుకోవచ్చని అన్నదాతలు చెబుతున్నారు. మొత్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గూడూరు మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా రైతుల్లో నెలకొన్న ఆందోళన కొంతవరకు తొలగి ఈ వానలు పంటను కాపాడుతాయనే ఆశలు చిగురిస్తున్నాయి.

## ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను రద్దు చేయాలి

ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా




ప్రజాపక్షం/భూపాలపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను బొగ్గు గనులలో ఉపయోగించడం వలన దేశవ్యాప్తంగా అక్కడక్కడా సీరియస్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, సింగరేణి కాలరీస్‌లో కూడా తీవ్ర ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగాన్ని రద్దు చేయాలని ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ ఆసిఫ్ పాషా డిమాండ్ చేశారు.బొగ్గు గనులలో పనిచేస్తున్న కార్మికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వలన ప్రమాదాలు జరుగుతాయనే భయంతో కార్మికులు పనిచేయాల్సి వస్తోందని, దీని వల్ల పని సమయం వృథా కావడంతో పాటు రోజువారీ బొగ్గు ఉత్పత్తి కూడా తగ్గుతుందని తెలిపారు. గతంలో బొగ్గు గనులలో ఉపయోగించిన ఎలక్ట్రిక్ డిటోనేటర్లను తిరిగి వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని, కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించడంతో పాటు గనులలో సురక్షితమైన పని వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.సింగరేణి కాలరీస్‌లో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగంపై సమగ్రంగా పరిశీలన జరిపి, వాటి వల్ల కార్మికుల భద్రతకు ముప్పు ఉంటే నిషేధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆసిఫ్ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, కాంట్రాక్ట్ కార్మికుల ఇన్‌చార్జ్ నూకల చంద్రమౌళి,సోతుకు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్‌పై కనికరం కలగదా?

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

శాసనమండలి చైర్మన్‌కు కాంట్రాక్టర్ చందా కుమార్ వినతి



ప్రజాపక్షం/ములుగు: అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు కావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్‌కు ములుగు జిల్లా కాంట్రాక్టర్ చందా కుమార్ వినతిపత్రం అందజేశారు. రహదారులు, తాగునీటి పథకాలు, పాఠశాలలు, భవనాలు, సాగునీటి పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను అప్పులు చేసి పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో అధిక వడ్డీల భారం పడుతోందన్నారు. మిషన్ భగీరథ, మన ఊరు..మన బడి, ఎస్‌డిఎఫ్ తదితర పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బిల్లులు ఆలస్యం కావడంతో బ్యాంక్ రుణాలు, ప్రయివేట్ అప్పులు, కార్మికులు, సరఫరాదారుల బకాయిలు చెల్లించలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, అర్హత ఉన్న బిల్లులను రాజకీయాలకు అతీతంగా వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై దృష్టి సారించాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. కాంట్రాక్టర్లను అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చందా కుమార్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ నేత సుకుమార్



ప్రజాపక్షం/మంగపేట : మంగపేట మండలంలో అఖినేపల్లి మల్లారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ జిల్లా మెంబర్ దళితరత్న రాజమళ్ళ సుకుమార్ ఆదివారం హైదరాబాద్ లో మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో మంగపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అధ్యర్యంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడకుల అశోక్ పటేల్ రాజమల్ల సుకుమార్ ను స్వాగతం పలికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు అనంతరం సుకుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు ములుగు జిల్లా ను మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నచ్చి పార్టీలో చేరాను నాకు ఈ అవకాశం ఇచ్చిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గ్రంథాలయ చైర్మన్ రవిచందర్ జిల్లా అధ్యక్షులు అశోక్ పటేల్, మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ కు ధన్యవాదములు తెలుపుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు నాకు ఎ బాధ్యత అప్పగించిన నావంతుగా కష్టపడి ప్రజా ప్రభుత్వంలో నేను ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఉంటానని రాజమల్ల సుకుమార్ తెలిపారు.

## వర్షాలతో భీముని జలపాతం పరవళ్లు



ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం సమీప పచ్చటి అడవుల మధ్య ఉన్న భీముని పాదం జలపాతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలకళను సంతరించుకుంది.ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కొండలు నుంచి నీరు భారీగా ప్రవహిస్తూ జలపాతం వద్ద జూలువారుతోంది. దీంతో భీముని పాదం పరిసర ప్రాంతాలు మరింత ఆహ్లాదకరంగా మారాయి. వర్షాలతో అడవులు పచ్చదనంతో కళకళలాడుతుండగా కొండల మధ్య నుంచి జూలువారుతున్న జలధారలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా మారాయి. సాధారణ రెజుల్లో కంటే వర్షాకాలంలో భీముని పాదం జలపాతం అందాలు మరింత కనువిందు చేస్తాయి.జలపాతం వద్ద నీటి ప్రవాహం పెరగడంతో ప్రకృతి ప్రేమికులు పర్యాటకులు ఈప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కొనసాగితే జలపాతం వద్ద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో మహబూబాబాద్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు భీముని పాదం జలపాతాన్ని సందర్శించే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులు స్నేహితులతో కలిసి ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ఇది అనువైన ప్రదేశంగా నిలుస్తోంది. అయితే జలపాతం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా నీటి ప్రవాహానికి దూరంగా ఉండి ప్రకృతి అందాలను ఆస్వాదించాలని అడవీ శాఖ అధికారులు కోరుతున్నారు. వర్షాలతో భీముని పాదం జలపాతం సరికొత్త అందాలను సంతరించుకోవడంతో ఈ ప్రాంతం మరోసారి పర్యాటకులను ఆకర్షిస్తోంది.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ వరంగల్ : వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం నిర్వహించనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించా రు.ముఖ్యంగామట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు, రసాయనిక రంగుల వినియోగాన్ని నివారించాలని సూచించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లాలో రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పాడి, పంటల సాగు అనుకూలంగా కొనసాగి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

## మట్టి గణపతులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని

ప్రకృతిని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించాలనే సంకల్పంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మట్టి గణపతులను పంపిణీ చేశారు. పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ మేరకు హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు.రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా, ప్రకృతికి హాని కలగకుండా మట్టి గణపతులను పూజించాలని ఎమ్మెల్యే సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి : విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. వినాయక మంటపాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా ప్రజలందరూ జిల్లా యంత్రాంగం మార్గదర్శకాలను పాటిస్తూ భక్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వినాయక చవితి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# సాయుధ పోరాట అమరులను స్మరించుకుందాం

వారికి ఘనమైన నివాళి అర్పిద్దాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరి



**ప్రజాపక్షం/చర్ల :** 78వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా అమరులను స్మరించుకుంటూ వారికి ఘనమైన నివాళి అర్పిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చర్ల మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా వ్యవహరించిన పటేల్, పట్వారీ, జమీందార్, జాగీర్దార్లను కమ్యూనిస్టు గెరిల్లాలు తరిమి కొట్టి ఆ స్ఫూర్తిని నేటి తరానికి అందించారన్నారు. 1948 సెప్టెంబర్ 17న సాయుధ పోరాట ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. భూమి భుక్తి వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ పోరాటాన్ని హిందూ ముస్లీం ఘర్షణలుగా చూపే మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చీకటి ఒప్పందం ఫలితంగానే నిజాం రాజుకు గవర్నర్ పదవి కట్టబెట్టారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయింది తప్ప పటేల్ సైనిక చర్య వల్ల కాదని స్పష్టం చేశారు. ఆ పోరాటంలో 4500 మంది యువకిశోరాలు ప్రాణత్యాగం చేశారన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర సిపిఐది అని అన్నారు. అమరుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీ నారాయణ మండల కార్యవర్గ సభ్యులు కోటిరెక్కల రాజారావు, నూప తిరుపతి, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, అప్పులూరి నాగరాజు, మల్లం నాగేశ్వరరావు, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, నూపా రాము, నూపా మురళీ, మునిగెల సాయి, తోట శ్రీను, సోడి సీతారాములు, మడకం సుక్కయ్య, రవ్వ పొండు, చెన్నం సాంబశివరావు, లక్ష్మీ అనసూయ, నర్సింహారావు, వీరన్న, రమణ, రామయ్య, దేవయ్య, కన్నయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలి: ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఐఖ్యత నడుమ జరుపుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆయన ఆదివారం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గపరిధిలోని గ్రామీణ ప్రాంతాలు బస్తీల్లో ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున ప్రతిష్టించిన వినాయక మండపాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ అందించాలని, రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. భక్తులు ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు గట్టి బందో బస్తు నిర్వహించాలన్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసేంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## చికిత్స పొందుతూ మృతి

**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వైరా ఎస్ఐ పుష్పాల రామారవు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9వ తేదీన రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద రోడ్డ దాటుతుండగా వైరాకు చెందిన పువ్వాళ్ల వెంకటయ్య అలియాస్ గుడ్డి వెంకటయ్య(52)ను గ్రీన్‌ఫీల్డ్ నుండి వైరా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుని ఖమ్మం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: ఎసిపి సారంగపాణి

**ప్రజాపక్షం/వైరా:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకునేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వైరా ఎసిపి సాదుల సారంగపాణి సూచించారు. ఈ సందర్భంగా ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ఆదర్శంగా నిర్వహించాలని కోరారు. 14న గణేష్ చతుర్థి, 25న నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండపాలు, విగ్రహాలు, నిర్వాహకులు, శోభయాత్ర మార్గం, నిమజ్జన వాహనాల వివరాలను నమోదు చేసి జియోట్యాగింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. మండపాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు కనీసం ఇద్దరు వ్యక్తులు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మండపాల వద్ద లక్కీ డ్రాలు, జూదం నిర్వహించరాదని, మద్యం సేవించి ఎవరూ మండపాల వద్దకు రాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ అనుమతితలోనే విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకోవాలని, నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. డిజెలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని, ఇతర మతాలను కించపరిచేలా ప్రసంగాలు, పాటలు, ప్రచారాలకు దూరంగా ఉండాలని ఎసిపి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. నిమజ్జన శోభయాత్రను పోలీస్‌శాఖ రూపొందించిన రూట్ మ్యాప్ ప్రకారమే నిర్వహించాలని, శాంతి కమిటీలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఎసిపి సాదుల సారంగపాణి కోరారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కాలుష్యరహిత పండుగలు జరుపుకోవాలి

ఆర్యవైశ్య మహాసభ కృషి అభినందనీయం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీ దేవిపల్లి , లోతువాగు గ్రామపంచాయతీలలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య యువజన మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం మట్టివిగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పాషా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమైన జీవకోటికి ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. పూర్వం నుండి వస్తున్నసాంప్రదాయానుసారం మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రకృతికి హానీ కలగకుండా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకొచ్చిన ఆర్యవైశ్య మహాసభ పలు విభాగాల ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భావితరాల వారికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలంతా కాలుష్య రహిత పండుగలను జరుపుకోవాలని పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దారా ధీరజ్, పాషా, బిల్లా శ్రీధర్, శ్రీకాంత్, ఆదర్ల శ్రీకాంత్ ,బోయిన శివ, బోయిన ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## చేపల చెరువులో నిమజ్జనం వద్దు

తీవ్రంగా నష్టపోతున్నాం

మత్స్యకారులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** చేపల పెంపకం జరుగుతున్న చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగితే నీరు కలుషితమై చేపలు మరణించి తీవ్రంగా నష్టపోతామని మత్స్యకారులు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ధంసలాపురం చెరువులో వినాయక నిమజ్జనాలు చేయరాదని కొత్తగూడెం మత్స్యకార సొసైటీ సభ్యులు పగడాల మల్లేష్, ముద్రబోయిన అప్పారావు లు తెలిపారు. చేపల పెంపకానికి ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తున్నామని ఈ చెరువుపై ఆధారపడి 80 కుటుంబాలు జీవిస్తున్నాయని వారు తెలిపారు. గతంలో ఖమ్మం నగరంలో కలుషిత నీరు రావడంతో టన్నుల కొద్ది చేపలు చనిపోయాయని వారు తెలిపారు. గుర్రపుడెక్క పెరిగి చేపలు పట్టే పరిస్థితి లేదని ఇప్పుడు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగితే నీళ్ల విషపూరితమై చేపలు మరణిస్తాయని మల్లేష్, అప్పారావు లు తెలిపారు. ప్రభుత్వ యం త్రాంగం తగు చర్యలు తీసుకుని నిమజ్జనాన్ని ధం సలాపురం చెరువులో జరగకుండా చూడాలని వా రు విజ్ఞప్తి చేశారు. ప్రకటన చేసిన వారిలో సొసై టీ సభ్యులు పగడాల శ్రీను, వెంకటేశ్వర్లు, శేష య్య, నాగేశ్వర రావు, రాంబాబు, శ్రీను, వెం కన్న, రా ము, పగడాల వెంకటేశ్వర్లు, బాబు లు ఉన్నా రు.

## సాయుధ పోరాట వీరులకు సిపిఐ ఘన నివాళి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సిపిఐ అశ్వారావుపేట మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిపిఐ నియోజకవర్గ కార్యాలయం రజబ్ అలీ భవన్‌వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ సలీం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడి, వెట్టి చాకిరి, నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. పేద రైతులు, కూలీలు, మహిళలు, గిరిజనులు, అణగారిన వర్గాలు ఎదుర్కొన్న దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం దేశ చరిత్రలోనే గొప్ప ప్రజా ఉద్యమంగా నిలిచిందన్నారు. భూస్వామ్యుల పెత్తనం, అక్రమ వసూళ్లు, వెట్టి చాకిరి వంటి దోపిడి విధానాలకు వ్యతిరేకంగా పేద ప్రజలు ధైర్యంగా పోరాడారని, ఈ పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు కూడా కీలక పాత్ర పోషించారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరచడంలో ఉద్యమానికి అండగా నిలవబడంలో వారు చూపిన ధైర్యం, త్యాగం స్ఫూర్తిదాయకమని అన్నారు. పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను నేటితరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కూడా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల భూ హక్కుల కోసం సిపిఐ నిరంతరం పోరాడిందని సయ్యద్ సలీం తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల త్యాగాలను కేవలం జ్ఞాపకం చేసకోవడం మాత్రమే కాకుండా, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శి వగ్గెల అర్జునరావు, చీపుర్ల సత్యవతి, శ్రావణి, సజ్జ శ్రీను, చెన్నారావు, వాసు, వెంకన్న, విష్ణు, రాధ, పురుషోత్తం, ప్రసాద్,బాషా, మహాలక్ష్మీ , నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'అరసం' రామయ్యకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అభ్యుదయ రచయితల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి రామయ్యను తెలంగాణ అమరవీరుల ట్రస్ట్, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 'భావన' కవిత సంకలనాన్ని సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆవిష్కరించారు. భావన కవిత సంకలనంలో కొంపెల్లి రామయ్య రచించిన 'జీవన సమరం' అనే కవిత ముద్రితమైంది. పుస్తకావిష్కరణ సందర్భంగా రామయ్యను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ శ్రీనివాస్, సినీ దర్శకుడు బాబ్జీ, అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, అమరవీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల తనిఖీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** పైలెట్ ప్రాజెక్టు కింద కొడవటి మెట్ట గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి స్థాయిలో తనిఖీ చేసినట్లు ఎంపిడిఒ శ్రీధర్ రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల పిడి ఆదేశాల మేరకు గ్రామంలో నిర్మాణలో ఉన్న ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ, పురోగతి, లబ్దిదారుల వివరాలు , ఇండ్ల నిర్మాణ పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన తనిఖీ ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు నమోదు చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు వేగంగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెడిపల్లి రవి, సర్పంచ్ తిరుమలరావు, ఉప సర్పంచ్ జగన్ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి

పెరుగుతున్న విద్యుత్ కోతలు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. హామీల అమలుకై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆయన తెలిపారు. మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జి.రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రంగారావు మాట్లాడుతూ హామీల అమలు పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని రెండున్నర ఏళ్ల గడిచినా హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో వర్షాకాలంలోనే విద్యుత్ కోతలు పెరుగుతున్నాయని రానున్న కాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని విద్యుత్ కోతలను నివారించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్‌లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పంటలను కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. సత్వరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులను కేటాయించాలన్నారు. విద్యుత్ కోతలపై ఆందోళన నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 22ఎ రైతాంగానికి ఇబ్బందిగా మారిందని దీనిపై ప్రభుత్వం ప్రభుత్వం పునరాలోచన చేసి 22ఎ జిఒను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, శివలింగం, శిరోమణి, లలిత పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ


వినాయక చవితిని భక్తితో జరుపుకుందాం

మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని ప్రతొక్కరూ బాధ్యతగా మట్టి విగ్రహాలను పూజించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రసాయనాలు పిఒపి తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమై జలచరాలు ప్రాణాలు కోల్పోతాయని చెప్పారు. ప్రకృతికి ఎలాంటి హాని కలుగకుండా సాంప్రదాయ బద్ధంగా పండుగలను జరుపుకోవాలని స్పష్టం చేశారు. ఈ మట్టి విగ్రహాల పంపిణీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం శుభ పరిణామమన్నారు. రాబోయే తరాలలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిచేందుకు పర్యావరణ హితమైన పద్ధతులు పాటించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగడప పద్మ, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, శాంతి ప్రియ, సహేరాఅహ్మద్, ధనలక్ష్మీ , నాగలక్ష్మీ , హారిత, దుర్గయ్య, హిమశ్రీ, దాసరి శ్రీనివాస్, కళావతి, స్థానికులు సత్యనారాయాణ చారి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆదరణ సేవా ఫౌండేషన్'కు దుస్తులు, సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం అన్న సినీ కవి మాటలు నిజం చేస్తున్నారు ప్రముఖ సంఘ సేవకులు లంకా కొండయ్య, ప్రముఖ సంఘ సేవకురాలు మైలా నిస్సీ ఆదివారం ఉదయం స్థానిక ఆజాద్ రోడ్డులో లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు లంకా కొండయ్య బృందం ధాతలు ఇచ్చినటువంటి దుస్తులు, ఇంటి సామగ్రిని ఆదరణ సేవా ఫౌండేషన్‌లో ఉన్నటువంటి వృద్ధులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ మధిరలో ఉన్నటువంటి చాలా మంది ప్రముఖులు ఇచ్చేటువంటి దుస్తులు కాని సామగ్రి చాలామంది నిరుపేదలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

## తలసేమియా చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప డే కేర్ సెంటర్‌లో తలసేమియా చిన్నారులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హేమటాలజిస్టు వైద్యులు వెంకటరమణ తన వైద్య బృందంతో కలిసి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు అనుగుణంగా బాధితులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటరమణ మాట్లాడుతూ సంస్థ ప్రతినిధుల సలహాలు పాటిస్తూ చిన్నారులకు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. హిమోగ్లోబిన్ శాతం ఎనిమిది కంటే తగ్గకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. చిన్నారులకు సకాలంలో రక్తం ఎక్కించడంతో పాటు మందులు కూడా క్రమపద్ధతిలో వాడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కిన్నెర మెమోరియల్ ట్రస్టు బాధ్యులు కంఠమనేని రాజగోపాల్, వైద్యులు సోహితరెడ్డి, రుచిత, శరత్, రేడియాలజిస్టు నాగేశ్వరరావు, నారాయణమూర్తి, సంకల్ప సంస్థ బాధ్యులు రవిచందర్, అనిత, పావని పాల్గొన్నారు.

# సాయుధ పోరాట వీరుల త్యాగాలు చిరస్మరణీయం

చరిత్రను వక్రీకరించే కుట్రలను తిప్పికొడదాం

సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు సలిగంటి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కమ్యూనిస్టుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన అంతమైందని సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు సలిగంటి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. సిపిఐ కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం సెంటర్‌లో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఎర్రజెండా ఎగురవేసి అమరుల స్థూపాల వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం భూమి భుక్తికోసం నాలుగువేల మందికిపైగా అమరులై రక్తధారపోసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని స్పష్టం చేశారు. నాటి పోరాటంలో కనీస పాత్ర లేని మతోన్మాద కాషాయశక్తులు నేడు చరిత్రను మత కోణంలో వక్రీకరించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజల ఐఖ్యతతో సాగిన చారిత్రక విప్లవాన్ని తప్పుదోవ పట్టించే కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని అమరుల ఆశయసాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. వీరస్వామి, జిల్లా సమితి సభ్యులు నెరెళ్ల రమేష్, భూక్య శ్రీనివాస్, పట్టణ నాయకులు వెంకటేశ్వరరావు, భవాని, తల్లాకుల భాస్కర్, మల్లేష్, రవికిరణ్, కాశి నాగరాజు, సాంబిరెడ్డి, కార్పొరేటర్ నాగలక్ష్మీ , మంగ రామలక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

## చెత్తలో ఆర్ అండ్ బి సూచిక బోర్డు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరుకొండిలో రోడ్లు భవనాలు శాఖ సూచిక బోర్డు చెత్తలో పడిపోయింది. దీనిని తీసేవారు, సరి చేసేవారు, సవరించేవారు లేనందున అది గత కొద్ది రోజులుగా చెత్తలోని ఉండటం వలన తుప్పుబట్టి పాడవుతుంది. ప్రయాణికులు మూలమలుపు వద్ద ఉన్న సూచిక బోర్డు లేకపోవడం వల్ల వాహనదారులు తికమక పడుతున్నారు. మండలంలోని పెద్ద కోరుకొండిలో పెట్రోల్ బంక్ సమీపంలో ఈ విధంగా పడిపోయి ఉన్నందున ఆ సూచక బోర్డును సరిచేయాలని వాహనదారులు, ప్రయాణికులు ఆర్ అండ్ బి శాఖ అధికారిని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బి శాఖ అధికారిని వివరణ కోరగా సవరిస్తామని పేర్కొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
14-09-2026
www.prajapaksham.in
స్థానికం LOCAL NEWS

## పంటలు ఎండిపోతున్నాయి కాపాడండి!



**ప్రజాపక్షం/మల్లాపూర్:** వర్షాలు పడక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే మరోపక్క ప్రభుత్వం విద్యుత్ కోతలతో ఇబ్బందులు పెడుతుందని పంటలు ఎండిపోతున్నాయి మహాప్రబో కాపాడండి అంటూ మండల కేంద్రంలో సబ్ స్టేషన్ రహదారిపై రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయాల్సింది పోయి సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను నానా అవస్థలు పెడుతుందని రైతులకు ఇలాంటి దుస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యుత్తును అందించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని అధికారులు సైతం పట్టించుకోవడంలేదని తమ బాధను ఎవరికి చెప్పుకోవాలంటూ రైతులు ఆక్రోసానికి గురయ్యారు.మల్లాపూర్ సబ్ డివిజన్ పరిధిలో మండల కేంద్రంలో సరైన సిబ్బంది లేక విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడితే ఎవరిని సంప్రదించాలో తెలియక రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తిందని ఇంకెన్నాళ్లు మాకు ఇలాంటి దుస్థితి అంటూ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయమైన విద్యుత్ అందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజన్న మహేష్ రెడ్డి, ముష్కరి సురేందర్ రాజ్ కుమార్,రాజారెడ్డి,రమేష్ రెడ్డి,నాగరాజు,బిక్షపతి,లక్ష్మ ణ్,జగ్గుల గంగాధర్,మల్లారెడ్డి,వెంకట్ రెడ్డి,జీవన్,జలపతి మహిపాల్ భూమా రెడ్డి,వివిధ గ్రామాల రైతులుజతదితరులు ఉన్నారు.

## శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి: సిపి

**ప్రజాపక్షం/కరీంనగర్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను కమిషనరేట్ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా సీపీ పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ద్వారా ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, నిమజ్జన మార్గాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని సీపీ తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాలంటీర్లు 24 గంటలూ మండపం వద్ద అందుబాటులో ఉంటూ పోలీసులకు సహకరించాలని, మండపాల వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ల బోర్డులను ప్రదర్శించాలన్నారు. మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట తదితర ప్రధాన నిమజ్జన ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు, తగినన్ని భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్ దీపాలు, ముందస్తుగా గజ ఈతగాళ్లను (స్విమ్మర్లు) సిద్ధంగా ఉంచుతున్నామ్మన్నారు. అనుమానిత సమాచారం కోసం డయల్ 112 సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే తక్షణమే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ విజయవంతం చేయాలని కమిషనర్ గౌష్ ఆలం ప్రజలను, ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు.

## పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి గణపతుల పంపిణీ: శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. అదేవిధంగా 22వ, 50వ డివిజన్ల పరిధిలోని చైతన్యపురి కాలనీలో, 14వ డివిజన్ చింతకుంటలో నిర్వహించిన ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాల్లోనూ మేయర్ పాల్గొని ప్రజలకు విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కాలుష్యానికి గురికాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, గడ్డి ప్రదీప్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## బూత్‌స్థాయి నుండే ప్రతి కార్యకర్తా పార్టీ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నా బూత్ స్థాయి నుండి ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 39 వార్డుల అధ్యక్షులు, బిఎల్‌ఏలతో పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ రాబోయే ఎన్నికల్లో భవిష్యత్‌ను నిర్ణయించే ఓట్లే కీలకమన్నారు. 7 అక్టోబర్, 2026 వరకే గడువు ఉన్నందున నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలు గడువు లోపు సమర్పించేలా వార్డు అధ్యక్షులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. బిఎల్‌ఏలకు ప్రతి పోలింగ్ బూత్‌పై పూర్తి పట్టు ఉండాలన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మ్యాక్ అసెంబ్లీ అని పెట్టి చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఆకునూరి బాలరాజు, రవీందర్, లక్ష్మ ణ్, వెంగళ అశోక్, ఉపాధ్యక్షులు శ్రీరాముల వెంకటేశం, రమేశ్, కౌన్సిలర్ శ్రీశైలం, మల్యాల నాగరాజ్, పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'సర్' ప్రక్రియ పూర్తి చేయాలి

అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం



**ప్రజాపక్షం/కరీంనగర్:** 'సర్' ప్రక్రియను అధికారులు సిబ్బంది పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుండా.. ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి సంబంధిత ఓటర్లకు అవసరమైన నోటీసులను వెంటనే అందజేయాలని బిఎల్‌వోలను ఆదేశించారు. నోటీసుల అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో రెండు లక్షల 70 వేల మందికి దరఖాస్తులు అందించాల్సి ఉండగా 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందించామని తెలిపారు.. దాదాపు లక్ష మంది వరకు నోటీసులకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం గమనిక లో సూచించిన గుర్తింపు కార్డులను అధికారులకు సమర్పించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం–6, ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం–7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం–8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. బిఎల్ వో సూపర్ వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అన్‌మ్యాప్డ్ ఓట్ల గుర్తింపు, నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సవరణలో అధికారుల పాత్రతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం–7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం.. అనర్హుల పేర్లు తొలగించడం.. నమోదైన వివరాల్లో తప్పులు లేకుండా చూడటమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుందని, అందుకు ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించుకుని సహకరించాలని కోరారు. SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు

**ప్రజాపక్షం/జగిత్యాల/మల్యాల:** జగిత్యాల జిల్లాలోని మల్యాల క్రాస్ రోడ్డు నుండి మల్యాల మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన బ్రిడ్జి గుంతలమయంగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదకరంగా మారింది. ఆదమరిస్తే అంతే సంగతులు అని ప్రజలు పేర్కొంటున్నారు.అధికారులు తక్షణమే బ్రిడ్జి పై మరమ్మతులు చేపట్టి రక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజాపక్షం ఫోటో గ్రాఫర్ జగిత్యాల జిల్లా.



## త్వరలో కరీంనగర్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనతో మధిర, మంథని, మంచిర్యాల ప్రాంతాల్లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా కరీంనగర్ లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సిద్ధం చేశారు. కరీంనగర్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 17 మండలాల పరిధిలో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందిస్తారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో రూపొందించిన మెనూ సోమవారం ఇడ్లీ – సాంబార్, మంగళవారం: పూరి – ఆలు కుర్మా, బుధవారం దోష – చెట్నీ,గురువారం ఉప్మా – చెట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ – సాంబార్,శనివారం బోండా – చట్నీ తో కూడిన ప్రతిరోజు ఒక వెరైటీ ఉంటుంది. విద్యార్థులకు రోజు విడిచి రోజు పాలు కూడా అందిస్తారు. విద్యార్థులకు ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయనున్నారు. విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా చదువుపై దృష్టి సారించేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

## మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** మట్టి గణపతి లను పూజించి,పర్యావరణాన్ని కాపాడదామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం రోజున వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణ కేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి నియోజకవర్గ ప్రజలందరికి మట్టి వినాయకుడి విగ్రహాలను అందజేసిన తదుపరి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా రసాయన విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని, వాటి వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, నుగుల్ల మల్లయ్య,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను నిర్వహించే నైతిక హక్కు బిజెపికి లేదు

సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె.కనకరాజ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సామ్రాజ్యవాదులకు గులాం గా ఉంటూ భారతదేశ ప్రథమ స్వాతంత్ర సమరానికి వెన్నుపోటు పొడిచిన స్వదేశీ సంస్థానాదిశులలో ఒకడు,జాగీర్ దారి ఫ్యూడల్ నిరంకుశ పాలనకు వెట్టిచాకిరికి, కట్టు బానిసత్వానికి మూలకారకుడైన నిజాం నవాబు మీరు ఉస్మాన్ అలీ ఖాన్ బహదూర్ ఫ్యూడల్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిజాం రాజు గద్దెను కూల్చడానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, ట్రేడ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి,కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, కామ్రేడ్ మఖ్దూం మోహియొద్దీన్ లు ఒక సంయుక్త ప్రకటనలో తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించాయి. తెలంగాణ రైతాంగ విప్లవ పోరాటం బహుముఖ ప్రాముఖ్యత గలది. దేశంలోకెల్లా పెద్దదైన నిజాం ఫ్యూడల్ సంస్థానాన్ని బద్దలు కొట్టడమే ధ్యేయంగా దున్నేవానికి భూమి కావాలి అన్న నినాదంతో ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థని కూల్చి, విప్లవ ధ్యేయాన్ని మరియు సాధించవలసిన కర్తవ్యాన్ని నేర్పింది. అయ్యా నీ బాంచన్ అన్నోళ్లె బందూకులు పట్టారు. కాల్మొక్త గులాపోలం అన్నోళ్లె గుత్పలెత్తారు ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చిన పిలుపునందుకుని బరిసెలు గొడ్డళ్లు కారప్పొడులే ఆయుధంగా ధరించి రజాకారులను, పెత్తందారులను తరిమి, తరిమి కొట్టడం చారిత్రాత్మకం. వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది తెలంగాణ యోధులు నేల కొరిగారు. తొలి అమరుడుగా దొడ్డి కొమరయ్య చరిత్ర పుటల్లో నిలిచాడు. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా నిజాం నవాబు పాలన అంతమైంది. నైజాం సంస్థానం భారతదేశంలో విలీనమైంది. 1947 సెప్టెంబర్ 17న యూనియన్ సైన్యాలు తెలంగాణను స్వాధీనం చేసుకున్నాయి. తెలంగాణ సాయుధ సమరంలో తెలంగాణ వీరులు వీరవనితలు కాకతీయ కదనపటిను కనబరిచారు. ఊరురా విప్లవ కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. వీరుల రక్తంతో తెలంగాణ గడ్డ ఎరుపెక్కింది. ఇంతటి చారిత్రాత్మక పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తున్నదని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించే నైతిక హక్కు బిజెపికి లేదన్నారు. 15న గోదావరి ఖని మెయిన్ చౌరస్తా లో జరిగే సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం,రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోషిక మోహన్, గౌతం గోవర్ధన్,యూనియన్ నేతలు కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్, కె స్వామి లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కావున సాయుధ పోరాట స్పూర్తి సభ ను విజయవంతం చేయాలని కనకరాజ్ కోరారు.

## సిఎంఆర్ పేరుతో రైస్ మిల్లులను ఆగం చేయొద్దు

ఎఐటియుసి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రాష్ట్రవ్యాప్తంగా వందలా ది రైస్ మిల్స్ యాజమాన్యం కొన్ని రోజుల నుండి వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలియజేస్తుంది. అని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ పెద్దపెల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ మద్దతు తెలియజేశారు. ప్రభుత్వ విధించిన నియమ నిబంధనలు రైస్ మిల్ ఇండస్ట్రీస్‌ని మూసివేతకు గురి అయ్యే విధంగా ఉన్నాయని సీఎంఆర్‌ల పేరుతో యాజమాన్యాన్ని రైస్ మిల్లులను వేధింపులకు గురి చేయడం మానుకోవాలని. రాష్ట్రంలో బి గ్రేడ్ కింద రైతుల దగ్గర తీసుకున్న ప్యాడిని ఏ గ్రేడ్ కింద ఇవ్వాలని ఆంక్షలు రద్దు చేయాలని అన్నారు. ఎఫ్సిఐ. సివిల్ సప్లై. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైస్ మిల్ ఇండస్ట్రీ తో దోబూచులాట ఆడుతున్నారని ఇప్పటికే రైస్ మిల్లులు నష్టాల ఊబిలోకు రుకపోయి బ్యాంకులకు ఈఎంఐ. అప్పులు వారి సొంత ఆస్తులు ప్రాపర్టీస్ అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందని. ఇది ఇండస్ట్రీ డెవలప్‌కు నష్టం జరుగుతుందని కడారి సునీల్ అన్నారు. వేగవంతంగా అభివృద్ధి చెందే క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం మూలంగా రైస్ మిల్ ఇండస్ట్రీ నష్టాల ఊబిలో కూరుకుపోవడం దానికి కారణం ప్రభుత్వాల వైఫల్యాలు ప్రధాన కారణం అన్నారు. రైస్ మిల్ఇండస్ట్రీకి పెట్టిన అడ్డగోలు షరతులు కండిషన్లు టార్గెట్లు రద్దుచేసి ఇండస్ట్రీ నిలబడడానికి ప్రభుత్వం చేయూత అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది ఇండస్ట్రీ నష్టాలు జరిగి మూసివేత దిశగా వస్తే వందలాదిమంది స్థానిక వలస కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని, ఇప్పటికే సమ్మె వల్ల కార్మికులు అర్ధాకలితో అలమటిస్తూ ఉన్నారని, ప్రభుత్వం వెంటనే రైస్ మిల్ యాజమాన్యాలతో చర్చలు జరిపి వారికి అండగా నిలిచి రైస్ మిల్ ఇండస్ట్రీ రోడ్డున పడకుండా కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రైస్ మిల్ ఇండస్ట్రీకి ప్రత్యక్ష మద్దతుగా ఆందోళనలు పోరాటాలు చేపట్టవలసి వస్తుందని కడారి సునీల్ ప్రభుత్వానికి తెలియజేశారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన


ఎస్‌సి మహేశ్ బి. గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని దీని ద్వారా అనేక కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టగా జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న 228 కేసులు, 56 పెట్టి కేసులు, 823 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 11456 ట్రాఫిక్ చలాన్ కేసులు, 75 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించామని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల బాధితులకు సంబంధిత బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన రూ.2,79,030/ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. లోక్ అదాలత్ విజయవంతం కావడంలో సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ అక్కసు

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట :** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని.. సిద్దిపేట అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి అక్కసుతో నిధులు మంజూరు చేయటం లేదని, మళ్లీ బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే సిద్దిపేట అభివృద్ధిని రెట్టింపు వేగంతో పరుగులు పెట్టిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో 286 మందికి 65 లక్షల 60వేలు రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతు వివిధ కారణాలతో ఆసుపత్రి లో చేరి చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈ చెక్కులను వెంటనే బ్యాంక్ లో వేసుకోవాలని చెప్పారు. పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏందో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏందో ప్రజలకు అర్థం అయిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి అన్ని బంద్ పెట్టిందని వచ్చే రోజుల్లో కాంగ్రెస్‌ను బంద్ చేసేందుకు ప్రజలు సిద్ధంగ ఉన్నారని చెప్పారు. కెసిఆర్ మళ్ళీ రావాలి అని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్కసు చూపుతుందని మండిపడ్డారు. పదేళ్ల గుంతలు లేని రోడ్లు ఉండే ఈ మూడేళ్లల్లో ఏ రోడ్డు చూసిన గుంతలే కనపడుతున్నాయన్నారు. అధికారం రాకముందు 24 గంటల కరెంట్ అన్నాడు. వెటర్నరీ కళాశాలను రేవంత్‌రెడ్డి తరలించక పోయారని. వచ్చేది మన ప్రభుత్వమే.. మళ్ళీ అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని చెప్పారు. మీ ఆదరణ, మీ ఆప్యాయత గుండెల్లో పెట్టుకుంటానని ఎల్లప్పుడూ మీ సేవలో ఉంటానన్నరు..

**తిమ్మాయిపల్లి, భాషాగుడేం కార్యకర్తలు బిఆ-ర్‌ఎస్‌లో చేరిక:** నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి,భాషాగుడేం గ్రామానికి చెందిన గుండె బోయిన రాజు, కలకుంట్లసాగర్‌లు మాజీ మంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పదేండ్ల పాలన, కాంగ్రెస్ పాలన ఏంతో ప్రజలకు అర్థమయిందన్నారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ రాజు. నాయకులు నర్సింలు, కృష్ణ, ఎంపిటిసి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


## 16న ఎఐటియుసి ఆర్జీవన్ జనరల్ బాడీ సమావేశం

ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), ఆర్జీ వన్ బ్రాంచి జనరల్ బాడీ సమావేశం సెప్టెంబర్ 16 న బుధవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఏర్పాటు చేయనైనదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఇట్టి సమావేశంలో యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి గార్లు పాల్గొని ఆగస్టు 27 న లేబర్ కమిషనర్ వద్ద సమ్మె నోటీసు లోని డిమాండ్ ల పై జరిగిన ఒప్పంద వివరాల పై ప్రసంగించెదరని ఆయన పేర్కొన్నారు. కనుక సింగరేణి కార్మిక సోదరులు, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.

## నేనూ ఒక ‘దిమాగి నక్సల్’

### రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్



**కొచ్చి :** తాను కూడా ఒక ‘దిమాగి నక్సల్’ అని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ అన్నారు. నక్సలిజం భావజాలంగల వారిపై ఆరోపణలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, బిజెపి ‘దిమాగి నక్సల్’ అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఆదివారం కేరళంలోని కొచ్చిలో జరిగిన ‘భేర సారాలు, ప్రజాస్వామ్యం’ అనే అంశంపై కపిల్ సిబల్ మాట్లాడుతూ తాను కూడా ఒక ‘దిమాగి నక్సల్’ అని అన్నారు. తన ప్రసంగం ప్రారంభంలో తాను ఒక దిమాగి నక్సల్ అని ఒప్పుకోవాలని చెప్పారు. హార్స్ ట్రేడంగ్‌పై కపిల్ సిబల్ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో యుద్ధాల ఫలితాలను నిర్ణయించడంలో అశ్వ జాతి కీలక పాత్ర పోషించేదని అన్నారు. అప్పట్లో గుర్రాలకున్న ప్రాముఖ్యత కారణంగా, వాటిని అమ్మేవారు కొనుగోలుదారులకు విక్రయించేటప్పుడు రకరకాల ఎత్తుగడలు వేసేవారని ఆయన అన్నారు. ‘ఇప్పుడు ఇది వేరే రంగు పులుముకుంది. ఆ సమయంలో, అమ్మేవాడే మోసగాడుగా ఉండేవాడు. ఈ సమయంలో, కొనుగోలుదారుడే మోసగాడు. అదే తేడా’ అని లైవ్‌లా నిర్వహించిన కార్యక్రమంలో సిబల్ అన్నారు. భేరసారాలు ‘తాత్కాలిక రాజకీయ కుంభకోణం’ కాదు, అది ఒక ‘రాజ్యాంగ సంక్షోభం’ అని ఆయన అన్నారు. ఇది ప్రాతినిధ్య ప్రభుత్వంపై, ఓటు సమగ్రతపై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రాథమిక నిర్మాణంపై దెబ్బ కొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ‘హార్స్ ట్రేడింగ్’ ఒక నీచమైన పద్ధతికి పెట్టే నీచమైన పదం అని కపిల్ సిబల్ చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న మెజారిటీ స్థానంలో, ఎన్నికల తర్వాత సృష్టించబడిన మెజారిటీని తీసుకురావడానికి, ఎన్నికైన ప్రతినిధులను వ్యవస్థీకృతంగా కొనుగోలు చేయడం లేదా ప్రలోభపెట్టడమే ఈ పద్ధతి అన్నారు. కొన్నిసార్లు ఇది నగదు, పదవి, విచారణ నుండి రక్షణ వంటి క్రూరమైన రూపాల్లో ఉంటుందని, మరికొన్నిసార్లు ఇది విలీనం అనే గౌరవప్రదమైన ముసుగులో బయటపడుతుందని చెప్పారు.

## మూడు రోజులు..15 మంది ప్రపంచనేతలు...

### బ్రిక్స్‌దేశాలతో వాణిజ్య, రక్షణ, ప్రజా సంబంధాలపై ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు










**న్యూఢిల్లీ:** బ్రిక్స్ 18వ సదస్సుకు న్యూఢిల్లీ వేదికగా ఆతిథ్యం ఇచ్చిన సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఒక్కరోజే నాలుగు దేశాల నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్–సిసి, కజఖ్ అధ్యక్షుడు కస్సిమ్ జోమాత్ తోకయేవ్‌లతో సమావేశాలు జరిపారు. అదేవిధంగా బురుండీ అధ్యక్షుడు అవరిస్తే ఎన్డయిషిమియే,ఉగాండా ఉపాధ్యక్షుడు జెస్సికా అలుపో, నైజీరియా ఉపాధ్యక్షుడు కాషిమ్ షెట్టిమాలతో ఈ సమావేశాలు నిర్వహించారు. వాణిజ్యంలో సహకారం,పెట్టుబడులు,రక్షణరంగ సహభాగస్వామ్యంతోపాటు ప్రజలకు ప్రజలకు మధ్య సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వంటి విషయాలపై ప్రధానంగా దృష్టి సారించి ప్రపంచ నాయకులతో చర్చించారు. మొత్తంగా మూడు రోజుల్లో 15 బ్రిక్స్ సభ్యదేశాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు.

మోదీ సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, రామఫోసాతో సంపూర్ణస్థాయిలో భారత్–దక్షిణాఫ్రికా సంబంధాలపై సమీక్ష చేసినట్లు పేర్కొన్నారు. ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యంతోపాటు గనుల తవ్వకాల్లో సహకారం, కీలక ఖనిజాలు, మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, ప్రజలకు బహిరంగ మౌలిక సదుపాయాల డిజిటలీకరణ, సరికొత్త సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడం వంటి విషయాలపై చర్చించారు. ‘‘మన రెండు దేశాల భాగస్వామ్యానికి చారిత్రక నేపథ్యం ఉంది,ఇప్పుడు ప్రధానంగా భవిష్యత్‌పై దృష్టి సారించాం, ఆఫ్రికాతో భారత్ సన్నిహితంగా కలిసి పని చేస్తుంది, దక్షిణార్ధగోళ దేశాలతో సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుంది, ప్రపంచ నియమాలను పాటించడంలో, శాంతి సాధనలో మరింత సమతుల్యత పాటిస్తుంది’’ అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. భారత విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, రామఫోసా–మోదీ ఇద్దరూ పరస్పర ఆసక్తిగల ప్రపంచ సమస్యలపై అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నారని, బహుళపక్ష వేదికలపై సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని ఇద్దరు నాయకులూ అంగీకరించారని తెలియజేసింది. ‘‘చిఱుత పులులకు దక్షిణాఫ్రికా నుండి భారత్‌కు తరలించి విజయవంతంగా పునరావాసం కల్పించిన నేపథ్యంలో పులి,చిరుతపులి,మంచులో ఉండే చిరుతలు,అమెరికా పులి,చారలు,చుక్కలు లేని పులి,సింహం వంటి ఆరు రకాల ఫెలిస్‌జాతి అడవి మృగాల రక్షణకోసం ప్రాజెక్టు టైగర్ 50వ వార్షికోత్సవం సందర్భంగా 2023లో మోదీ ప్రారంభించిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ కూటమి (ఐబిసిఎ)లో చేరాల్సిందిగా దక్షిణాఫ్రికాకు ఆహ్వానం పలికారు’’ అని ఎంఇఎ తెలియజేసింది.

అదేవిధంగా మార్కోస్ జూనియర్‌తో సమావేశంలో భారత్–ఫిలిప్పీన్స మధ్య ఆర్థిక సంబంధాలలో వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష జరిపారు. సాంకేతికత,వాణిజ్యం,అంతరిక్షం,నవీన ఆవిష్కరణలకు సంబంధాలను మెరుగుపరచుకోవాలని ఆశించారు.భారత్–ఏసియన్ కార్యకలాపాలపై కూడా చర్చించినట్లు మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. అన్ని రంగాలలోనూ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరు దేశాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యక్షుడు ఎల్–సిసితో మీడియా అద్భుతమైన ఇష్టాగోష్టి నిర్వహించిందని కూడా మోదీ తెలియజేశారు. అదేవిధంగా కజఖస్థాన్ అధ్యక్షుడు తకయేవ్‌తో చర్చలు ఎంతో ఫలవంతంగా జరిగాయని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. వాణిజ్యం,పెట్టుబడులు,ఇంధనం,సాంకేతికత,అనుసంధానం,నవీన ఆవిష్కరణలు వంటి విషయాల్లో గాఢ సహకారం పెంచుకోవాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు.

భారత్–బురుండీ దేశాలమధ్య సంబంధాలపై ఆ దేశ అధ్యక్షుడితో మోదీ చర్చించారు. అభివృద్ధి సహకారం,సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం,యువతరం నైపుణ్యాలు,వ్యవసాయం,శుద్ధ ఇంధనం రంగాలలో సహకారాన్ని ఇనుమడింపజేయాలని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. అదేవిధంగా నైజీరియా ఉపాధ్యక్షుడు షెట్టిమాతో వాణిజ్య,విద్యుత్,శుద్ధ ఇంధనం,ఎరువులు,రక్షణ రంగాల అంశాలపై మోదీ చర్చించారు. ఆరోగ్యం,సాంకేతికతపై కూడా చర్చించారు. అధ్యక్షుడు సుబియంతో కూడా మోదీతో సమావేశమై భారత్–ఇండోనేసియా భాగస్వామ్యంపై చర్చించారు.

మొత్తంగా చూస్తే సెప్టెంబరు 11–12–13 తేదీలలో 15 మంది ప్రపంచ నాయకులతో విస్తారంగా వేరు వేరు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.మోదీ ఊపిరిసలపకుండా దౌత్య కార్యకలాపాలు నిర్వహించారని ఆదివారం నాడు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.అదేవిధంగా మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం,వియత్నాం ప్రధానమంత్రి లే మిన్ హంగ్, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో,తదితర నాయకులతో ప్రధానమంత్రి మోదీ సమావేశాలు నిర్వహించారు. బ్రిక్స్ సదస్సుకు 11 సభ్యదేశాలు,10 భాగస్వామ్య దేశాలతోపాటు కొన్ని అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

ఈ ద్వైపాక్షిక సమావేశాలతోపాటు అదనంగా వివిధ దేశాల నాయకులతో సమావేశాలతోపాటు సదస్సులో పాల్గొన్న వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కూడా సమావేశాలు నిర్వహించారు. మొదట బ్రిక్స్ సమావేశాల ముందురోజు శుక్రవారం సాయంత్రం రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. మరుసటిరోజు సాయంత్రం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,అబుధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ దేశాలన్నీ భారత్‌కు కీలక వాణిజ్య భాగస్వాములే.

## 80% భారతీయులు మాంసాహారులు

### ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత దేశంలో 80 శాతం మంది మాంసాహారులని, భారతీయ మాంసాహారం చాలా రుచికరంగా ఉంటుందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే దేశంలో జరుగుతున్న బిక్స్‌లో సదస్సులో శుక్రవారం పూర్తిగా శాకాహార భోజనం వడ్డించడంతో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం భారత్ మండపంలో బ్రిక్స్ సదస్సు నాయకులు, ప్రతినిధుల కోసం ఈ విందు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రాహుల్‌గాంధీ పోస్ట్ చేస్తూ ‘రికార్డు కోసం చెబుతున్నాను: 80 శాతం భారతీయులు మాంసాహారులు. భారతీయ మాంసాహారం చాలా రుచికరంగా ఉంటుంది. మా సోదరి చేసే చోలే భటూరే కూడా అంతే’ అని అన్నారు. భోజన బల్లపై ఉన్న చోలే భటూరే చిత్రాన్ని రాహుల్ పోస్ట్ చేశారు. బ్రిక్స్ సదస్సులో స్టార్టర్స్‌గా ‘ఖండ్వీ మిల్లే’ (ఆవిరి మీద ఉడికించిన శనగపిండి రోల్), పుదీనా గింజలతో పెనం మీద కాల్చిన పుట్టగొడుగుల కబాబ్‌లైన ‘ఖుంబ్ గలోటి’ని వడ్డించారు. ప్రధాన వంటకాలలో ‘పనీర్ లబబ్దార్’, ‘గుచ్చి మర్మిక్’ (హిమాలయన్ మోరెల్ పుట్టగొడుగులు, లేత ఆస్పరాగస్), ‘క్యారెట్ బీన్ పొరియల్’ అందించారు. మెనూలోని ఇతర వంటకాలలో ‘తక్కాలి బెల్లె సారూ’ (తేలికపాటి పప్పు పులుసు), మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రైతా, రకరకాల భారతీయ రొట్టెలు ఉన్నాయి. డెజర్ట్‌ల విషయానికొస్తే, వివిఐపి అతిథుల కోసం ‘ఓల్డ్ ఢిల్లీ ఫ్రూట్ క్రీమ్ విత్ జలేబి’ ‘షాహటూట్ ఫిర్నీ’తో మెనూ ముగిసింది. ప్రధానంగా భారత దేశం, అలాగే బ్రిక్స్ సభ్య దేశాల నుండి వచ్చిన 100 మందికి పైగా కళాకారుల బృందం ప్రదర్శన ఇస్తుండగా ఈ విందు భోజనం అందించారు.

**మలేషియా ప్రధానమంత్రితో రాహుల్ భేటీ**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఢిల్లీలో మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో అల్పాహార సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్–మలేషియా సంబంధాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. ఇబ్రహీంతో జరిగిన అల్పాహార సమావేశంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల ఫోటోలను కాంగ్రెస్ విడుదల చేసింది. వాణిజ్యం, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగాలలో సహకారంపై దృష్టి సారించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇబ్రహీం చర్చలు జరిపిన ఒక రోజు తర్వాత ఈ సమావేశం జరిగింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఈ ఇద్దరు నాయకులు సమావేశమయ్యారు. మలేషియా బ్రిక్స్ కూటమిలో భాగస్వామ్య దేశం. అలాగే ఆసియాన్ కూటమిలో భారత్‌కు ఇది ఒక కీలక భాగస్వామ్య దేశం.

## వరద గుప్పిట్లో 48 లక్షల మంది

### సెప్టెంబర్‌లో ఇప్పటివరకు బిహార్‌లో 108.8 మి.మీ వర్షపాతం



**పాట్నా :** బిహార్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. వరదల పెద్ద ఎత్తున పోటెత్తాయి. అయితే ఆదివారం నాటికి 48 లక్షల మందికి పైగా ప్రజలు ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ప్రమాద స్థాయికి పైన ప్రవహిస్తున్న చాలా నదులలో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభించిందని అధికారులు తెలిపారు. 15 జిల్లాల్లోని 87 బ్లాకుల పరిధిలోని 575 గ్రామ పంచాయతీలలో సుమారు 48.35 లక్షల మంది ప్రజలు ఈ వరదల వల్ల ప్రభావితమయ్యారని వారు పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ శాఖ (డిఎండి) ప్రకారం, పాట్నా, భోజ్‌పూర్, సరన్, వైశాలి, భాగల్‌పూర్, బేగుసరాయ్, అరారియా జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమైన వాటిలో ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు బిహార్‌లో 108.8 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణం కంటే సుమారు 20 శాతం ఎక్కువని అధికారులు తెలిపారు. బల్తార్, కుర్సెలా వద్ద కోసి నది, ఖగారియా వద్ద బుర్హి గండక్, దిఘా, గాంధీ ఘాట్, హతిదా, భాగల్‌పూర్, కహల్‌గావ్, ముంగేర్ వద్ద గంగా నది, శ్రీపాల్‌పూర్ వద్ద పున్‌పున్, బెనిబాద్ వద్ద బాగ్మతి, అలాగే దరౌలి, గంగ్‌పూర్ సిస్వాన్ వద్ద ఘఘ్రా నదులు ప్రమాద స్థాయికి పైన ప్రవహిస్తున్నాయని డిఎండి తెలిపింది. ప్రభుత్వ యంత్రాంగం 1,251 సామాజిక వంటశాలలను (కమ్యూనిటీ కిచెన్స్) నిర్వహిస్తుండగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో 13 సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో సుమారు 12,260 మందికి వసతి, ఆహారం, వైద్య సేవలు, ఇతర నిత్యావసర వస్తువుల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి, రవాణా కోసం సుమారు 1,790 పడవలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన పది బృందాలు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన 27 బృందాలను మోహరించారు.

**బిహార్ పట్ల కేంద్ర సవతి తల్లి ప్రేమ**

వరద సహాయం విషయంలో కేంద్ర ప్రభుత్వం బిహార్ పట్ల ‘సవతి తల్లి’ వైఖరిని ప్రదర్శిస్తోందని రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆదివారం పాట్నాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తేజస్వీ మాట్లాడుతూ బిహార్‌కు సహాయక ప్యాకేజీని సాధించడంలో విఫలమైనందుకు ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులపై విమర్శలు గుప్పించారు. గుజరాత్‌లో వరదలు వచ్చినప్పుడల్లా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే సహాయంపై హామీలు ఇవ్వడం, రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడటం, భారత వైమానిక దళంతో సహా సహాయక దళాలను పంపాలని ఆదేశించడం వంటివి చేస్తారు. కానీ, ఎన్నికల ప్రచారానికి వచ్చి ‘లిట్టిచోఖా’ తినే బిహార్ పట్ల మాత్రం సవతి తల్లిలా వ్యవహరిస్తున్నారు అని యాదవ్ ఆరోపించారు. వరదలను ‘జాతీయ విపత్తు’గా ప్రకటించాలని, తక్షణమే రూ. 5,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ 7న ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు యాదవ్ తెలిపారు. బిహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ఇంజిన్లు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ప్రధాని మోదీతో ఎంత తరచుగా మాట్లాడతారో నాకు తెలియదు, కానీ కేంద్ర సహాయాన్ని ఎందుకు సాధించలేకపోయారో అర్థం కావడం లేదన్నారు. బిహార్ నుండి చాలా మంది కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, రాష్ట్రానికి కేంద్ర సహాయాన్ని తీసుకువచ్చేంత ప్రభావం వారిలో ఎవరికీ లేదన్నారు. మోదీ, చౌదరిలకు తాను రాసిన లేఖలకు ఎటువంటి స్పందన రాలేదని యాదవ్ పేర్కొన్నారు. వరదల సమయంలో ప్రధాని బిహార్‌ను ఎలాగైతే విస్మరించారో, భవిష్యత్తులో ప్రజలు ఆయన్ని అలాగే విస్మరిస్తారు అని ఆయన అన్నారు.

## ‘సిఎం పదవి సద్వినియోగంలో స్పష్టంగా విఫలమయ్యా’!

### సిజెపి కన్వీనర్ దీప్కే వ్యంగ్య పోస్టు



**భోపాల్ :** మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లాలో గిరిజన పిల్లల మరణాల విషయంలో మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ‘కాక్రోచ్ జనతా పార్టీ’ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆదివారం వ్యంగ్యాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు పేర్కొంటూ ఎక్స్‌లో ఒక వ్యంగ్య లేఖను పోస్ట్ చేశారు. ఆగస్టు 13 నాటి ఆ లేఖలో, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్‌ను ఉద్దేశించి దీప్కే ‘బాలాఘాట్‌లో 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించిన తర్వాత, ఈ పదవిలో కొనసాగడానికి నా అంతరాత్మ అంగీకరించడం లేదు, అందుకే రాజీనామా చేస్తున్నాను’ అని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా ఆయన కృతజ్ఞతలు తెలుపుతున్నా అని, అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తాను స్పష్టంగా విఫలమయ్యానని పేర్కొన్నారు. బాలాఘాట్ మరణాల విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును, ముఖ్యంగా బాధితుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారాన్ని ఈ వ్యంగ్య లేఖ లక్ష్యంగా చేసుకుంది. ఒకవేళ మరణించిన వారు మంత్రులు లేదా ఎమ్మెల్యేల పిల్లలై ఉంటే, రూ. 24 లక్షల పరిహారం సరిపోయేదా అని కూడా దీప్కే ప్రశ్నించారు. బాలాఘాట్ అదనపు కలెక్టర్ డి.పి. బర్మన్ తెలిపిన వివరాల ప్రకారం, మరణించిన 24 మంది పిల్లల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున పరిహారం అందించారు, మిగిలిన వారికి సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతోంది. అమాయక పిల్లల మరణాలు అత్యున్నత స్థాయిలో జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్నాయని దీప్కే ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ తర్వాత ఆ పోస్ట్ తన పరిధిని విస్తరించి, కుళాయి నీటి సరఫరా, విద్య, గిరిజన సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఎండగట్టింది. బాలాఘాట్‌లోని కొన్ని గిరిజన కుటుంబాలు ఇప్పటికీ నదీ జలాలపైనే ఆధారపడుతున్నాయని, అనేక గ్రామాల్లోని పాఠశాలలు పశువుల కొట్టాల కంటే అధ్వాన్నమైన స్థితిలో ఉన్నాయని దీప్కే ఎత్తిచూపారు. రాష్ట్రంలో వరుసగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల వైఫల్యాలను నొక్కిచెప్పేందుకు... విద్యుత్ సౌకర్యం లేని గిరిజన కుటుంబాలు, షెడ్యూల్డ్ తెగలపై నేరాలు, పిల్లలలో పోషకాహార లోపం వంటి అంశాలపై ప్రభుత్వ గణాంకాలను కూడా ఆయన ప్రస్తావించారు. తన నకిలీ రాజీనామా లేఖను ముగిస్తూ, ‘బాలాఘాట్ ప్రజలకే కాకుండా రాష్ట్రంలోని గిరిజనులందరికీ తాను అన్యాయం చేశానని’ దీప్కే అన్నారు. ఇంతమంది అమాయక పిల్లలు మరణించిన తర్వాత, ‘ఈ పదవిలో కొనసాగే నైతిక హక్కు తనకు ఉందని తాను భావించడం లేదని’ ఆయన పేర్కొన్నారు. బాలాఘాట్‌లోని వ్యాధిగ్రస్త గ్రామాలలో దీప్కే పర్యటించిన ఒక రోజు తర్వాత ఈ పోస్ట్ వచ్చింది. అక్కడ, కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జరిగిన ఘర్షణ కారణంగా కుటుంబాలతో ఆయన సంభాషణకు అంతరాయం కలిగింది. ఈ వారం ప్రారంభంలో, బాలాఘాట్ జిల్లాలో అంటువ్యాధుల కారణంగా 30 మందికి పైగా పిల్లలు మరణించిన ఘటనపై మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పందన కోరింది. ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వివేక్ రుసియా, జస్టిస్ ప్రదీప్ మిట్టల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ, మహిళా, శిశు అభివృద్ధి శాఖ, బాలాఘాట్ కలెక్టర్, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. పిల్లలకు సరైన చికిత్స అందడం లేదని, 50 పడకల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో సుమారు 400 మంది పిల్లలకు చికిత్స అందిస్తున్నారని ఆ పిఐఎల్ ఆరోపించింది. ప్రభావిత ప్రాంతాల్లోని చేతిపంపుల నుండి పసుపు రంగు నీరు వస్తోందని, పిల్లలకు, మహిళలకు చాలా నెలలుగా సకాలంలో పోషకాహారం అందడం లేదని కూడా ఆరోపించింది.

### తమిళనాడులో ఉప ఎన్నికల్లో
## వామపక్షాలు స్వతంత్రంగా పోటీ

### ధరాపురం నుంచి సిపిఐ, మధురాంతకం నుంచి సిపిఐ(ఎం) పోటీ



**చెన్నై/తిరుచిరాపల్లి :** తమిళనాడులో వచ్చే నెలలో అసెంబ్లీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార టివికెకు బయటి నుంచి మద్దతు ఇస్తున్న సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం చొప్పున పోటీ చేయనున్నట్లు ఆదివారం ప్రకటించాయి. అక్టోబర్ 6న జరిగే ఈ ఉప ఎన్నికల్లో ధరాపురం నుంచి సిపిఐ, మధురాంతకం నుంచి సిపిఐ(ఎం) పోటీ చేయనున్నాయి. ఆదివారం చెన్నైలో విలేకరులతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికలు సహజంగా వచ్చినవి కావని, అవి అధినాయకత్వం లేదా పరిస్థితుల వల్ల బలవంతంగా రుద్దబడినవి అని పేర్కొన్నారు. ఏ ఎన్నికల కూటమిలోనూ చేరకూడదనే తమ విధానానికి కట్టుబడి ఉంటూనే, సిపిఐ ఈ ఉప ఎన్నికల్లో సిపిఐ(ఎం)తో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకుందన్నారు. తాము తాము ఎన్నికల్లో పోటీ చేయాలనే మా అభిప్రాయాన్ని సిపిఐ(ఎం)కు తెలియజేశాము, వారు కూడా అదే నిర్ణయానికి వచ్చారని చెప్పారు. సిపిఐ ధరాపురం నుంచి పోటీ చేస్తుందన్నారు. తిరుచిరాపల్లిలో విలేకరులతో మాట్లాడిన మార్క్సిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం. షణ్ముగం, ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించిందని, ఇది వామపక్ష పార్టీలైన సిపిఐ(ఎం), సిపిఐ, సిపిఐ (మార్క్సిస్టులెనినిస్ట్)ల స్వతంత్ర పోరాటంగా ఉంటుందని చెప్పారు.

## శబరిమల యాత్రకు రూ. 551 కోట్లు

**తిరువనంతపురం :** శబరిమల యాత్ర ఏర్పాట్ల కోసం ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి)కు ప్రభుత్వం రూ. 551.5 కోట్లు కేటాయించిందని కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఆదివారం తెలిపారు. తన కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో, గత ప్రభుత్వం శబరిమల యాత్ర ఏర్పాట్ల కోసం 2025–26లో రూ. 377.80 కోట్లు, 2024–25లో రూ. 326.97 కోట్లు కేటాయించిందని సతీశన్ పేర్కొన్నారు. యాత్ర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్ సమర్పించిన ప్రతిపాదన మేరకు ఈ రూ. 551.5 కోట్ల నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. శబరిమలలో రాబోయే మండలకాల–మకరవిళక్కు యాత్ర సీజన్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాత్ర సాగేలా చూసేందుకు ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) కలిసి పనిచేస్తాయని సతీశన్ ఈ వారం ప్రారంభంలోనే వెల్లడించారు. ఈ ఏడాది మండలకాల–మకరవిళక్కు యాత్ర సీజన్ నవంబర్ మధ్యలో ప్రారంభమై, వచ్చే ఏడాది జనవరి మూడవ వారంలో ముగుస్తుంది.

## అడ్రస్ లేని పార్టీలకు రూ. వేల కోట్ల విరాళాలా?

- ఇలాంటి ఆరు చిన్న పార్టీలకు 2023-24లో రూ.1,700 కోట్లకు పైగా నిధులు..
- కాంగ్రెస్, వామపక్ష, బిఎస్‌పి, ఆప్ జాతీయ పార్టీలకు రూ.1480.43 కోట్లు మాత్రమే




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుజరాత్ రాజకీయాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెద్దగా కార్యకలాపాలు కనిపించని, ప్రజల్లో కూడా పెద్దగా ఉనికి లేని కొన్ని చిన్న రాజకీయ పార్టీలకు వేల కోట్ల రూపాయల విరాళాలు అందినట్లు ఓ పరిశోధనాత్మక నివేదిక వెల్లడించింది. 201920 నుంచి 202324 వరకు ఐదేళ్ల కాలంలో గుజరాత్‌లో నమోదైన పది గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు దాదాపు రూ.4,300 కోట్ల మేర విరాళాలు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఆ పార్టీలు దేశంలో రాజకీయ పార్టీగా నమోదై ఉన్నప్పటికీ అసలు కార్యాలయాలు ఎక్కడున్నాయో, కార్యకలాపాలు ఏమిటో స్పష్టంగా కనిపించని కొన్ని పార్టీలకు వందల కోట్ల రూపాయల విరాళాలు అందుతున్నాయన్న అంశం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గుజరాత్‌కు చెందిన ఆమ్ జన్మత్ పార్టీ, గరీబ్ కళ్యాణ్ పార్టీ, సత్యవాదీ రక్షక్ పార్టీ, స్వతంత్ర అభివ్యక్తి పార్టీ, న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ, భారతీయ జాతీయ జనతా పార్టీతో పాటు మరో నాలుగు పార్టీలకు భారీగా నిధులు అందినట్లు వెల్లడైనట్లు తెలుస్తుంది. 202324లో జాతీయపార్టీలైన కాంగ్రెస్, వాపక్షపార్టీ, బిఎస్‌పి, ఆమ్‌ఆద్మీకి కేవలం రూ. 1480.43 కోట్లు మాత్రమే నిధులు రాగా గుజరాత్‌లోని పైన పేర్కొన్న ఆరు చిన్నపార్టీలకు రూ.1,700 కోట్లకు పైగా విరాళాలు వచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా 2023 24 ఆర్థిక సంవత్సరంలో ఆమ్ జన్మత్ పార్టీకి ఆరు వందల కోట్ల రూపాయల నిధులు అందినట్లు పేర్కొనడం సంచలనంగా మారింది. సత్యవాదీ రక్షక్ పార్టీకి సుమారు రూ.330 కోట్లు, గరీబ్ కళ్యాణ్ పార్టీకి రూ.138 కోట్ల మేర విరాళాలు వచ్చినట్లు తెలుస్తుంది.అయితే భారీగా నిధులు అందుకున్న ఈ పార్టీల కార్యకలాపాలు మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది. ఎన్నికల సంఘం వద్ద నమోదైన చిరునామాలను అనుసరించి ఓ మహిళా జర్నలిస్టు ఆయా కార్యాలయాలను సందర్శించగా, కొన్ని కార్యాలయాలు మూసివేసి ఉండటం, మరికొన్ని చోట్ల పార్టీ ప్రతినిధులు అందుబాటులో లేకపోవడం వంటి పరిస్థితులు ఎదురైనట్లు ఆమె పేర్కొన్నారు. కొందరు పార్టీ అధ్యక్షులు తాము పదవులకు రాజీనామా చేశామని, పార్టీలతో తమకు సంబంధం లేదని చెప్పినట్లు వెల్లడించారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఆరు పార్టీలు కలిపి కేవలం 15 మంది అభ్యర్థులను మాత్రమే బరిలోకి దించినట్లు తేలిందని ఆమె పేర్కొన్నారు. భారీగా విరాళాలు అందుకున్న ఆమ్ జన్మత్ పార్టీ ఒక్క అభ్యర్థినే పోటీకి నిలబెట్టినట్లు తెలిపారు. సత్యవాదీ రక్షక్ పార్టీకి భారీగా నిధులు వచ్చినప్పటికీ ఎన్నికల ఖర్చుగా సుమారు రూ.8.48 కోట్లు మాత్రమే చూపించినట్లు పేర్కొన్నారు. మిగిలిన మొత్తంలో రూ.316 కోట్లను ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపించినప్పటికీ, ఆ సంక్షేమ కార్యక్రమాలపై స్పష్టత లేదన్న ప్రశ్నలు తలెత్తాయి.రాజకీయ కార్యకలాపాలు, కార్యాలయాల నిర్వహణ, ఎన్నికల్లో పోటీ వంటి అంశాల్లో పెద్దగా ఉనికి కనిపించని పార్టీలకు ఇంత భారీ మొత్తంలో విరాళాలు ఎలా వస్తున్నాయి? ఆ నిధుల మూలాలు ఏమిటి? వాటిని ఎలా ఖర్చు చేస్తున్నారు? అన్న అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే మరో పరిశోధనాత్మక నివేదిక కూడా వెలువడినట్లు సమాచారం.

**విరాళాల ముసుగులో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేందుకే ..**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. భారీగా విరాళాలు అందుకున్న ఈ రాజకీయ పార్టీలకు నిధులు అందించిన వారు ఎవరు? ఏ సంస్థలు లేదా వ్యక్తులు ఈ విరాళాలు ఇచ్చారు? విరాళాలు ఏ ప్రయోజనం కోసం అందాయి? ఆ మొత్తాన్ని ఎన్నికల ప్రచారానికి కాకుండా ఇతర కార్యకలాపాలకు ఖర్చు చేశారా? లేక లెక్కల్లో మాత్రమే భారీ మొత్తాలు చూపించారా? అన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆయా కంపెనీలు నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకే ఈ చిన్న పార్టీలకు విరాళలలో రూపంలో నిధులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలు, వాటి ఖర్చుల విషయంలో పారదర్శకత ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. ముఖ్యంగా ఎన్నికల్లో ప్రభావం చూపని పార్టీలకు వేల కోట్ల రూపాయల మేర నిధులు రావడం, అదే సమయంలో ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ వివరాల్లో కొన్ని లక్షల రూపాయలే చూపించడం వంటి వ్యత్యాసాలు ఉంటే వాటిపై సంబంధిత సంస్థలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ ఆరు పార్టీలతో పాటు మరో నాలుగు చిన్న పార్టీలకు కలుపుకుని 2023 24లో రూ.4,300 కోట్ల విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయి? రూ.3,500 కోట్ల ఖర్చు ఎక్కడ జరిగింది? ఎన్నికల సంఘానికి రూ.39.02 లక్షలే ఎందుకు చూపించారు? అనే మూడు ప్రధాన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభిస్తేనే ఈ భారీ ఆర్థిక వ్యవహారం వెనుక ఉన్న అసలు చిత్రం బయటపడే అవకాశం ఉంది.

# స్వీడన్ పోలింగ్ పూర్తి: ఉత్కంఠ



**స్టాక్‌హోం:**అతివాదం విజృంభిస్తున్న యూరప్ ఖండంలో స్వీడన్ పార్లమెంటు ఎన్నికలకు ఆదివారం ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. అభ్యుదయవాదులు—పచ్చిమితవాదులకు చెందిన రెండు ప్రధాన కూటములు ఈ ఎన్నికల్లో నువ్వా–నేనా అనే రీతిలో పోటీపడ్డాయి.1.06 కోట్లమంది జనాభాగల స్వీడన్‌లో 80 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు.భారత కాలమానం ప్రకారం,ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సోమవారం కొత్త తేదీలోకి క్యాలెండర్ ప్రవేశించేనాటికి ఎన్నికల ప్రాథమిక ఫలితాలను వెలువడతాయి. అప్పటివరకూ తీవ్రస్థాయిలో ఉత్కంఠ కొనసాగుతోంది. జర్మనీలో హిట్లర్ నాజీ వారసుల ఎ.ఎఫ్.డి.పార్టీ విజయం సాధించిన తర్వాత స్వీడన్ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఐతే ముందస్తు పోలింగ్ నివేదికల ప్రకారం వామపక్షాల నాయకత్వంలోని ప్రగతిశీలవాదులు స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. 349 స్థానాలున్న పార్లమెంటులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ రాజకీయ కూటమికైనా నాలుగోవంతు ఓట్లు లభించాల్సి ఉంటుంది. వామపక్షాల తరఫున సోషల్ డెమొక్రటిక్‌పార్టీకి చెందిన మాగ్డలీనా ఆండర్‌సన్ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉన్నారు. గతంలో ఆమె ప్రధానమంత్రి పదవి నిర్వహించారు.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్వీడన్‌లో అత్యధికకాలం అధికారంలో ఉన్నది వామపక్షాలు,సోషల్ డెమొక్రటిక్‌పార్టీయే.వామపక్ష కూటమిలో నాలుగు పార్టీలు,మితవాద కూటమిలో నాలుగుపార్టీలు ఉన్నాయి.మితవాద కూటమిలో మోడరేట్స్ తరఫున ప్రస్తుత ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ పార్టీ (ఎం.పార్టీ) నాయకుడు ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ తానే మళ్లీ రాబోయే నాలుగు సంవత్సరాల ప్రధానమంత్రిగా ఉంటానని అప్పుడే మంకుపట్టు పడుతున్నారు.ఈ మితవాద కూటమిలో స్వీడన్ డెమొక్రాట్స్ ఆధిపత్యంలో ఉన్నప్పటికీ ఎం.పార్టీ నేత తానే ప్రధానిగా ఉంటానంటున్నారు.ఉత్తర యూరప్ స్కాండినేవియన్ ద్వీపకల్పదేశం స్వీడన్‌లో సోషల్ డెమొక్రాట్స్ తరఫున మాగ్డలీనా ఆండర్‌సన్‌కు ప్రధానమంత్రిగా అవకాశాలు ఉన్నాయి. సర్వే నివేదికల ప్రకారం వామపక్ష కూటమికి 50.8 శాతం,మితవాదులకు 47.6 ప్రజల మద్దతు ఉందని ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ కూటమి అయినా 175 సీట్లు గెలుచుకోవాలి.1980లో నయా నాజీలు,మితవాదులు స్వీడన్ డెమొక్రటిక్‌పార్టీని స్థాపించారు.

# జావా సముద్రంలో నౌక బోల్తా


140 మంది గల్లంతు
107 మంది సురక్షితం



**జకర్తా:**ఇండోనేసియా జావా సముద్రంలో ప్రయాణికుల నౌకలో 140 మంది జాడ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సహాయ బృందాలు హెలికాప్టర్ల ద్వారా ముమ్మర గాలింపు చేస్తున్నాయి. గాలింపు నిమిత్తం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. 243 మంది ప్రయాణికులతో వెళుతున్న 'వర్షో ట్రాన్స్‌పోర్ట్ 8' నౌక ప్రతికూల వాతావరణంలో చిక్కుకోవడంతో ఆ ఫెర్రీతో భూతలకేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. ఆ ఫెర్రీ కెప్టెన్ చివరిసారి డిస్ట్రెస్ మెసేజ్ పంపించారు. సముద్రంలో అలలు 10 అడుగుల కంటే చాలా ఎత్తుగా పైకి ఎగసిపడుతున్నాయని ఆందోళన చెందుతూ ఒక తుది సందేశం పంపించారు. తర్వాత నౌక తిరగబడిందని భావిస్తున్నారు. ఈ నౌకలో ఆరుగురు మరణించారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 107 మందిని కాపాడారు. కానీ 140 మంది జాడ తెలియడంలేదు. వారికోసం గాలింపు కొనసాగుతోంది.ఈ నౌకను చివరిసారిగా బంజర్‌మాసిన్‌కు 148 కి.మీ దూరంలో ఉన్నట్లు గుర్తించారు. సురబయ నుండి బయలుదేరిన ఈ ఫెర్రీ ఆదివారం మధ్యాహ్నానికి దక్షిణ కాళీమంతన్‌లోని బంజర్‌మాసిన్ నగరానికి చేరుకోవాల్సి ఉంది. కానీ మధ్యలోనే ఈ ఫెర్రీతో సంబంధాలు తెగిపోయాయి.జావా సముద్రంలో ఇతర నౌకలన్నింటినీ అప్రమత్తం చేశారు. అందరికీ సమాచారం పంపించారు. ఎవరైనా గల్లంతైనట్లు కనిపిస్తే తక్షణం కాపాడి నౌకలోకి ఎక్కించుకోవాలని ఆదేశాలు వెళ్ళాయి.ట్రిసాక్తి ఓడరేవు వద్ద ప్రయాణికుల బంధువులు తక్షణ సమాచారం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇండోనేసియా 17000 లకు పైగా ఉన్న ద్వీపాల సమూహదేశం. ఇక్కడ చవకగా రవాణాకోసం ఎక్కువగా ఫెర్రీలను ఉపయోగిస్తారు.గతనెలలో కూడా 211 మంది ప్రయాణికులతో వెళుతున్న ఇండోనేసియా ఫెర్రీలో మంటలు చెలరేగాయి. టూరిస్టు ఐలాండ్ బాలి సమీపంలో ఆనాడు ప్రమాదం సంభవించింది. కేవలం రెండు వారాల క్రితమే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా ఫిలిప్పీన్స్‌లో కూడా ఒక ప్రయాణికుల ఫెర్రీలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 76 మంది మరణించారు. మరో 10 మంది కనిపించకుండాపోయారు. నాలుగురోజుల క్రితమే ఫిలిప్పీన్స్‌లో ఈ ఘటన జరిగింది.

# యోధులైతే మా సైన్యాన్ని ఎదుర్కోండి

## అమెరికాకు పెజెష్కియాన్ సవాల్



**టెహ్రాన్:** బెదిరింపులకు, ఒత్తిళ్లకు ఇరాన్ దేశం, ఇరాన్ ప్రజలు లొంగిపోయే ప్రశ్నే ఉత్పన్నంకాబోదని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున ఎక్స్‌వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ,బెదిరించి ఇరాన్ ప్రజలను లొంగదీసుకోలేరన్నారు.''మీరు యోధులైతే మా సైన్యాన్ని ఎదుర్కోండి'' అని సవాలు చేశారు. అదేవిధంగా అత్యవసర సేవలపై దాడులు చేయడంవల్ల మానవతాసేవలు,పౌరసేవలకు తీవ్ర విఘాతం కలుగుతోందని చెబుతూ ఇది యుద్ధనీతి కాదన్నారు. ఈ దాడుల చెల్లుబాటును,చట్టబద్ధతను ప్రశ్నించారు.పౌర మౌలిక సదుపాయాలపైన,ఆహార సరఫరాలపైన,ప్రజల జీవనోపాధిపైన ఎందుకు దాడులు చేస్తున్నారు? అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు.''వారు మనుషులైతే ఎందుకు ప్రజలకు ఔషధాలు,ఆహారం,నీటి సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు?'' అని ప్రశ్నించారు.ఇరాన్ ప్రజలను బెదిరించి లొంగదీసుకోలేరు,కష్టకాలంలో వారు పోరాటాలకు అండగా నిలబడ్డారు అని పేర్కొన్నారు. ఇరాన్‌పై ఎకనామిక్ డి డే ను అమలు చేస్తున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఇరాన్‌కు సహాయం చేసే దేశాలు కూడా మూల్యం చెల్లించాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. కానీ ట్రంప్ ప్రస్తుతం ఏకాకిగా మారుతున్నారు. కాగా ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో ఇరాన్ బుషెర్ రాష్ట్రం నుండి 2,364 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసినట్లు ఆ రాష్ట్ర కస్టమ్స్ విభాగాధిపతి అలీ సొలోమైనీ ప్రకటించారు.రాష్ట్రంలో వ్యాపారులు 32 దేశాలకు ఈ మేరకు ఎగుమతులు చేశారని చెప్పారు.

# చేతల రాజకీయ శకానికి నాంది పలికిన మోదీ

● పత్రికాగోష్ఠిలో అమిత్ షా భజన● మోదీ పనితీరుపై 17 నుండి 'సేవా సంకల్ప్ అభియాన్' ● 2029 నాటికి 21 రాష్ట్రాలో యుసిసి అమలు

**ముంబయి:**దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతల రాజకీయ శకానికి నాంది పలికారని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ముంబైలో ఆదివారం జరిగిన పత్రికాగోష్ఠిలో చెప్పారు. సెప్టెంబరు 17వ తేదీన నరేంద్రమోదీ జన్మదినోత్సవంతో పాటు గుజరాత్‌లోముఖ్యమంత్రిగా,కేంద్రంలో ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన సాధించిన రాజకీయ విజయాలపై నెలరోజులపాటు ప్రచార కార్యక్రమాలను ప్రకటించడంకోసం అమిత్ షా ముంబైలో పత్రికాగోష్ఠి నిర్వహించారు.మోదీ రాజకీయ పనితీరుపై ''సేవాసంకల్ప్ అభియాన్'' పేరుతో నెలరోజులపాటు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుఅమిత్ షా ప్రకటించారు.''ప్రజాసేవే దైవ సేవ'' అనే నినాదంతో ''సేవా సంకల్ప్ అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2047వ సంవత్సరం నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ప్రజలు భాగస్వాములు కావాల్సిందిగా ఈ ప్రచారం సందర్భంగా విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రచారంలో యువకులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా రక్తదానం,పెయింటింగ్,వక్తృత్వపోటీలు సహా 12 ప్రధాన కార్యక్రమాలుంటాయన్నారు. మోదీ జన్మస్థలం వాద్‌నగర్‌కు ఆయన ప్రాతినిధ్యం వహించే వారణాసి లోక్‌సభ నియోజకవర్గం మధ్య మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు భరోసా ఇస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ''ఇండియా ఫస్ట్'' అనే సూత్రం ఆధారంగా భారతదేశం బలమైన విదేశీ,రక్షణపరమైన విధానాలకు సాక్ష్యంగా నిలిచిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడి ప్రపంచంలోనే ఐదు పెద్ద దేశాల సరసన చేరిందన్నారు. దేశ జిడిపి వృద్ధి మొదటి త్రైమాసికంలో 7.8 శాతానికి ఎదిగిందని,ఇది బలమైన ఆర్థిక పనితీరుకు చిహ్నమన్నారు.దేశంలో 25 కోట్లమందిని పేదరికం నుండి విముక్తి చేశామన్నారు. 81 కోట్లమది ప్రజలకు ఆహార గింజలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. 44 కోట్లమందికి ఉజ్వల గ్యాస్,రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్,ఆర్టికల్ 370 రద్దు విషయాలు ప్రస్తావించారు.ఇటీవల మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం ప్రారంభించామని చెప్పారు. దేశ చరిత్రను వలస విముక్తి చేస్తామని, అంటే దాని అర్థం గతాన్ని తుడిచిపెట్టడం కాదని,ప్రపంచానికి చారిత్రక వాస్తవాలను భారతీయ దృక్కోణంలో ప్రామాణికస్థాయిలో తెలియజేస్తామన్నారు.

అవినీతి,కులతత్వం,వంశపారంపర్యరాజకీయాల నుండి దేశాన్ని దూరంగా తీసుకువెళ్ళి ''చేతల రాజకీయాలు'' అనే ఒక సరికొత్త శకానికి నరేంద్ర మోదీ పాలనలో తెర లేచిందని చెప్పారు.మోదీ దేశంలో అరుదైన విజయాలను సాధించారని,భద్రత,ఆర్థిక సామర్థ్యం విషయాల్లో ఒక ప్రపంచ శక్తికేంద్రంగా భారతదేశాన్ని పరివర్తన చెందేలా మోదీ చేతల రాజకీయాలు ప్రదర్శించి నవ శకానికి నాంది పలికారన్నారు. 'పనితీరు ఆధారిత రాజకీయ కొత్త శకానికి' నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారన్నారు.

ముంబైలో అమిత్ షా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2029 నాటికి 21 రాష్ట్రాలలో ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్‌కోడ్)ను ప్రవేశపెడుతుందని చెప్పారు.

దేశ రాజకీయ పాలనలో 2014కు ముందు అవినీతి,కులతత్వం,వంశపారంపర్య రాజకీయాలు రాజ్యమేలాయని, ఈ మూడు రుగ్మతలూ దేశాన్ని పట్టి పీడించాయని, వాటికి దూరంగా 2014 నుండి 2026 వరకూ ఆ తర్వాత కూడా దేశాన్ని,దేశ ప్రజలను చేతల రాజకీయాల నవ శకం దిశగా మళ్ళించామని, ఈ ఘటన మోదీకే దక్కుతుందని, ఈ చేతల రాజకీయాలకు,పనితీరు ఆధారిత రాజకీయాలకు దేశంలో మోదీ శ్రీకారం చుట్టారన్నారు. సెప్టెంబరు 17వ తేదీన నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఈ విషయాలపై దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.అక్టోబరు 17వ తేదీ వరకూ ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. దేశంలో విధానపరమైన అలసత్వం,విధానపరమైన స్తబ్దత,సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్ళు,నిర్ణయాలు తీసుకోవడంతో తీవ్ర బలహీనతలు వంటి రుగ్మతల నుండి మోదీ పరిపాలన దేశాన్ని విముక్తి చేసిందని చెప్పారు. దేశంలో అరుదైన విజయాలు సాధించిన మోదీ భద్రత,ఆర్థికసామర్థ్యం విషయంలో భారత్‌ను ప్రపంచశక్తికేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలకు సేవల చేయడంకోసమే ఆయన ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారని,ప్రజలక్షేమంకోసం, దేశ క్షేమంకోసం ఆయన కృషి చేశారని,సుదీర్ఘకాలం ఆయన దేశానికి సేవలు అందించారని చెప్పారు.

# జర్మనీలో ఎఎఫ్‌డి వ్యతిరేక ర్యాలీలు

20 నగరాల్లో 1.50 లక్షల మంది వీధుల్లోకి



**బెర్లిన్:**తూర్పు జర్మనీలో 81 సంవత్సరాల తర్వాత మితవాద,నాజీ హిట్లర్ వారసత్వ ఎ.ఎఫ్.డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ)పార్టీ గతవారం సాక్సోనీ–అన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో భారీ ఆధిక్యతావిజయం సాధించి అధికారానికి చేరువైంది. మూడు స్థానాలు తగ్గినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ తర్వాత జర్మనీలో ఆ పార్టీని వ్యతిరేకిస్తూ లక్షలమందిభారీ నిరసన ప్రదర్శనలు చేశారు. ఎ.ఎఫ్.డిపై నిషేధం విధించాలని కోరుతున్న ఫ్రూఎఫ్ సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ఇరవై నగరాల్లో 1.50 లక్షల మంది ప్రదర్శకులు ఎ.ఎఫ్.డి.ని వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు. ముఖ్యంగా బెర్లిన్,మ్యూనిచ్,హాంబర్గ్ నగరాలలో భారీ ప్రదర్శనలు జరిగాయి. ''ఎ.ఎఫ్.డిని నిషేధించండి, ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం అవసరం లేదు...'' అని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సాక్సోనీ–అన్‌హాల్ట్‌లో రాజ్యాంగ శత్రువులైన ఎఎఫ్‌డి అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు అనేకమంది స్వచ్ఛందంగా వీధుల్లోకి వస్తున్నారు. అమెరికాలో ''మాగా'' ఉద్యమం తరహాలో ఎ.ఎఫ్.డి జర్మనీలో నాజీ నియంతృత్వ భావాలను విస్తరింపజేయడంతో ఆ దేశంలో ప్రధాన స్రవంతి పార్టీలు ఎ.ఎఫ్.డిని చీదరించుకుంటున్నాయి. కానీ ''ఓస్టాల్జీ''లో బ్రతుకుతున్న తూర్పు జర్మనీ ప్రజలు తమ మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నాజీపార్టీనే ఆశ్రయించి ఓటువేసి గెలిపించారు. ఐతే ఎ.ఎఫ్.డి.కి ఇంకా మూడుస్థానాలు తక్కువ అయ్యాయి. ఆ మూడు స్థానాల బలాన్ని సమకూర్చేందుకు జర్మనీపార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. వారితో కలిసి పనిచేసేందుకు తిరస్కరిస్తున్నాయి.

## 'ట్రాఫిక్ లైట్లు లేని కూడలి' (మొదటి పేజీ తరువాయి)

కృషిచేయాలని ఆయన 'బ్రిక్స్' కూటమి నాయకులకు పిలుపునిచ్చారు.'నియమాలు లేని ప్రపంచం ట్రాఫిక్ లైట్లు లేని కూడలి లాంటిది. అక్కడ గందరగోళం, అస్తవ్యస్థత దాదాపు ఖాయం.నిష్పక్షపాతం, న్యాయం అనేవి సార్వత్రిక ఆకాంక్షలు, అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాలూ రూపొందించాలి' అని ప్రధాని మోదీ అన్నారు.'గ్లోబల్ సౌత్ దేశాలు సంయుక్తంగా 'అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను పరిరక్షించాలి. సార్వభౌమ సమానత్వం, అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం, వివాదాల శాంతియుత పరిష్కారం వంటి అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక నిబంధనలను కాపాడాలి. అలాగే అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ నిబంధనలు అందరికీ వర్తించేలా చూడాలి' అని జీ జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా, 'ద్వంద్వ ప్రమాణాలను విడనాడాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. అన్ని దేశాలు, వాటి పరిమాణం, బలం లేదా సంపదతో సంబంధం లేకుండా అంతర్జాతీయ సమాజంలో సమాన సభ్యులే' అని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. 'బ్రిక్స్' సహకారంపై దృష్టిని పెంచడానికి జీ జిన్‌పింగ్ యొక్క ఐదు సూత్రాల చొరవ, సమగ్ర కృత్రిమ మేథస్సు చట్రాన్ని ఏర్పాటు చేయడం, వాణిజ్యం, పెట్టుబడులను సులభతరం చేయడం, డిజిటల్ పరిశ్రమ సంబంధాలను పెంపొందించడం, 'తెలివైన తయారీ'ని అభివృద్ధి చేయడం, ఉమ్మడి శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం. పెద్ద భాషా నమూనాలను అభివృద్ధి చేయడంలో, వర్తింపజేయడంలో సహకారానికి మద్దతు ఇవ్వడానికి ప్రత్యేకమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెమినార్లు, శిక్షణా కోర్సులను నిర్వహించడానికి, ఒక ఓపెన్ ఏఐ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి బ్రిక్స్–ఏఐ ఓపెన్ సోర్స్ కమ్యూనిటీని స్థాపించడంలో చైనా మార్గదర్శిగా నిలుస్తుందని ఆయన మొదటి చొరవ గురించి చెప్పారు. ఇంజినీర్ల ఉమ్మడి అభివృద్ధి సామర్థ్య ప్రమాణాల పరస్పర గుర్తింపుకోసం 'బ్రిక్స్' ఇంజినీర్ల పెంపక కూటమిని ఏర్పాటు చేయాలని చైనా ప్రతిపాదిస్తోందని ఆయన అన్నారు. నా 'బ్రిక్స్' యువజన మార్పిడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంది అని జిన్‌పింగ్ చెప్పారు.

# ఢిల్లీలోని గ్లోవ్స్ తయారీ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ:** వాయువ్య ఢిల్లీ స్వరూప్‌నగర్‌లో ఉన్న ఒక గోదాము, ఫ్యాక్టరీలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించి ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం జూడో దుస్తులు, బాక్సింగ్ గ్లోవ్స్ తయారు చేసే ఫ్యాక్టరీలోని గ్రౌండ్, మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన పక్క భవనంలోనివారు భయంతో కిందకు దూకడంతో ఆరుగురు గాయపడ్డారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించగా, వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలికి 15అగ్నిమాపక వాహనాలను పంపామని, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారని ఢిల్లీ అగ్నిమాపక శాఖ పేర్కొంది. నష్టంపై అంచనా వేస్తున్నారు.





## సంఘటితమవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి సహాయం అందిస్తుందని సిఎం చెప్పారు. ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని, ఆర్యవైశ్యులకు ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని, కొడంగల్‌లో ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య కులానికి చైర్మన్ పదవి ఇచ్చామని, రాజకీయాల్లో సైతం మీ వాటా మీరు తీసుకోవాల్సిందేనన్నారు. ఆర్యవైశ్యులకు ముందు చూపు, జాగ్రత్త అనేది వాళ్ల డిఎన్‌ఏలోనే ఉందని కొనియాడారు.

**రోశయ్యకు ప్రత్యేక గుర్తింపు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివంగత మాజీ గవర్నర్, మాజీ సిఎం రోశయ్యను గుర్తి చేసుకొంటూ ప్రశంసల వర్షం కురిపించారు.రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారే తప్ప ఎవరినీ ఎప్పుడూ దూషించరన్నారు. రాష్ట్రం విడిపోయినా రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఉండాలని తాము నిర్ణయించామన్నారు. తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని రోశయ్య ఏనాడో గుర్తించారన్నారు.శాసనమండలిలో దూకుడుగా తాను మాట్లాడితే రోశయ్య కాస్త దూకుడు, ఆవేశం తగ్గించుకొంటే అనుభవంతో ముందుకు వెళుతానని తొలినాళ్లల్లోనే తనను ఆశీర్వదించారన్నారు. ఆర్థిక లావాదేవీల్లో రోశయ్యది ప్రత్యేక స్థానం ఉందని, ఆ కారణంగా చెన్నారెడ్డి, విజయ భాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డిలు తమ ప్రభుత్వంలో రోశయ్యకే ఆర్థిక శాఖ అప్పచెప్పారన్నారు.

## ఆంక్షలు ప్రభావం
(మొదటి పేజీ తరువాయి)

మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణల నడుమ టెహ్రాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతూ, అమెరికా ఇరాన్‌పై కొత్త ఆర్థిక ఆంక్షలు విధించిన కొన్ని వారాల తర్వాత ఇరాన్ నాయకుడి వ్యాఖ్యలు వెలువడ్డాయి. మరింత సమతుల్యమైన, సమ్మిళితమైన, న్యాయమైన అంతర్జాతీ వ్యవస్థను నిర్మించడంలో 'బ్రిక్స్' మరింత కీలకపాత్రను పోషించాలని మసౌద్ పెజెష్కియన్ పిలుపునిచ్చారు. స్థితిస్థాపకత, సహకారం, సుస్థిరతలను ఆచరణాత్మక చర్యలుగా మార్చాలని ఆయన నొక్కిచెప్పారు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక దురాక్రమణను ప్రస్తావిస్తూ, భద్రత లేకుండా ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించలేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తేల్చిచెప్పారు. ఇరాన్ ఆర్థిక, ఇంధన, అభివృద్ధి మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులు జాతీయ సరిహద్దులను దాటి, ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త పరిణామాలకు దారితీయవచ్చని పెజెష్కియన్ అన్నారు. పౌరులు చనిపోవడం, దశాబ్దాలుగా నిర్మించిన మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో ఇరాన్ ప్రజలు భారీ మూల్యం చెల్లించుకున్నారని చెప్పారు. పౌరులను రక్షించడం, పౌర లక్ష్యాలపై దాడులు సాధారణీకరణ కాకుండా నిరోధించడం అంతర్జాతీయ సమాజం యొక్క బాధ్యత అని ఇరాన్‌అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తెలియజేశారు. దేశాల గమ్యాలు అంతకంతకూ పరస్పరం ముడిపడి ఉన్న ప్రస్తుత తరుణంలో, 'స్థితిస్థాపకత', 'సహకారం', 'సుస్థిరత' అనే ఈ సదస్సు ఇతివృత్తం ప్రాథమి క ప్రపంచ అవసరాలను ప్రతిబింబిస్తోందని పేర్కొంటూ, ఈ సదస్సును నిర్వహించినందుకు భారతదేశానకి, ఆ దేశ ప్రజలకు , ప్ర ధానమంత్రి నరేంద్రమోదీకి పెజెష్కియన్ ధన్యవాదాలు తెలిపారు.

## చేయడమే లక్ష్యం
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి లాంటి మాస్ లీడర్ కాంగ్రెస్‌కు అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని తానేనని కొండా సురేఖ తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతుల కోసం పాదయాత్ర చేశారని, అదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. ఎలాంటి తప్పులు చేయకుండా మంత్రి బాధ్యతలు నిర్వర్తించానన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదని, కానీ అకారణంగా పదవి నుంచి తొలగించారని బాధ ఉందని కొండా సురేఖ అన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించిన అనంతరం అల్లర్లు చేయాలని కొందరు ఫోన్ చేశారని కొండా సురేఖ వెల్లడించారు. కానీ తాను వారిని వారించానని వివరించారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు చెప్పానని, అండగా ఉన్నందుకు వారికి ధన్యవాదాలని చెప్పారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా, తన భర్త కొండా మురళీతో కలిసి ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని ఆమె అన్నారు. తామిద్దరం ప్రజల సమస్యలపై పనిచేస్తూ, అభివృద్ధిని సాధించే దిశగా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం తనను సంప్రదిస్తోందన్న వార్తల నేపథ్యంలో, తనకు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, వేరే పార్టీలోకి మారవద్దని సూచనలు అందుతున్నాయని ఆమె తెలిపారు. 'మేము ఎక్కడికీ వెళ్లకూడదని (వేరే పార్టీలో చేరకూడదని), పార్టీనే మమ్మల్ని చూసుకుంటుందని మాకు చెబుతున్నారు. వేరే పార్టీలో చేరే ఉద్దేశం మాకు లేదని మేము వారికి చెబుతున్నాము. మేము కాంగ్రెస్‌లోనే కొనసాగుతాము. కచ్చితంగా కాంగ్రెస్ తరపునే పోటీ చేస్తాము. గెలిచి, కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తాము' అని ఆమె అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు టికెట్ లభిస్తుందని, మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికై తిరిగి మంత్రిని అవుతానని సురేఖ ధీమా వ్యక్తం చేశారు. పదవులు ఇవాళ ఉంటాయి, రేపు పోతాయి, ప్రజల్లో చిరస్థాయిగా ఉండటమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము నమ్మిన రాజశేఖర్‌రెడ్డి కోసం గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. మంత్రి పదవి పోయిందని ఇంట్లో కూర్చోబోమని, ప్రజల్లోనే ఉంటామని, మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ సీట్లు గెలుస్తామని సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేసిన వ్యాఖ్యలపై కొండా మురళీ స్పందిస్తూ కొద్ది రోజుల్లో ఆయన ఎమ్మెల్సీ పదవి పోతుందని, మళ్లీ పదవీ రాదని అన్నారు. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేశానని, దమ్ముంటే సారయ్య ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేయాలని అన్నారు. కొండా దంపతులు దాదాపు పది రోజుల తర్వాత బహిరంగంగా కనిపించడంతో హనుమకొండ రామ్‌నగర్‌లోని వారి నివాసం వద్ద కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండా దంపతులను కలిసేందుకు ఉదయం నుంచే ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

## ఆయుధంగా మార్చొద్దు
(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో ప్రధాని ప్రసంగిస్తూ, 'సాంకేతికత, కీలక ఖనిజాలకు ఆయుధాలుగా మార్చడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఉమ్మడి పురోగతి, శ్రేయస్సుకు ఆటంకం కలిగించవచ్చని ఆయన హెచ్చరించారు. వారి గొంతుకను వినడం, వారి అనుభవాలకు విలువ ఇవ్వడం, పరిష్కారాలను వారిపై రుద్దకుండా, వారితో భాగస్వామ్యంతో రూపొందించడం వల్ల, గ్లోబల్ సౌత్‌లోని అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్రిక్స్‌ను ఎక్కువగా విశ్వసిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ జిడిపిలో 40శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 ప్రధాన ఆర్థిక వ్యవస్థల కూటమి అయిన బ్రిక్స్ వార్షిక శిఖరాగ్ర సమావేశం, లాజిస్టిక్స్, సరఫరా గొలుసులు, స్టార్టప్‌లు, అంటువ్యాధుల నియంత్రణ రంగాలలో కీలక ఫలితాలతో ముగిసింది. 'మనం వేర్వేరు వాస్తవాలలో పాతుకుపోయి ఉండవచ్చు. కానీ, కలిసికట్టుగా సహకారంతో ఎదిగి మానవాళి కోసం వికసిస్తాం. మన వైవిధ్యమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా, మన పురోగతి సకల మానవాళికి సేవగా నిలవాలి' అని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ లతో సహా ఈ కూటమిలోని అగ్రనాయకుల సమక్షంలో ప్రధానమంత్రి మోదీ అన్నారు.అస్థిరమైర భౌగోళిక—రాజకీయ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకతను పెంచడం ఎంత ముఖ్యం అనే విషయాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ కూటమికి న్యూఢిల్లీ అధ్యక్షత వహించడం స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత అనే నాలుగు స్థంభాలపై కేంద్రీకృతమైందన్నారు.ఈ నాలుగు మూలస్థంభాల ఆధారంగా, 'బ్రిక్స్' ద్వారా భారతదేశం సమ్మిళిత ప్రపంచవృద్ధిని ప్రోత్సహించాలని కోరుకుంది.ఎందుకంటే ఈ కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం భారతదేశానికే పరిమితం కాకూడదని అది విశ్వసిస్తుంది. 'మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటివి నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయి. అందువల్ల బ్రిక్స్ కూటమిలో మేం స్థితిస్థాపకతను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాం' అని ప్రధాని మోదీ జోడించారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధఃగా ఉండటం, తక్షణ చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం అని మోదీ వాదించారు. బ్రిక్స్ పట్ల భారతదేశ వైఖరి స్నేహం, భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించిందని ఆయన వివరించారు. మన నగరాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడాన్ని సులభతరం చేయడానికి 'బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్'ను ఏర్పాటు చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## సమగ్ర విధానం
(మొదటి పేజీ తరువాయి)

ధరకు చమురును కొనుగోలు చేస్తే తప్ప రష్యా ముడి చమురును రవాణా చేసే ఏ ఓడకైనా బీమా చేయకుండా జి–7 దేశాలు, యురోపియన్ యూనియన్, యూకే పాశ్చాత్య కంపెనీలను నిషేధించాయి. బీమా రంగానికి సంబంధించిన ఈ ఆంక్షలు రష్యా ముడిచమురు ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.'మూలధనం, శ్రమ, సాంకేతికతలను తరలించడానికి మాకు స్వతంత్ర మార్గాలున్నాయి. వాస్తవానికి, బాహ్య ఒత్తిడితో సంబంధం లేకుండా మేం పనిచేయగలం' అని ఇక్కడ జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో పుతిన్ అన్నారు. 'బీమా యంత్రాంగాన్ని, ధాన్యం మార్కెట్‌ను ఏర్పాటు చేయడం వంటి కొన్ని ఆశాజనకమైన కార్యక్రమాలను మేం ముందుకు తీసుకెళ్తున్నాం. ఇవి రష్యా ప్రతిపాదనలు. ఇతర సభ్యదేశాలన్నీ వీటిని ఉపయోగించుకోవాలని మేం ఆహ్వానిస్తున్నాం' అని మరింత లోతుల్లోకి వెళ్లకుండా పుతిన్ వివరించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) 140బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్ట్‌లును నిర్వహిస్తోందని పుతిన్ దాని పనితీరును ప్రశంసించారు. ఎన్‌డిబి అనేది బ్రిక్స్ దేశాలచే స్థాపించబడిన ఒక బహుపాక్షిక అభివృద్ధి బ్యాంక్. 'ప్రపంచ సవాళ్లు తలెత్తుతూనే ఉన్నందున, వాటి లక్షణాలతో పాటు, మూల కారణాలను కూడా పరిష్కరించడానికి మనం ఒక సమగ్రమైన విధానాన్ని అవలంభించాలి' అని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. 'గ్లోబల్ సౌత్ దేశాలు కలిసికట్టుగా మరింత మెరుగ్గా (ప్రపంచవ్యాప్తంగా) పురోగమించాలి. పరిపాలనా వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడంతో పాటు, సాంప్రదాయ, అసాంప్రదాయ భద్రతాపరమైన ముప్పులను కూడా ఎదుర్కోవాలి' అని ఆయన అన్నారు. తీవ్రమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఒక స్వతంత్ర మార్గాన్ని ఎంచుకోవడంపై బ్రిక్స్' దృష్టి సారిస్తున్నందున, దాని ప్రపంచ స్థాయి ప్రతిష్ఠ పెరుగుతోందని పుతిన్ ప్రస్తుతించారు. నేటి సమావేశంలో విస్తృత భాగస్వామ్యం, బ్రిక్స్ పట్ల అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతూనే ఉందని ధృవీకరిస్తోంది.'స్వతంత్ర మార్గాన్ని అనుసరించాలనే మా నిబద్ధత, అంతర్జాతీయ చట్టం, ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌లోని కీలక నిబంధనల మార్గదర్శకత్వంలో సమస్యలను సమష్టిగా పరిష్కరించుకకోవాలనే మా ఆకాంక్షతో సహా, మా ప్రధాన విలువలు, ఆదర్శాలు ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి ఆకర్షణీయంగా ఉన్నాయి'అని కూటమిలోని పూర్తి సభ్య దేశాలతోపాటు, దాని భాగస్వామ్యదేశాలు కూడా హాజరైన సభలో పుతిన్ వివరించారు.

# షఫాలీ, మంధాన జోరుతో లంక బౌలర్లు డీలా

## మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత జోరు



మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత ఓపెనర్ షఫాలీ వర్మ(58 నాటౌట్) చెలరేగుతోంది. బౌండరీలతో హోరెత్తిస్తున్న షఫాలీ అర్ధ శతకంతో మెరిసింది. పవర్ ప్లేలోనే ఫిఫ్టీకి చేరువైన ఈ లేడీ సెహ్వాగ్.. 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకుంది. టీ20ల్లో షఫాలికి ఇది 21వ అర్ధ శతకం. మరో ఎండ్లో స్మృతి మంధాన(32 నాటౌట్) సైతం బాదేస్తుండగా భారత స్కోర్ బోర్డు పరుగులు తీస్తోంది. మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత ఓపెనర్లు దంచేస్తున్నారు. ఎనిమిదో టైటిల్ లక్ష్యంగా పెట్టుకున్న టీమిండియాకు శుభారంభమిస్తూ.. ఇన్నింగ్స్ మొదటి బంతినే స్మృతి మంధాన(32 నాటౌట్) బౌండరీకి తరలించగా.. ఆ తర్వాత కవిశ దిల్హారి ఓవర్లో షఫాలీ వర్మ(58 నాటౌట్) రెండు ఫోర్లతో చెలరేగింది. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే వికెట్ పడకుండా టీమిండియా 57 పరుగులు చేసింది. కాసేపటికే కవిశ ఓవర్లో బౌండరీతో అర్ధశతకం అందుకుంది షఫాలీ. 24 బంతుల్లోనే 8 ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫిఫ్టీ సాధించింది తను. లంక బౌలర్లపై ఇద్దరూ విరుచుకుపడడంతో 9 ఓవర్లలో 91రన్స్ చేసిన భారత్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. అంతకు ముందు దుబాయ్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్ తీసుకుంది. ఇరు జట్లు తమ తుది జట్టులో రెండు మార్పులు చేశాయి. అజేయంగా మహిళల ఆసియా కప్ ఫైనల్కు దూసుకెళ్లిన భారత జట్టు రికార్డు టైటిల్ లక్ష్యంగా ఆడనుంది. రెండేళ్ల క్రితం టీమిండియాను ఓడించిన తొలిసారి ఆసియా ఛాంపియన్‌గా అవతరించిన శ్రీలంక ట్రోఫీ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. రెండు జట్లు లీగ్ దశలో అద్భుతంగా ఆడడంతో విజేత ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. కీలకమైన మ్యాచ్ కావడంతో ఇరుజట్లు రెండు మార్పులతో ఆడుతున్నాయి. ప్రతీకా రావల్ స్థానంలో జి.కమలిని ఎంపికవ్వగా.. విష్మీ గుణరత్నేను తీసుకుంది లంక.

**భారత తుది జట్టు :** స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జి.కమలిని, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), భారతి ఫుల్మాలి, రీచాఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమారావత్, శ్రీచరణి, క్రాంతిగౌడ్, నందిని శర్మ.

**శ్రీలంక తుది జట్టు :** చమరి ఆటపట్టు(కెప్టెన్), ఇమేష దులానీ, విష్మీ గుణరత్నే, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, కవిష దిల్హారి, నీలాక్షిక సిల్వా, కౌశాని నుత్యంగన(వికెట్ కీపర్), సుగంధిక కుమారి, చముడి ప్రబోద, మిథాలీ అయోధ్య.

# అఫ్గన్‌తో తొలి టీ20.. వైభవ్ బెంచ్ మీదే



స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆదివారం మొదలవ్వనుంది. టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బౌలింగ్ తీసుకున్నాడు. అందరూ ఊహించినట్టే వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. రెగ్యులర్ ఓపెనర్ సంజూ శాంసన్‌గా పక్కన పెట్టడంపై విమర్శలు వస్తున్న వేళ.. ఈసారి వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. అఫ్గన్ టీ20 కెప్టెన్‌గా తొలి సిరీస్ ఆడుతున్న ఇబ్రహీం జద్రాన్ మాట్లాడుతూ.. భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తామని చెప్పాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో వైట్ వాష్‌కు గురైన భారత జట్టు స్వదేశంలో పంజా విసరాలనుకుంటోంది. వరసగా రెండు సిరీస్‌లు చేజారినందున అఫ్గనిస్థాన్‌తో క్లీన్ స్వీప్ లక్ష్యంగా ఆడనుంది టీమిండియా. ఆదివారం తొలి టీ20ని విజయంతో మొదలెట్టాలని భావిస్తున్న శ్రేయాస్ అయ్యర్ సేన బౌలింగ్ తీసుకుంది. ఫిట్‌నెస్ నిరూపించుకున్న నితీశ్ రెడ్డి, సుందర్, బుమ్రాలు తుది జట్టులోకి రాగా.. వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కు పరిమితమయ్యాడు. అఫ్గనిస్థాన్ కూడా మూడేళ్ల తర్వాత పునరాగమనం చేయాలనుకున్న నవీన్ ఉల్ హక్‌ను తీసుకోలేదు.

**భారత తుది జట్టు:** సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సుందర్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.


**అఫ్గనిస్థాన్ తుది జట్టు:** ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మనుల్లా గుర్బాజ్(వికెట్ కీపర్), సెడీకుల్లా అటల్, డార్విష్ రసూలి, అజ్మతుల్లా ఒమర్జాయ్, గుల్బదిన్ నయీబ్, నబీ, రషీద్ ఖాన్, ముజీబ్, నూర్ అహ్మద్, ఫజల్హక్ ఫారూఖీ.

# ఆరోగ్యం

## 'స్కిన్ న్యూట్రిషన్'కు పెరుగుతున్న ఆదరణ



చర్మ సంరక్షణలో ఏళ్లుగా దాదాపు ఒకే విధానం కొనసాగుతోంది. క్లెన్స్‌చేయడం, టోన్ చేయడం, ట్రీట్ చేయడం, రక్షించడం, మళ్లీ అదే క్రమాన్ని కొనసాగించడం.. ఇది ఆనవాయితీగా మారింది. లక్షలాది మంది ఈ విధానాన్ని క్రమశిక్షణతో పాటిస్తూ, వివిధ సీరమ్‌లు, క్రీమ్‌లను సరైన క్రమంలో, సరైన సమయంలో ప్రతిరోజూ ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ, మరింత మంది వినియోగదారులు ఇప్పుడు ఫలితాలు ఒక స్థాయికి వచ్చి ఆగిపోతున్నాయని గుర్తిస్తున్నారు. ఎంత క్రమబద్ధమైన చర్మ సంరక్షణ పాటించినా ఆశించినంత కాంతివంతమైన చర్మం కనిపించకపోవడంతో సౌందర్య, వెల్నెస్ రంగంలో ఒక కొత్త మార్పు మొదలైంది. బయట నుంచి రాసుకునే ఉత్పత్తుల నుంచి లోపలి నుంచి చర్మ ఆరోగ్యాన్ని పోషించే 'డైలీ స్కిన్ న్యూట్రిషన్' వైపు దృష్టి మళ్లుతోంది. ఉత్తమ 'స్కిన్ కేర్' రొటీన్ కూడా ఒక పరిమితి వరకు మాత్రమే పనిచేస్తుంది. సీరమ్‌లు, క్రీమ్‌లు చర్మంపై పనిచేసి తేమను అందిస్తాయి, రక్షిస్తాయి. చర్మం నిస్తేజంగా కనిపించడం, రంగులో అసమానత వంటి కనిపించే సమస్యలను తగ్గించేందుకు అవి సహాయపడతాయి. అయితే చర్మ ఆరోగ్యం కేవలం పైపొరతో ముడిపడి ఉండదు. నిద్ర, ఒత్తిడి, ఆహారం, శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి అంశాల ప్రభావం చివరకు చర్మంపై కనిపిస్తుంది. బాత్రూమ్లో ఎన్ని సీరమ్‌లు, క్రీమ్‌లు పెట్టుకున్నా వాటితో ఈ అంతర్గత ప్రభావాలను పూర్తిగా భర్తీ చేయలేం. ఇక్కడే స్కిన్ సప్లిమెంట్లుపై దృష్టి మళ్లుతున్నది. ఇవి సాధారణ 'స్కిన్ కేర్'రొటీన్‌కు ప్రత్యామ్నాయం కాదు. చర్మ ఆరోగ్యానికి శరీరం లోపలి నుంచి మద్దతు ఇవ్వడమే వీటి ఉద్దేశం. కణస్థాయిలో చర్మ ఆరోగ్యానికి అవసరమైన పోషణను అందించడం ద్వారా బయట నుంచి ఉపయోగించే ఉత్పత్తులకు మరింత సహాయక వాతావరణాన్ని కల్పించాలన్నది ఈ విధానం వెనుక ఉన్న ఆలోచన. వెల్నెస్ రంగంలో 'స్కిన్ హెల్త్' అనే భావన కొత్తది కాదు. అయితే ఇటీవల ఇది ప్రధాన స్రవంతి సౌందర్య సంరక్షణలోకి వేగంగా ప్రవేశిస్తోంది. చర్మం కూడా శరీరంలోని ఒక అవయవమే. ఇతర అవయవాల మాదిరిగానే అది కూడా శరీరానికి లోపలి నుంచి అందే పోషకాలు, జీవరసాయన పరిస్థితులకు స్పందిస్తుంది.



### వారానికోసారి ప్రక్షాళన

భూమిపై ఉన్న జీవజాలంలో మనిషికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అత్యంత ఆశ్చర్యం కలిగించే అంశాలు ఎన్నో మనిషి శరీరంలో చోటు చేసుకుంటూ ఉంటాయి. అలాంటి ఓ అద్భుతమే పేగుల్లోనూ దాగి ఉంది. పేగు గోడలోని కణజాలం ప్రతి ఐదు నుంచి ఏడు రోజులకోసారి పూర్తిగా నవీకృతం కావడం ఆశ్చర్యకరం. ఇది శరీరంలోని అత్యంత శ్రమాత్మకంగా పనిచేసే భాగాలలో ఒకటి. చాలా సంవత్సరాలుగా శాస్త్రవేత్తలు ఈ పునరుద్ధరణ 'స్టెమ్ సెల్స్' అనే ప్రత్యేక మాస్టర్ సెల్స్ వల్లనే జరుగుతుందని నమ్ముతూ వచ్చారు. అవే కొత్త కణాలను సృష్టిస్తాయని భావించారు. కానీ ఇటీవల నిర్వహించిన పరిశోధనలు మరింత అద్భుతమైన నిజాన్ని వెల్లడించాయి. అవసరమయ్యే సమయాల్లో, ఇప్పటికే ఉన్న సాధారణ, పూర్తిగా పెరిగిన కణాలు తిరిగి స్టెమ్ సెల్లులుగా మారగలవని గుర్తించారు. ఇది ఒక ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు ఒక్కసారిగా ఆ ఫ్యాక్టరీని మళ్లీ రూపకల్పన చేసే ఆర్కిటెక్ట్‌గా మారడంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రక్రియ సహజంగా శరీరంలో జరుగుతూ, ఒక జీవసంబంధ రీసెట్ బటన్‌లా పనిచేస్తుంది. అంతర్గతంగా, మన శరీరం లోపల నుండి నిరంతరం మరమ్మతులు చేసుకుంటూ, పునరుత్థానాన్ని సాధిస్తుంది. మనలోని ఈ అద్భుతమైన సంక్లిష్టత, పునరుత్థాన శక్తి మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ ప్రయోగ ఫలితం మన శరీరం ఎంత ప్రబలమైనదో, సహజంగా స్వీయ సవరణ శక్తితో నిండినదో గుర్తుచేస్తుంది.

### షుగర్ నియంత్రణకు



రక్తంలో షుగర్ నియంత్రణకు స్వీట్ పొటాటో (చిలకడదుంప/మొరంగడ్డ), పాలు విరగ్గొట్టి తయారు చేసిన కోవా ఎంతో ఉపయోగమని అంటున్నారు. అంతర్జాతీయ కథనాలను అనుసరించి, ఈ రెంటినీ కలిపి ఉపయోగించడం వల్ల రక్తంలో చక్కెర మొతాదులు నియంత్రణలో ఉంటాయి. స్వీట్ పొటాటోలు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ల దాదాపు ఒకే రీతిలో ఉంటాయి. వాటి గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తెల్ల పొటాటోల కంటే తక్కువ ఉంటుంది. అంటే, వీటిని తినగానే రక్తంలో గ్లూకోజ్ స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా పెరగదు. ఇక దాల్చిన కోవాలో ఇన్సులిన్ వంటి ప్రభావం చూపే రసాయనాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి, భోజనాల తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలలో అధిక ఉత్పత్తిని తగ్గిస్తాయి. కోవా రక్తంలో గ్లూకోజ్‌ను కణాల్లోకి చేర్పించడంలో ఇన్సులిన్ ప్రభావాన్ని బలోపేతం చేస్తుంది. కడుపు నుంచి ఆహారం శీఘ్రంగా విడుదల కాకుండా అడ్డుకుంటుంది. అందువల్ల రక్తంలో గ్లూకోజ్ చేరిక నెమ్మదిస్తుంది. స్వీట్ పొటాటోలు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు కాబట్టి, తిన్న వెంటనే రక్తంలో షుగర్ స్థాయిలను ఒక్కసారిగా పెంచవు. కోవాలోని కాంపౌండ్లు, స్వీట్ పొటాటోల ఫైబర్ కలసి పని చేయడం వల్ల, రక్తంలోని షుగర్ స్థాయిల నియంత్రణలో రెండు పదార్థాల కలయిక సమష్టిగా మరింత ఫలితప్రదంగా ఉంటుంది. వీటిని ఉడికించి తినడం మంది. కాల్చి లేదా ఫ్రై చేయడం కంటే, ఈ పద్ధతిలో తినడం వల్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. పెరుగు, గోధుమ, వివిధ రకాల గింజలు ఆరోగ్యకరమైన ఫ్యాట్/ప్రోటీన్‌తో కలపడం రక్తంలో షుగర్ స్థాయిలను మరింత స్థిరంగా ఉంచుతుంది. అందుకని రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రించడానికి ఆహారంలో స్వీట్ పొటాటో, కోవాతోపాటు వీటిని కూడా చేర్చడం మంచిది. ఒకవేళ చిలకడదుంప లభించని పక్షంలో, దాల్చిన చెక్కను కలిపి తీసుకోవడం మంచిదని అంటున్నారు.

# సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నైజం నవాబ్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, ప్రాణాలను త్యాగం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు అన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం గ్రామంలో ఆదివారం సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట యోధుడు గంగవరపు శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే గంగవరపు విజయ్‌కుమార్‌కు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరగని పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రజల్లో నాటి నిజాం వ్యతిరేకంగా పోరాడేందుకు చైతన్యం పెరిగిందన్నారు. ఆ త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, అదే పోరాట పటిమతో నేటి ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు మరింత ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషనర్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, నాయకులు ఎర్ర బాబు, మిడకంటి చిన్న వెంకటరెడ్డి, ఉన్నం రంగారావు, పాసంగుల చంద్రరావు, పగీళ్ల వీరభద్రం, ఎడ్లపల్లి శంకరయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏలూరి భాస్కర్, మెట్ల యాదయ్య పాల్గొన్నారు.

**నేలకొండపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల భాగంగా నేలకొండపల్లిలోని కర్నాటి కృష్ణయ్య స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు కర్నాటి భానుప్రసాద్, యర్ర బాబు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, పాల్తియ శ్రీనివాసరావు, కాశబోయిన అయోధ్య, పాలపాటి అశోక్, చావ గణపతి, బాలిన కృష్ణంరాజు, ఎస్.కె.సలాం, కనకబండి రామయ్య, చిర్రప్రసాద్, తేజావత్ రూప్లా, పొలంపల్లి నారాయణ, పాలకూర్తి తిరుపతిరావు, బాలేబోయిన వెంకటేశ్వర్లు, ఆలేటి ఉమామహేష్, రావెళ్ల కృష్ణ, మూడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు : నెల్లికంటి

**నాంపల్లి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి, ప్రజల హక్కుల కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఘనత కమ్యూనిస్టులదేనని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని రేవెల్లి గ్రామంలో నిర్వహించారు. అమరవీరుడు బట్టు సత్తయ్య స్థూపానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, కలకోండ సంజీవ, రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, ఉపసర్పంచ్ వంగూరి సాయిలు, నాయకులు కోరె సత్తయ్య, ఊరిపాక వెంకటయ్య, పల్లె సైదులు, దండిగా వెంకటయ్య, నేరెళ్ల సైదులు, గిరి స్వామి, బూషిపాక యాదయ్య, వెంకటచారి, మొగుదాల సైదమ్మ, ప్రశాంత్, కొనిరెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ పోరాట స్ఫూర్తితోనే విముక్తి : కలవేణ శంకర్

**తాండూరు :** నిజాం నిరంకుశత్వం, భూస్వామ్య దోపిడీపై సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే పీడిత ప్రజలకు నిజమైన స్వేచ్ఛను ప్రసాదించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ ఉద్ఘాటించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల సభలో ఆయన మాట్లాడారు. చరిత్ర వక్రీకరణలను నిలువరించాలని, భవిష్యత్ తరాల కోసం అసలైన రైతాంగ పోరాట గాథను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని డిమాండ్ చేశారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్ పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు : రామడుగు

**బెల్లంపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీపై సాగిన విముక్తి పోరాటమని, చరిత్రలను వక్రీకరిస్తూ సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా సమితి చేపట్టిన జాతా పట్టణానికి చేరిన సందర్భంగా స్థానిక భగత్ సింగ్ చౌరస్తాలో సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, ఆడెపు రాజమౌళి, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నరసయ్య, అక్కపెల్లి బాపు, బొంతుల లక్ష్మీనారాయణ, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, రత్నం రాజ్యం, వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మక ఉద్యమం : బెజవాడ

**కోదాడ(చిలుకూరు):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో అమరవీరుల స్తూపాల వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పూలమాలలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మక ప్రజా ఉద్యమమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తాళ్లురి వెంకటయ్య, నాయకులు జనార్ధన్, దొంతగాని మల్లయ్య, ఎస్‌కె.ఖాజామియా, తాళ్లురి పెద్ద మల్లయ్య, బత్తిని బిక్షం, బెజవాడ నాగేశ్వరరావు, నేలపట్ల జానయ్య, పాశం గోపి, కట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే : సాబీర్ పాషా

**భద్రాద్రికొత్తగూడెం :** నాటిదొరలు దేశ్ ముఖ్‌ల రజాకారుల మూకలను తిరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించిన ఘనత కమ్యూనిస్టులేదనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. ఆదివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవనం ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారాణి రామకోటయ్యల స్థూపం, సిద్ధి వెంకటేశ్వర్లు ఉప్పుశెట్టి ఖాదర్ బాబు దేవభక్తుని రమేష్ చంద్రశేఖర్ పాశం శ్రీనివాస్ స్మారక స్థూపాల వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్ అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ తో పాటు వీశంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సిపిఐ కార్యాలయంలో పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్ ఆవిష్కరించారు. కోరన్నపేటలోని వేయి ఉరుల మర్రి స్మారక స్థూపం వద్దకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బూక్యా రమేష్, ఎస్.ఎన్.రెడ్డి, కైలాష్, నాయకులు పుండలీక్, బదర్, శివాజీ, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.





















## లోక్ అదాలత్‌లో 4475 కేసులు పరిష్కారం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 4475 కేసులను పరిష్కరించడం జరిగిందని సైబర్ మోసాలకు సంబంధించి 31 కేసుల్లో రూ.46లక్షల 81వేలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 851 క్రిమినల్ కేసులు, 1688 ఈపెట్టి కేసులు, 1936 డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించామన్నారు. అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

**గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత**

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సామరస్యానికి మనం పాటుపడాలి, సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని, డిజెలకు, బాణాసంచాకు అనుమతి లేదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని రోటిగడ్డ తాండా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఆ గ్రాస్తులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. 600 జనాభా కలిగిన రోటిగడ్డ గ్రామంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఎమ్మెల్సీకి విన్నవించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల గతంలో ఉన్న బోరు బావులు ఎండిపోయాయని, ప్రస్తుతం కొత్త బోర్లు, మోటార్లు మంజూరు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. కృష్ణ తాగునీరు కూడా గ్రామానికి సరఫర కావడం లేదని దీంతో సమస్య మరింత తీవ్రంగా పెరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కొత్త బోర్లు , మోటర్లు మంజూరు చేయించి తాగునీటి సమస్య ను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావ్, కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరచారి, ఏఐవైఎఫ్ మండల కోశాధికారి ఎన్ కృష్ణ, గమ్య, పాపాలి, పద్మ, రవీందర్ పాల్గొన్నారు.

## సాగర్‌లో ప్రముఖుల సందడి



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డీఐజీ సతీష్ కుమార్ లిండా,తెలంగాణ రాష్ట్ర పోలీస్ విజిలెన్స్ ఎస్పీ బాలస్వామిలు వేర్వేరుగా సాగర్‌కు విచ్చేసి, నాగార్జునకొండ సందర్శన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు.సందర్శనలో భాగంగా వారు బుద్ధవనంలోని బుద్ధచరిత వనం, ధ్యానవనం, స్థూపవనంలను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు.అనంతరం మహాస్తూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం ప్రాశస్తం, చారిత్రక విశిష్టతలను తెలియజేసే లఘుచిత్రాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధుని విగ్రహం వద్ద ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన మరియు ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు ప్రముఖులతో బుద్ధజ్యోతులను వెలిగింపజేశారు.అనంతరం బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో వారిని ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా, అమలాపురం ఆదుర్రు బౌద్ధ విహారం నుంచి 40 మంది బౌద్ధ ఉపాసకులు కూడా బుద్ధవనాన్ని సందర్శించారు. వర్షావాస కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం బుద్ధవనంలో ఆవాసం ఉంటున్న థాయిలాండ్, కంబోడియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులకు వారు భోజన దానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో పాలకవర్గాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గానికి ప్రత్యక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని చౌటుప్పల్ సింగిల్ విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల 1964 చట్టం ప్రకారం సహకార సంఘాలు స్వయంప్రతిపత్తి సంఘాలుగా స్వంత నిధులతో కార్యాకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.స్వయంగా నడుపుకునే సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ చేస్తూ పాలకవర్గాన్ని నియమించడం ఆక్షేపనీయమని అన్నారు.ఈ విధానం సరికాదని పాలకవర్గ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని జైకేసారం గ్రామంలో సర్వేనెంబర్178లో కలెక్టర్ కేటాయించిన 314ఎకరాల భూమిలో గోదాం నిర్మించాలని,మండలంలో దీర్ఘకాలిక రుణాల కోసం రూ.1.50 కోట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇవ్వాలని,మార్ట్‌గేజ్ రుణాలను ఎకరాకు రూ.3లక్షల నుండి రూ.5లక్షలకు పెంచి 5 ఎకరాల వరకు రుణాలు ఇవ్వాలని,చౌటుప్పల్‌లో ఉన్న గోదాం బిల్డింగ్‌పైన చైర్మన్ ఆఫీస్‌తో పాటు సమావేశ హాల్ నిర్మించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు గుండెబోయిన రూపమ్మ, దూర్క కృష్ణ, వెంకటయ్య,డి.శ్రీశైలం,బాతరాజు సాయిలు, దుబ్బాక శశిధర్ రెడ్డి,సూర, డి.బాలరాజు, కార్యదర్శి ఎరుకల రమేష్ పాల్గొన్నారు.



# నోరు జారితే ‘ఖబడ్దార్’

ప్రతిపక్షాలకు
మంత్రి ఉత్తమ్ హెచ్చరిక

రైతులు ఆరుతడి పంటల
వైపు దృష్టి సారించాలి

యువతకు
ఉద్యోగావకాశాలే లక్ష్యం

300 కంపెనీలు,
25వేల ఉద్యోగాలు

19న కోదాడలో ‘మెగా జాబ్‌మేళా’



**ప్రజాపక్షం/కోదాడ:** సమాజంలో మాట్లాడే హక్కు ఉందని, ఇష్టానుసారంగా నోరు జారితే బాగోదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిపక్షాలను హెచ్చరించారు. ఆదివారం కోదాడ పట్టణంలోని సిసిరెడ్డి కాన్వెంట్లో జాబ్‌మేళా స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. బాధ్యతారహిత్యంగా మాట్లాడటం సరికాదని, ప్రజా సమస్యలపై వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతాంగానికి ఆశించిన స్థాయిలో నీటిని అందించలేకపోతున్నా పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటితో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రైతుల పరిస్థితిని గమనించి భవిష్యత్‌లో ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజల కోసమే మా జీవితాలు తాను, తన భార్య ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తమ జీవితాలను ప్రజలకే అంకితం చేశామని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలు, ప్రాంత అభివృద్ధి, యువత భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నామని తెలిపారు. 25వేల ఉద్యోగాలే లక్ష్యం కోదాడలో ఈనెల 19న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 కంపెనీలు పాల్గొన్నానున్నాయని, దాదాపు 25వేల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

**విస్తృత ప్రచారం చేయాలి**

జాబ్‌మేళాలో ప్రతి ఒక్క యువతి, యువకుడు పాల్గొనేలా అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరు జాబ్‌మేళా వివరాలను నిరుద్యోగులకు చేరవేయాలని సూచించారు. మండల, గ్రామస్థాయిలోనూ యువత సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరికి ఈ అవకాశాన్ని చేరువ చేయాలని అన్నారు. కార్యకర్తలు, అధికారులు సమన్వయంతోఓ పనిచేసి యువతలో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. కోదాడ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకరావడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.



## అమరవీరుల ఆశయాల సాధన కోసం, పోరాటాలకు పునరంకిత మవుదాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాల సాధన కోసం మనందరం పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని రంగాపురం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోదులు పోటు ఎర్రమ్మ, రాఘవయ్య స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రజాకార్లు, భూస్వాములకు, దేశ్‌ముఖ్‌లు, దొరలకు వ్యతిరేకంగా తుపాకులను చేతపట్టి పోరాట చేసి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసి, ప్రజలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేయటానికి తెగించి పోరాడి వేలాది మంది అమరవీరుల అమరుల చరిత్ర సిపిఐ పార్టీ అని వారి వారసులుగా మనం కూడా నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాటాలను నిర్వహించి, వారి ఆశయ సాధన కోసం మనందరం పని చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,పోటు సక్కుబాయమ్మ, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, త్రిపురం సుధాకర్ రెడ్డి, బిల్లా కనకయ్య, ఎడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి, కుంభం వెంకటి, పగడాల శ్రీనివాస్, బాలశౌరి, నవీన్‌చారి, వెంకన్న పాల్గొన్నారు.

## సాగర్ ఆయకట్టు కింద పూర్తిగా నాట్లు వేయండి

నీళ్ల కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతాం: మాజీ మంత్రి



**ప్రజాపక్షం/నల్లగొండ:** సాగర్ ఆయకట్టు కింద రైతులు పూర్తి స్థాయిలో నాట్లు వేసుకోవాలని,నీళ్ల కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.నల్లగొండ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు.సాగర్ ఆయకట్టు కింద పంటలకు నీళ్లు ఇచ్చి తీరాలని,ఎడమ కాల్వ,వరద కాల్వ, ఏఎంఆర్‌పిలో లెవల్,ఎస్‌ఎల్‌బిసీ కింద మొత్తం ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.నీళ్లు ఇవ్వకపోతే బరాబర్ కొట్లాడుతామని,ఎలా ఇవ్వరో చూస్తామని, ఈ ప్రభుత్వం అంతు చూస్తామని హెచ్చరించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ లో 200 టీఎంసీల నీళ్లు ఉన్నాయని,ఆనీళ్లు మనవే, మన హక్కు అని,ఆనీళ్లను మాకు ఇవ్వాలని అన్నారు.కేసీఆర్,కేటీఆర్ నాయకత్వంలో ఎంతవరకైనా కొట్లాడుతామన్నారు.ఆంధ్ర నీటి దోపిడీపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఒక్క లేఖ కూడా రాయలేదని, ప్రభుత్వానికి ఎలాంటి బాధ్యత లేదని విమర్శించారు.వెలిగొండ ప్రాజెక్టు,పోతిరెడ్డిపాడు ద్వారా జరుగుతున్న నీటి దోపిడీని అరికట్టాలని కేఆర్ఎంబీకి లేఖ రాయాలని డిమాండ్ చేశారు.భూ భారతి పేరుతో భూములను కొల్లగొడుతున్నారని, కోటికి పైగా ఎకరాలను బ్లాక్‌లో పెట్టి 22ఏ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులు దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఈ ప్రెస్ మీట్ లో ఎమ్మెల్సీ ఎం.సి.కోటిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,పార్టీ నేతలు రెగట్టే మల్లికార్జున రెడ్డి,సింగం రాంమోహన్,నిరంజన్ వలీ,నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్,పల్ రెడ్డి రవీందర్ రెడ్డి,మారగోని భవాని గణేష్,పెటిక యాదయ్య దొడ్డి రమేష్,జమాల్ ఖాద్రి,రావుల శ్రీనివాసరెడ్డి,,కన్నారావు,కాసం శేఖర్,గుండెబోయిన జంగయ్య, గంజి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ఇస్కఫ్ కృషి

**ఇస్కఫ్ నల్లగొండ జిల్లా మహాసభలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కడారు ప్రభాకర్‌రావు**




**ప్రజాపక్షం/నల్లగొండ :** భారతీయ సంస్కృతి, కళలు,సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) నిరంతరం కృషి చేస్తోందని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు అన్నారు. దేశ సమైక్యత,సమగ్రతతో పాటు ప్రపంచ శాంతి,స్నేహ సంబంధాల బలోపేతానికి ఇస్కఫ్ గత 80 ఏళ్లుగా కృషి చేస్తోందని తెలిపారు.ఆదివారం నల్లగొండలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన ఇస్కఫ్ నల్లగొండ జిల్లా మహాసభకు కడారు ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల సమావేశంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం అంతర్జాతీయ వేదికలపై ప్రశ్నలు లేవనెత్తడాన్ని ఆయన అభినందించారు.అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్),ప్రపంచ బ్యాంకులో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం,ప్రాధాన్యత కల్పించాలని కోరారు.అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద,ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, శాంతి ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన అంశంలో అమెరికా వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు.ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఐఎల్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా యుద్ధ చర్యలను తీవ్రంగా ఖండించారు.ప్రపంచ శాంతి,అలీన ఉద్యమ బలోపేతం,పాలస్తీనా సమస్యతో పాటు అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం ఇస్కఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ మహాసభలో ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.దుర్గాప్రసాద్,ఉపాధ్యక్షులు కారింగు భిక్షమయ్య,కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి, న్యాయవాదులు మునగాల నారాయణరావు,గుండె వెంకటేశ్వర్లు,కట్ట అనంతరెడ్డి,కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్.రమేష్ పాల్గొన్నారు.

**ఇస్కఫ్ నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం ఇస్కఫ్ నల్లగొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, అధ్యక్షులుగా డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం,కోశాధికారిగా బి.రామలింగం తో పాటు మొత్తం 35 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పల్లా నర్సింహారెడ్డిని పరామర్శించిన సిపిఐ సీనియర్ నాయకులు

**ప్రజాపక్షం/దేవరకొండ:** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి మృతికి సంతాపంగా స్వగ్రామం పడమటిపల్లిలో ఆదివారం సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు బి. వెంకటేశం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్, సిపిఐ జిల్లా క్యావర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిషన్, నాయకులు రంగారెడ్డి, గోవర్ధన్, యాదయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## రేవెల్లిలో మహిళలు,యువత సిపిఐలో చేరికలు

పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఐ పోరాటం :ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం





**ప్రజాపక్షం/నాంపల్లి:** పేదలు,అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. రేవెల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో మహిళలు,యువత పెద్ద సంఖ్యలో సిపిఐలో చేరారు.వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.అదేవిధంగా తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రజలు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం నాటి నుంచి నేటి వరకు ఎర్రజెండా నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయని తెలిపారు.ఎర్ర జెండా అంటేనే నీతి, నిజాయితీ,త్యాగానికి నిలువెత్తు రూపమని ఆయన అన్నారు. సిపిఐ నిర్వహించిన ప్రజా ఉద్యమాలను గుర్తించి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.నూతనంగా చేరిన కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యాచారి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, మండల కార్యదర్శి సుద్దనబోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,ప్రజానాట్యమండలి అధ్యక్షులు బి. జగన్,కలకొండ సంజీవ,కోరి సత్తయ్య,ఉరిపాక వెంకటయ్య,నేరెళ్ల సైదులు,దండిగ వెంకటయ్య,పల్లె సైదులు,వెంకటాచారి,బుషిపాక యాదయ్య,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, ఉపసర్పంచ్ వంగూరి సాయిలు,సత్తిరెడ్డి,గిరిస్వామి,సైదమ్మ, కొనిరెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో వర్ష బీభత్సం

పట్టణంలో పలు కాలనీలు జలమయం

ఇండ్లలోకి చేరిన వరదనీరు

కాలనీలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని







**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లోని వాగుల్లో వరద నీరు భారీగా వచ్చింది. దీంతో కుంటలు,చిన్నపాటి చెరువులు నిండా యి. మండలంలోని ఆరెగూడెం, కాట్రెవు, నేలపట్ల,కుంట్లగూడెం గ్రామాలతో పాటు ఎనగంటి తండా,పిపల్‌పహాడ్ గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లాయి.నేలపట్లవర్కట్‌పల్లి గ్రామాల మధ్య ఉదయం కొద్దిసేపు రాకపోకలు నిలిచాయి.

**నిండిన కుంటలు,చెరువులు.......**

మండలంలోని ఆరెగూడెం,నేలపట్ల,కుంట్లగూడెం,రెడ్డిబాయి గ్రామాల్లోని కుంటలు నిండిపోయాయి. డి.నాగారం, దండుమల్కాపురం,లక్కారం, చౌటుప్పల్, తంగడిపల్లి చెరువుల్లోకి నీరు వచ్చి చెరుతుంది.ఈ ఏడాది సరైన వర్షాలు కురవక రైతులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో పంటపోలాలకు నీరు అవసరం సమృద్ధిగా లభించింది.ఎండిపోతున్న ప్రత్తి చేనులకు వర్షంతో నీరు అందింది.దీంతో రైతులకు కొంతమేరకు ఉపశమనం కలిగింది. భారీ వర్షం వల్ల చౌటుప్పల్ పట్టణంలోని శాంతినగర్, వినాయక నగర్,రాంనగర్‌తో పాటు పలు కాలనీలు జలమయమైయ్యాయి. పట్టణంలోని 12వ వార్డులోని ఇండ్లలోకి నీరు చేరింది. కూరగాయల మార్కెట్‌లోకి నీరు రావడం వల్ల కూరగాయాలు నీళ్ళలో మునిగిపోయాయి. వలిగొండ రోడ్డు,తంగడిపల్లి రోడ్డులో నీరు రోడ్డుపై వచ్చి చెరింది.నాగులకుంటకు భారీగా ఆయా కాలనీల నీరు రావడంతో కుంట నిండిపోయి ఉప్పొంగడంతో నీరు రోడ్ల పైకి వచ్చింది. దీంతో వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.జలమయమైన కాలనీలను చౌటుప్పల్ మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు.కాలనీల రోడ్లపై నిలిచిన నీరును పోయే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ సిబ్బందిని ఆదేశించారు.


## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 2వ వార్డు కోమటికుంటలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొత్త బోరు మోటార్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తమ శక్తి మేరకు కృషి చేస్తున్నామన్నారు. కోమటికుంటలో ఇప్పటికే మూడు బోర్లు ఉన్నప్పటికి ప్రజ అవసరాల దృష్ట్యా మరో బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త బోరు ద్వారా వచ్చే నీటిని 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్




**ప్రజాపక్షం/భైంసా :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరం తర్వాత నిజాం పాలన నుండి విముక్తి లభించిందని,ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహించకపోవడం సరియైనది కాదన్నారు.సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలని,సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించు కోవాల్సిన అవసరం ఉందన్నారు.హైదరాబాద్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ విమోచనం పట్ల చిత్త శుద్ధిలేదన్నారు. 17వ తేదిన బిజెపి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన జాతీయ జెండాలు ఎగరవేస్తామన్నారు. మహారాష్ట్ర కర్ణాటక ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గం మెప్పుకోసం అధికారికంగా చేపట్టకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి,సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన బారె వనిత రమేష్,ఇప్ప భోజన్న నారాయణల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.53500/ రూ.27,500 విలువైన చెక్కును ఆడే గజేందర్ ఇంటికి వెళ్లి స్వయంగా అందజేశారు. "ప్రజా పాలనలో ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రజల ఇంటి గడప వరకు చేరేలా నా వంతు కృషి చేస్తాను. ప్రజలకు ఏ అవసరంవచ్చినాఅందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తాను" అని ఆడే గజేందర్ పేర్కొన్నారు.తమ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, చెక్కును ఇంటికే వచ్చి అందించిన ఆడేగజేందర్‌కు ప్రత్యేకధన్యవాదాలుతెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాథోడ్ శీల, ఉప సర్పంచ్ రమేష్,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కుర్మె మహేందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాస్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి, ఆత్మ డైరెక్టర్ అబుద్, బోథ్ మండల అధికార ప్రతినిధి అచ్యుత్ రెడ్డి,నాయకులు సాయన్న,అనిల్, కమలాకర్,నిఖిల్,అరవింద్,రాజు,రమేష్, పాల్గొన్నారు.

## గురుపూజోత్సవం సందర్భంగా గురు రత్న అవార్డు : రవికుమార్



**ప్రజాపక్షం/బోథ్ :** నిర్మల్ పట్టణ కేంద్రంలోని ఫ్రెండ్స్ హెల్పింగ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురు రత్న అవార్డును అందుకున్న ముధోల్ గురుకుల పాఠశాలలో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్ పనిచేస్తున్న కే. రవికుమార్. సొసైటీ సభ్యులు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా విద్యార్థులకు సేవలు అందిస్తునారు.వారి సేవకు గుర్తింపుగా గురు రత్న అవార్డును అందిస్తున్నట్టు సొసైటీ సభ్యులు తెలిపారు.సొసైటీ సభ్యులు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ముత్యంరెడ్డి,డాక్టర్ కృష్ణంరాజు,అన్సర్ పాషా చేతుల మీదుగా నిర్మల్ పట్టణంలో ఈ అవార్డును అందుకున్నారు.

## ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు : కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వినాయక చవితి పర్వ దినాన్ని పుర స్కరించుకొని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వి ఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురా రోగ్యాలు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆ కాంక్షించారు.వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారం, ఐకమత్యంతో ప్రశాంత వాతావ రణంలో నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు.పర్యావరణ పరి రక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్ర తిష్టించి, పర్యావరణహిత నిమజ్జ నానికి ప్రాధా న్యత ఇవ్వాలని కోరారు.విద్యుత్, అగ్ని ప్రమాదాలు,ఇతర అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన కార్య క్రమాలను అధికారుల సూచనల మేరకు నిర్దేశిత ప్రదేశాల్లోనే సురక్షితంగా నిర్వహి ంచాలని,ప్రజలు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు.

## గురుకులానికి ప్రభుత్వ.. భూమి కేటాయించాలి : తిరుపతి

**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** పెంచికలపేట్ మండల కేంద్రంలో సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి అధికారులు తక్షణమే 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని సాధన జెఎసి కన్వీనర్ ఎలగందుల తిరుపతి డిమాండ్ చేశారు. గురుకుల సాధన కోసం చేపట్టిన దీక్షలు ఏడో రోజుకు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రజా ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. సర్పంచ్ భక్తు రాంచందర్, నాయకులు చౌదరి తిరుపతి, పులగం ధమాజీ, తెలిగే రమేష్, నగేష్, నరేష్ ప్రభాకర్, గ్రామ యువకులు పాల్గొన్నారు.



## చెత్తలో మగ్గుతున్న.. బహుళ పనుల కార్మిక బతుకులు!

శ్రమ దోపిడీకి గురవుతున్న పంచాయతీ కార్మికులు
రూ.9,500తో కుటుంబ పోషణ సాధ్యమేనా?
పట్టించుకోని పాలకులు





**ప్రజాపక్షం/నిర్మల్ :** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే చేతులే ఇప్పుడు పేదరికంలో మగ్గుతున్నాయి. ప్రజల ముంగిట పేరుకుపోయే చెత్తను తొలగించే కార్మికుల జీవితాల్లో మాత్రం కష్టాల కన్నీళ్లు పేరుకుపోతున్నాయి. ఉదయం వెలుగు రాకముందే విధుల్లోకి దిగి గ్రామమంతా శుభ్రం చేస్తున్న కార్మికులు.. నెలాఖరుకు మాత్రం చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం తలుపులు తట్టాల్సిన దుస్థితిలో ఉన్నారు.

**పేరు బహుళ పనులు.. బాధ్యతలు అనంతం :** బహుళ పనుల కార్మికుల పేరుతో వారిపై పనుల భారాన్ని మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలంలో మురుగు కాలువలు పొంగిపొర్లినా, చెత్త పేరుకుపోయినా, పారిశుధ్య సమస్య తలెత్తినా కార్మికులే రంగంలోకి దిగాలి. అవసరమైతే తాగునీటి సరఫరా పనులు, అత్యవసర పనులు కూడా చేయాల్సిందే.ఒక్క మనిషి.. పదుల పనులు అన్నట్లుగా పరిస్థితి తయారైందని కార్మికులు వాపోతున్నారు.

**పనికి హద్దు లేదు.. వేతనానికి విలువ లేదు :** ఉదయం ఎప్పుడు పని మొదలవుతుందో తెలుసు.. కానీ ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి. పని గంటలకు స్పష్టమైన హద్దులు లేకపోవడంతో అందుబాటులో ఉన్నంత సేపు పని చేయాల్సి వస్తోందని కార్మికులు చెబుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దె, వైద్యం, విద్యుత్ ఖర్చులు, కుటుంబ అవసరాలు పెరిగిపోతున్నాయి. కానీ వేతనం మాత్రం అక్కడే నిలిచిపోయింది.

**రూ.9,500తో బతుకు బండి ఎలా?:** నెలంతా కష్టపడితే వచ్చే రూ.9,500తో నెలంతా కుటుంబాన్ని ఎలా పోషించాలి అనేది కార్మికుల ప్రశ్న. జీతం చేతికి వచ్చిన వెంటనే ఇంటి ఖర్చులు, అప్పుల చెల్లింపులకే సరిపోతోందని చెబుతున్నారు.పిల్లల చదువులకు డబ్బులు అవసరమైనా చేతులు ఖాళీగా ఉండటంతో అప్పు చేయక తప్పడం లేదని వాపోతున్నారు.


**శ్రమకు గుర్తింపు ఎక్కడ..?:** గ్రామాల పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న తమ శ్రమకు సరైన గుర్తింపు లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

**బహుళ పనుల పేరుతో బతుకులపై భారం :** ఒక్కొక్క కార్మికుడిపై అనేక బాధ్యతలు మోపడం వల్ల పని ఒత్తిడి పెరిగిపోతోందని వారు చెబుతున్నారు. పరిశుభ్రతకు ప్రత్యేక సిబ్బంది, ఇతర పనులకు ప్రత్యేక సిబ్బంది ఉంటేనే పనులు సక్రమంగా సాగుతాయని పేర్కొంటున్నారు. బహుళ పనుల పేరుతో కార్మికులను అన్నిరకాల పనులకు వినియోగించడం మానుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**గోడు వినకపోతే గర్జిస్తాం :** ఇన్నాళ్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని కార్మికులు అంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఇక మౌనంగా ఉండబోమని హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల బతుకులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే. వారి శ్రమకు విలువ ఎప్పుడు దక్కుతుందో వేచి చూడాల్సిందే.

## 15న మోర్తాడ్‌కు మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రానికి ఈనెల 15న రాష్ట్రపంచాయతీ శాఖ మంత్రి దనసరి సీతక్క వస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మోర్తాడ్‌లో మంత్రి సీతక్క బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. 1000 రోజుల ప్రజాపాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను అందిస్తున్న శుభ సందర్భంగా ఈనెల 15 న ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని సంత వద్ద బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించు బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శివన్నోల్ల శివకుమార్, బోనగిరి భాస్కర్, శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




## జాతీయ లోక్ అదాలత్‌లో 6,649 కేసుల పరిష్కారం

సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ. 24,02,552 అందజేత




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదైన రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 6649 కేసులలో రాజీపడి పరిష్కారం లభించిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శనివారం సెప్టెంబర్ 12 న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా కోర్టు సముదాయములో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల పరిష్కారానికి సహాయపడిన వివిధ శాఖల అధికారులను కోర్టు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 6649 రాజీ పడి పరిష్కారం లభించిందన్నారు. పరిష్కరించబడిన కేసుల విభాగాల వారీగా ఐపిసి ఎస్ఎల్ఎల్ 462 కేసులు, సైబర్ క్రైమ్ 71 కేసులు, ఇ పెట్టి 3109 కేసులు, డిడి అండ్ ఎంవి యాక్ట్ 3007 మొత్తం 6649 కేసులలో ఇరువర్గాలను రాజీ కుదిరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్‌లో నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన సైబర్ నేరగాళ్ళ చేతిలో కోల్పోయిన రూ. 24,02,552 లను బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని రాజీ కుదుర్చుకోవడానికి అవకాశమున్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని (తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటి బ్యూరో) డైరెక్టర్ శిఖాగోయల్ (ఐపిఎస్) ఆధ్వర్యంలో 7 కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లు, ప్రతి జిల్లాలో డి 4సి ని ఏర్పాటు చేసి డిఎస్‌పి స్థాయి అధికారులచే పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురయినట్లయితే వెంటనే 1930కి కాల్ చేసిగాని, http://cybercrime.gov.in పోర్టల్ లో లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చన్నారు.లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన సిసిఆర్‌బి, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఎఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలు జయప్రదం చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని, ఈ నెల 28, 29, 30 లలో హన్మకొండలో ఘ నంగా నిర్వహించనున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ తెలిపారు. ఆదివారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ రైల్వేస్టేషన్ దగ్గర ఎఐఎస్ఎఫ్‌జిల్లా కార్యాలయం ఎదుట గోడపత్రికను ఆవిష్కరించి రఘురాంనాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లోని 11 వేల కోట్ల పైచిలుకు ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల శాపంగా మారిన జిఓ నెం. 97ను వెంటనే రద్దు చేయాలని, సంక్షేమ హాస్టళ్లల్లోపెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి వార్సికోత్సవాల్లో విద్యారంగ సమస్యలు, ఫీజు బకాయిలు, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు, ప్రాథమిక విద్య, ఉన్నత విద్య తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు జరగనున్నట్లు తెలిపారు. హన్మకొండ వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 మంది డెలిలేట్లు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు, ప్రస్తుత రాజ్యసభ స భ్యులు సంతోష్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావు, విద్యారంగ సంస్కరణవాదులు పాల్గొననున్నట్లు తెలిపారు.

## విఘ్నాలు తొలగి ప్రజలంతా.. సుఖసంతోషాలతో ఉండాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్:** సోమవారం గణేష్ చతుర్థి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, ఆర్థిక అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించాలని, పీఓపీ విగ్రహాలను నివారించాలని సూచించారు. నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసి, స్వచ్ఛత, క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## మట్టి గణపతులను పూజిద్దాం

పర్యావరణాన్ని రక్షిద్దాం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మట్టి గణపతులను పూజిద్దాం, పర్యావరణా న్ని రక్షిద్దామని నగర మేయర్ కూరగాయల ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం అర్బన్ నియోజకవర్గంలో 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి టెంట్ హౌస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా నగర మేయర్ ఉమారాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్‌రెడ్డి, బొబ్బిలిరామకృష్ణ, గంగాధర్ పాల్గొని గణపతులను అందజేసి మాట్లాడారు. పర్యావరణ హితం కోసం ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజించాలన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో కళాకారుడి పాతిక ఏళ్ల నిబద్ధత

మట్టి విగ్రహాల తయారీలో పోలీస్ భీమేశ్!



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రకృతి పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక సామాజిక బాధ్యతగా భావించాలని ఆకాంక్షిస్తూ, గత 25 సంవత్సరాలుగా సహజ సిద్ధమైన మట్టితో పర్యావరణహిత విఘ్నేశ్వరుని విగ్రహాలను తయారు చేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు నిర్మల్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, కళాకారుడు పోలీస్ భీమేశ్. సమాజ శ్రేయస్సు, పర్యావరణ స్పృహే ధ్యేయంగా పాతిక ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా సాగిస్తున్న ఈ ప్రయాణం స్థానిక ప్రజలకు, యువతకు ఎంతగానో ఆదర్శంగా నిలుస్తోంది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విరివిగా వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), హానికరమైన రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల చెరువులు,కాలువలు,నదులు తీవ్రంగా కలుషితమవుతున్నాయి. ఈ రసాయనిక వ్యర్థాల వల్ల జలచరాల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లడమే కాకుండా,నీటి ప్రాకృతిక సమతుల్యత దెబ్బతిని భూగర్భ జలాలు కూడా విషపూరితంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ఈ తీవ్రమైన పరిస్థితులను ముందే గ్రహించిన పోలీస్ భీమేశ్, పూర్తిగా సహజ సిద్ధమైన మట్టితో మాత్రమే విఘ్నేశ్వరుని ప్రతిమలను రూపకల్పన చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిని నిలకడగా కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా కవి, కళాకారుడు పోలీస్ భీమేశ్ మాట్లాడుతూ.. మట్టితో తయారు చేసిన ప్రతిమలు నిమజ్జనం అనంతరం ఎటువంటి అవశేషాలు మిగల్చకుండా అత్యంత సహజంగా నీటిలో కలిసిపోతాయని తెలిపారు. దీనివల్ల నీటి వనరులకు గానీ, పర్యావరణ వ్యవస్థకు గానీ ఎలాంటి హాని జరగదని ఆయన స్పష్టం చేశారు. మన పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే స్పష్టమైన సందేశంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.ప్రజాసంఘాలు ముఖ్యంగా నేటి యువత విశేషంగా సహకరించి మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనను ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని భీమేశ్ పిలుపునిచ్చారు.

## నిర్మల్ ఎస్‌పిపై విష ప్రచారం..

అక్రమార్కులు, కుట్రదారులపై ..
నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఆగ్రహం



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిలపై కొంతమంది స్వార్థపూరిత శక్తులు నిర్మల్ పోలీసుల ముసుగులో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, సోషల్ మీడియా వేదికగా విషప్రచారం సాగిస్తున్నారని నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితులతో ఎలాంటి సంబంధం లేకుండా, కొద్దిమంది అసంతృప్తిపరులు తమ వ్యక్తిగత అజెండాను మొత్తం పోలీస్ శాఖ అభిప్రాయంగా చిత్రీకరిస్తూ వ్యవస్థ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే కుట్రలకు ఒడిగడుతున్నారని భగ్గుమన్నారు. ఎస్పీ మేడమ్ నేతృత్వంలో జరుగుతున్న సంక్షేమ, పారదర్శక పరిపాలనా చర్యలకు తమ సంక్షేమ సంఘం పూర్తి స్థాయిలో కొండంత అండగా నిలుస్తుందని విస్పష్టంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై నిబంధనలకు అనుగుణంగా బదిలీలు, అటాచ్‌మెంట్లు చేయడం పోలీస్ శాఖలో భాగమైన పరిపాలనా ప్రక్రియ అని,ఇలాంటి క్రమశిక్షణా చర్యలను ఎస్‌పి వ్యక్తిగత కక్ష సాధింపులు గా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడం తగదన్నా రు.అంతేకాకుండా,జిల్లాలో ప్రత్యేకంగాట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోయినప్పటికీ సివిల్, ఏఆర్ సిబ్బందితోనే ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల విధులను ఎస్పీ అత్యంత సమర్థవంతంగా నిర్వహింపజేస్తున్నారని స్పష్టం చే శారు.సిబ్బందిపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు గతంలో ఉన్న రూ. 975 కోఆపరేటివ్ లోన్ సబ్‌స్క్రిప్షన్‌ను రూ. 500లకు తగ్గించి ఆర్థిక ఊరటనిచ్చారని తెలిపారు.అంతేకాకుండా,రుణం కోసం వచ్చే సిబ్బంది కుటుంబ పరిస్థితులను స్వయంగా తెలుసుకుంటూ వారి కుటుంబ స భ్యులను ఛాంబర్‌కు పిలిపించి పారదర్శకంగా రుణాలు అందేలా చూస్తున్నారన్నారు. ప్రజలు ,సిబ్బంది సమస్యల తక్షణ పరిష్కారం కోసం నిర్మల్‌లో ప్రతిరోజు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారని,దూర ప్రాంతాల వారి సౌకర్యార్థం ప్రతి బుధవారం భైంసాలో ప్రత్యేక ఫిర్యాదుల దినోత్సవం జరుపుతున్నట్లు పేర్కొన్నారు.వర్షాకాలంలో హోంగార్డులకు రైన్ కోట్లు, పంక్షన్ హాల్, క్యాంటీన్ వసతులు కల్పించారని, ఏటా జరిగే సాధారణ బదిలీలను ఎస్పీకి రుద్దడం అజ్ఞానమేనన్నారు. మరోవైపు IIIT బాసర విద్యార్థుల భద్రత, చదువుపై ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో అక్కడి విద్యార్థులు ఆమెను ఆప్యాయంగా అమ్మ అని పిలుచుకుంటారని గుర్తుచేశారు.పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను భైంసా ఎఎస్పి పర్యవేక్షణలో రహ స్య బ్యాలెట్ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే, దానికి కుల,మత రంగులు పులమడం కుట్రదారుల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. నిర్మల్ జిల్లా పోలీస్ సం క్షేమ సంఘం అధ్యక్షులు దండేకర్ సాయికుమా ర్, ఉపాధ్యక్షులు కృష్ణ, సాయి కృష్ణ,కార్యదర్శి శ్రీకాంత్, జాయింట్ కార్యదర్శిసంతోష్,ట్రెజరర్ మాధవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంనిరంజన్ రావు, మరియు కార్యవర్గ సభ్యులు బిట్లా పెర్సిస్ మహేందర్ రెడ్డి, సాయి కిరణ్, శంభూ దేవ్,వెంకటరమణ, గంగాధర్ విడుదల చేశారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు : ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి డాక్టర్ జి. జానకి షర్మిల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో,శాంతియుత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పోలీసు శాఖ సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

## 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** అక్రమంగా తరలిస్తున్న సుమారు 15 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని సిర్పూర్ టి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వెంపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు లేకుండా ఆటోలో తరలిస్తున్న 60 సంచుల బియ్యాన్ని గుర్తించి వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఆటో డ్రైవర్ షేక్ షఫీ, అటెండర్ ఎండీ అహ్మద్, రైస్ మిల్ యజమాని వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
14-09-2026
www.prajapaksham.in

"దివంగత నటి పావలా శ్యామల కుతురు మాధవిని రమణాచారి ఫౌండేషన్‌లో జాయిన్ చేస్తున్నామని 'మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్)' ట్రెజరర్ శివ బాలాజీ తెలిపారు. ఆమె సంక్షేమం కోసం సీనియర్ నటుడు నరేష్, మురళీ మోహన్ తదితరులు యాభై వేల చొప్పున ఆర్థిక విరాళాన్ని అందించారు."

# రీల్

## యాక్షన్ నేపథ్యంలో 'స్వయంభు'




నిఖిల్ సిద్ధార్థ్ 'స్వయంభు' సినిమాతో ప్రేక్షకులను చారిత్రక ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. భారీ అంచనాలతో రూపొందితున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. మల్టీ లాంగ్వేజ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'స్వయంభు' కోసం ఏకంగా 175 రోజులు పాటు షూటింగ్ నిర్వహించారు. ఫైనల్ ప్రొడక్షన్‌లో సుమారు 2,500 వీఎఫ్ఎక్స్ షాట్స్‌ను పొందుపరుస్తున్నారు. ఈ నెంబర్స్ సినిమా ఏ స్థాయిలో తెరకెక్కుతోందో, ఎంత భారీ టెక్నికల్ వర్క్ జరుగుతోందో తెలియజేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన బిహైండ్ ది సీన్స్ పిక్చర్ సినిమా మేకర్స్ ఆసక్తిని పెంచుతోంది. ఇందులో నిఖిల్ ఇంటెన్స్ వారియర్ అవతార్లో యాక్షన్ సీక్వెన్సుల్లు సిద్ధమవుతున్నట్లు కనిపించారు. సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ విజువల్స్ అందిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్లు ఎం. ప్రభాహరన్, రవీందర్ ఈ సినిమా కోసం భారీ ప్రపంచాన్ని క్రియేట్ చేస్తున్నారు. నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## 'కొత్త కంటెంట్‌తో పిఠాపురంలో... అలా మొదలైంది'

### ప్రీ రిలీజ్‌లో డా. రాజేంద్రప్రసాద్


డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, నన్ని అభిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రోహిణి ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు 'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో& అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది . ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్‌తో నాకు 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆయన క్లారిటీతో ఉండే అద్భుతమైన దర్శకుడు. 'పిఠాపురంలో& అలా మొదలైంది' మంచి విజయం సాధించాలి. కొత్త కంటెంట్‌తో, ఫ్రెష్ సబ్జెక్ట్‌తో ఆయన తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను అని అన్నారు.డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నా 49 సంవత్సరాల సినిమా జీవితంలో నాకు దొరికిన అదృష్టం ఏమిటంటే, నాకు దొరికిన మంచి పాత్రలు. ఈ అదృష్టమంతా నాకు ఆ పాత్రలవల్లే దక్కింది. చంద్ర మహేష్ ఎలాంటి దర్శకుడో నాకు ముందు నుంచీ తెలుసు. ఈ కథ చెప్పినప్పుడే నా పాత్ర తాలూకు డెప్త్ ఏమిటో అర్థమైంది. చంద్ర మహేష్ అంటే ఏమిటో ఈ సినిమా చూపిస్తుంది. ఎన్నో కష్టనష్టాలు భరించి ఈ సినిమా తీశారు ఆయన. ప్రపంచంలో వున్న తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఎందుకంటే, ఇది అందరి ఇళ్లలో వుండే కథ. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడూ పది మందికి గొప్పగా చెబుతారు. మై హార్ట్ ఫెల్ట్ థాంక్స్ టు చంద్రమహేష్. క్లైమాక్స్ సీన్‌లో ఆర్టిస్ట్‌లు కూడా కన్నీరు పెట్టుకున్నారు. అంతటి ఎమోషన్ వుంది. దాంతోపాటే ఈ జనరేషన్‌కు నచ్చే అన్ని మసాలాలూ ఈ సినిమాలో వున్నాయి. ఒక సీనియర్ నటుడుగా మీ అందరికీ దణ్ణంపెట్టి చెబుతున్నా. దయచేసి ఒక మంచి సినిమాని థియేటర్‌కు వెళ్లి చూడండి అన్నారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడారు. సినిమా బాగా నటి మణిచందన మాట్లాడుతూ .. ''పిఠాపురంలో& అలా మొదలైంది' చిత్రంలో మంచి కథ, మంచి ఎమోషన్ ఉంటుందని చెప్పారు





ఇరుముడి సినిమా సూపర్ హిట్టయిన సందర్భంగా హీరో రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలను అభినందించిన మెగాస్టార్ చిరంజీవి

## 18న ఉపేంద్ర రీ రిలీజ్



రెండు దశాబ్దాల క్రితం కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర స్వయంగా దర్శకత్వం వహించి నటించిన చిత్రం ఉపేంద్ర. రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న ఈ సమయంలో ఉపేంద్ర సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. 1999లో విడుదలై సంచలన విజయం సాధించింది . ఈ సినిమా ఇప్పుడు కొత్త తరానికి కూడా వినోదం పంచేందుకు సిద్ధమైంది. 'ఉపేంద్ర' పుట్టినరోజు సందర్భంగా ఉపేంద్ర సినిమాను సెప్టెంబర్ 18న ఎంజీ మూవీస్ బ్యానర్‌పై ఎం అచ్చిబాబు ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఉపేంద్ర ఈ సినిమాను తీసిన అప్రోచ్‌కు అప్పట్లో అభిమానులు ఫిదా అయ్యారు. ఈ సినిమాలో రవీనా టాండన్, ప్రేమ, దామిని కీలక పాత్రల్లో నటించారు. శిల్పా శ్రీనివాస్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రానికి సంగీతాన్ని గురుకిరణ్ అందించారు. అప్పట్లో పాటలు ట్రెండ్ సెట్ చేసాయి. బుక్ మై షో, డిస్ట్రిక్ట్ యాప్స్ లో బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి.

## 'ది ప్యారడైజ్'లో యాక్షన్ కొత్తగా ఉంటుంది

### ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్



నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. . ఈ చిత్రం 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మ ణ్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. మేము, నవకాంత్, రియల్ సతీష్ పనిచేశాం. ఇందులో మేం రెండు భారీ యాక్షన్ బ్లాక్స్ కంపోజ్ చేశాం. నాని క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ కొత్తగా డిజైన్ చేశారు. రెండు జడలు వేసుకున్న హీరోను ఇండియన్ స్క్రీన్‌ప్లే ఇప్పటివరకు చూడలేదు. మాకు కూడా అది చాలా కొత్తగా అనిపించింది. నాని ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. నాని ఈ స్థాయిలో యాక్షన్ చేయడం ఇదే మొదటిసారి. ఇందులో యాక్షన్ సీన్స్ చాలా హెవీగా ఉంటాయి. 'దసరా' కంటే మూడు రెట్లు ఎక్కువ యాక్షన్ ఉంటుంది. జడలతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం మామూలు విషయం కాదు. యాక్షన్ చేస్తున్నప్పుడు ఆ జడలు రోప్లకు, ముఖానికి తగులుతుంటాయి. అలాంటి యాక్షన్ సీక్వెన్స్ చేయడం మాకు కూడా కొత్త అనుభవమే. మా అసిస్టెంట్‌కు కూడా అలాంటి జడలు వేయించి అందులో ఉండే కష్టం తెలుసుకుని మరీ యాక్షన్‌ను కంపోజ్ చేశాం.

నాని బేర్ బాడీతో చేసే యాక్షన్ సీక్వెన్సు ఉంటాయి. అవి స్క్రీన్‌ప్లే చేయడం అంత ఈజీ కాదు. బాడీ బిల్డింగ్ చేయాలి. డైటింగ్లో ఉండాలి. ఇందులోనూ దర్శకుడు శ్రీకాంత్ తనకు అనుకున్నది వచ్చేంతవరకు రాజీపడరు. శ్రీకాంత్ తీసుకున్న విజన్కు నాని వంద శాతం న్యాయం చేశారు. అందులో మేం భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాం.మా యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి దాదాపు పది రోజులు పట్టింది.

ఇందులో కొత్త మనుషులు, కొత్త బాడీ లాంగ్వేజ్.. అంతా కొత్తగానే ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఎంచుకున్న కథ సహజంగానే యాక్షన్ను డిమాండ్ చేస్తుంది. ఇందులో తప్పించుకోవడానికి అవకాశం ఉండదు.. ఫైట్ చేయాల్సిందే. అలాంటి పరిస్థితిని శ్రీకాంత్ క్రియేట్ చేశారు. యాక్షన్‌ను కంపోజ్ చేయడానికి చాలా సమయం తీసుకున్నాం. ఎందుకంటే ఇలాంటి బాడీ లాంగ్వేజ్ తో సినిమా ఇంతకుముందు రాలేదు. అందుకే చాలా కేర్ తీసుకుని చేశాం. ఇందులో చాలా రిస్కీ యాక్షన్ ఉంటుంది. షూటింగ్ సమయంలో మా యూని ట్లో ఒకరికి గాయం కూడా అయింది. మోహన్ బాబు చాలా సినిమాలు చేశారు. కానీ ఇందులో చాలా కొత్తగా కనిపిస్తారు. ఆయనకూ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. కాంపిటీషన్ ఉన్నప్పుడే క్రియేటివిటీ పెరుగుతుంది. ఇంకా ఎలా కొత్తగా చేయాలనే తపన వస్తుంది. మేం ప్రతిరోజూ తొలి సినిమా చేస్తున్న ఫైట్ మాస్టర్స్‌లా భయంతో, వృత్తి పట్ల నిజాయితీతో, ఏకాగ్రతతో పనిచేస్తుంటాం. మా అబ్బాయి కూడా 'ప్యారడైజ్'లో పనిచేశాడు. తనకు అన్ని భాషల సినిమాలపై మంచి పట్టు ఉంది. సుధాకర్ ఎక్కడా రాజీపడకుండా భారీగా ఖర్చు పెట్టి ఈ సినిమాను నిర్మించారు. నాని, దర్శకుడిపై పూర్తి నమ్మకంతో ముందుకెళ్లారు. నాని, నిర్మాత, దర్శకుడు కలిసి 'ప్యారడైజ్'ను బిగ్ స్కేల్ లో చేశారు. ఈ సినిమాకి అద్భుతమైన విజయం తప్పకుండా దక్కుతుందని మేం నమ్ముతున్నాం.

## 'హ్యాపీ జర్నీ ట్రైలర్ లాంచ్

'హ్యాపీ' జర్నీ'లో అదే ఆలోచనను ఏడుగురు మహిళల జీవితాలు, అనుభవాల ద్వారా ఆసక్తికరంగా చూపించారు. ఏ డు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ను లాంచ్ చేశారు ఈ చిత్రం 18న థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిరామ్ నాయుడు మాట్లాడుతూ పేరెంట్స్ మీద మనకి చాలా ప్రేమ ఉంటుంది. ఎమోషన్స్ అన్నీ ఈ సినిమాలో చూపిస్తాం. నిజంగా జనాభా పెరిగితే ఒకరికొకరు తోడు పెరగాలి. కానీ మనం వంటరి అవుతున్నాను. ఫోన్ నెం బర్లు ఉంటాయి కానీ ఎవరికీ ఫోన్ చేయలేని పరిస్థితి. ఒకరికొక రు తోడుగా ఉంటే ఎంత అందంగా ఉంటుందనేది ఈ సినిమా లో చూపించబోతున్నాం. ఇందులో ఏడుగురు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే మహిళల జర్నీని మీరు చూస్తారు. సినిమా అంతా చాలా ఫన్ ఉంటుంది. చివర్లో చాలా మంచి పాయింట్ కూడా ఉంటుంది. అది మీ అందరికీ నచ్చుతుంన్నారు. పాయల్, జెనీ వా, రమ, సుజాతను, ఎడిటర్ ఛోటా కె. ప్రసాద్ పాల్గొన్నారు.



## ఇంజనీర్లు, శాస్త్రవేత్తలకు ఘన సత్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో జాతి నిర్మాణకర్తల పాత్ర అత్యంత కీలకమని పలువురు వక్తలు అన్నారు. 'ఇంజనీర్స్ డే' సందర్భంగా 'బ్రహ్మకుమారీస్ సైంటిస్ట్స్, ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్ విభాగం, బ్రహ్మకుమారీస్ పీస్ హౌస్, హైదరాబాద్ సహకారంతో ''జాతి నిర్మాణకర్తలకు గౌరవం'' అనే థీమ్‌తో హైదరాబాద్‌లోని బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్ కాంప్లెక్స్‌లోని అడ్మిరల్ గోపాల్ రావు బిర్లా కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సుమారు రెండు వందల మంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మానికి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డా.రమణ నాయిక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు బ్రహ్మకుమారీస్ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విలువల ప్రయోజనాలను ఇంజనీర్లకు పరిచయం చేయాలని కోరారు. తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇ ఎస్ జి కమిటీ చైర్‌పర్సన్ జి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం పరివర్తనకు సమయం వచ్చిందన్నారు. ఏం చేయగలమనేది కాదని, ఏం చేయాలన్నదే ప్రస్తుతం ఆలోచించాల్సిన విషయం అని సూచించారు. ఆధ్యాత్మికత మనలో జ్ఞానాన్ని పెంపొందించి, జీవితానికి సరైన దిశను చూపుతుందని సూచించారు. అర్బన్ ఆర్ట్స్ డైరెక్టర్ దేవయాని ప్రమోద్ షిండే స్వాగతోపన్యాసం చేయగా, సైంటిస్ట్స్ అండ్ ఇంజనీర్స్ వింగ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి కె అంజలి ముఖ్యఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో .ఆల్ ఇండియా రేడియో, ఎన్ జిఆర్ఐ, ఎన్‌టిపిసి, విసిటి, ఉస్మానియా యూనివర్సిటీ, అవంతి ఇంజనీరింగ్ కాలేజ్,డిఆర్ డిఒ,ఎస్‌సిసిఎల్ కొత్తగూడెం, సెయింట్ మేరీస్ గ్రూప్, జిహెచ్‌ఎంసి, ఆర్‌టిసి, ఇసిఐఎల్ తదితర సంస్థలకు చెందిన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవజీవన్ అనాథాశ్రమానికి చెందిన చిన్నారుల స్వాగత నృత్యం చేశారు. కాగా బి.కె. మీనాక్షి ఆధ్వర్యంలో రాజయోగ ధ్యానం చేశారు.

## వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్తర, మధ్య తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందన్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మంగళ, బుధవారాల్లో ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం నుంచి ఆదివారం వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతంగా ఉండటంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## కేటాయింపులు


(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల పరిశీలన ప్రక్రియను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక కేటాయింపు పత్రాలను అందజేస్తామన్నారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారు తమకు ఇల్లు కేటాయింపుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రక్రియ అంతా పూర్తి పారదర్శకంగా జరుగుతోందని కమిషనర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన దళారులు, మధ్యవర్తుల పట్ల హెచ్చరిక జారీ చేశారు. ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పి అమాయకుల నుంచి డబ్బులు గుంజేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గృహాల కేటాయింపులో ఎలాంటి మధ్యవర్తులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఎవరికీ లంచాలు కానీ, కమీషన్‌లు కానీ చెల్లించవద్దని కోరారు. కేటాయింపు పత్రంతో పాటే చెల్లించాల్సిన మొదటి విడత మొత్తం, అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, గడువు తేదీ సమాచారాన్ని అందిస్తామన్నారు. నిర్ణీత మొత్తం సొమ్మును అధికారిక ఖాతాలో మాత్రమే జమ చేయాలని, ఎలాంటి వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు పంపవద్దని సూచించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తదుపరి సమాచారం కోసం లబ్ధిదారులు అధికారిక వెబ్‌సైట్ tghb.telangana.gov.in ను కానీ, కాల్ సెంటర్ నెంబర్ 04024603572 ను కానీ సంప్రదించాలని సూచించారు.

## పూజలకు ఖైరతాబాద్

# బడా వినాయకుడు సిద్ధం

**భక్తులకు దర్శనమివ్వనున్న 70 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి**
**నేడు 11 గంటలకు గవర్నర్ దంపతుల చేతుల మీదుగా తొలిపూజ**



ప్రజాపక్షం/ఖైరతాబాద్ (హైదరాబాద్)

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి సందడి మొదలయ్యింది. ఏ వీధిలో చూసినా వినాయక విగ్రహాల ఏర్పాటు కోలాహలం కనిపిస్తున్నది. క్యూర్ పరిధిలో ఏర్పాటయ్యే వేలాది వినాయక విగ్రహాల కోసం మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. ఈ క్రమంలోనే చారిత్రక ఖైరతాబాద్ వినాయకుడు ఈ ఏడాది పంచముఖ సంకటహర మహాగణపతిగా దర్శనమివ్వనున్నాడు. ఆదివారం దర్శనార్థం మహాగణపతి విగ్రహం తెరను తీయడంతో భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. భక్తులు గణపతిని దర్శించుకుని తన్మయం పొందారు. 70 అడుగుల ఎత్తులో దర్శనమిస్తున్న విఘ్నేశ్వరున్ని కనులారా వీక్షించి కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తూ సెల్‌ఫోన్లలో గణపతిని సెల్ఫీలు తీసుకున్నారు. ఈనెల 14 నుంచి 24 వరకు జరిగే మహాక్రతువును ఎటువంటి విఘ్నాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి సన్నాహాలు చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్ మహాగణపతికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల తొలి పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలాఉండగా.. ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడపనుంది. నవరాత్రుల వేళ ఈ రెండు ప్రాంతాల్లోని గణేష్‌ను భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఖైరతాబాద్, బాలాపూర్ వరకు సెప్టెంబర్ 14 నుంచి 24 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు సంస్థ ప్రకటించింది. జంట నగరాల నలుమూలల నుంచి వచ్చే భక్తులు ఈ సేవలను ఉపయోగించుకుని స్వామివారిని దర్శించుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక బస్సులు జేబీఎస్, ఎంజీబీఎస్ వంటి ప్రధాన బస్ స్టేషన్లను అనుసంధానిస్తూ నడుస్తాయి.

## హౌతీల దాడి

(మొదటి పేజీ తరువాయి)

జులై నుండి ఇప్పటివరకూ హౌతీలు-యెమెన్ సైన్యాలమధ్య యుద్ధం వల్ల 76,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి వెళ్ళిపోయినట్లు అంతర్జాతీయ వలస సంస్థ ఆదివారం ప్రకటించింది.2022 కాల్పుల విరమణకు ముందు 1.50 లక్షలమంది హత్యకు గురికావడంతో ఇళ్ళకు తిరిగి వెళ్ళడానికి అనేకమంది భయపడుతున్నారు.యెమెన్ సైనికులు కూడా వెనుదిరిగి తీర ప్రాంతాలను ఖాళీ చేస్తున్నారు.

సౌదీ అరేబియా ప్రాంతాలపై క్షిపణులు, డ్రోన్లతో హౌతీ తిరుగుబాటుదారులు దాడులు చేశారు. దీంతో ప్రజలకు సౌదీ ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు చేసింది. సురక్షిత పద్ధతులు పాటించాలని కోరింది. ఎర్రసముద్రం వెంబడి యెమెన్ సరిహద్దుల్లోని అల్ త్వాల్ గవర్నరేట్‌లో క్షిపణి దాడి వల్ల ఇద్దరు గాయపడ్డారని, ఒక మసీదు, ఇతర భవనాలు దెబ్బతిన్నాయని సౌదీ పౌర రక్షణ విభాగం ప్రకటించింది. హౌతీలు క్షిపణి, డ్రోన్ దాడులతో షరూరా ప్రాంతంలో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేసింది.

నజ్రాన్ ప్రాంతం షరూరా రాష్ట్రంలో ఉన్న సైనిక స్థావరమే లక్ష్యంగా దాడులు చేసినట్లు హౌతీల సైనిక ప్రతినిధి, బ్రిగేడియర్ యాహ్యా సరీ చెప్పారు. ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని హౌతీలు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముందుకు దూసుకుపోతున్నారు. సౌదీ నౌకలను,వాణిజ్యాన్ని అడ్డుకుంటున్నారు. బాబ్ అల్‌మందెబ్ కీలక ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడంతో సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ నౌకా వాణిజ్యానికి విఘాతం కలుగుతోంది. హౌతీలు దాడులు చేస్తున్నప్పటికీ సౌదీ ప్రభుత్వం ప్రతిఘటించలేదు. సౌదీ అరేబియా నౌకలకు తప్ప ఇతర వాణిజ్య నౌకలకు ఎలాంటి ముప్పులేదని హౌతీలు ప్రకటించినప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్యానికి విఘాతం కలుగుతోంది. చమురు ధరలు మళ్ళీ పెరిగాయి. మార్కెట్లుఅప్రమత్తత పాటిస్తున్నాయి.

మరోవైపు హౌతీల దాడులతో యెమెన్ ప్రజలు పారిపోతున్నారు. ఈ వీడియోలు వస్తున్నాయి. ఎర్ర సముద్ర తీర ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకోవడంతో సౌదీ అరేబియా మద్దతు గల యెమెన్ ప్రభుత్వ దళాలు ఆ ప్రాంతాల నుండి వెనుదిరిగాయి. ఈ అవమానకర పరిస్థితుల్లో తాము హౌతీలతో పోరాటం చేస్తామని యెమెన్ ప్రభుత్వం ప్రకటించింది.

యెమెన్ పాలకమండలి సభ్యుడు సుల్తాన్ అల్ అరాదా మాట్లాడుతూ, మోఖా ఓడరేవు,ఆ ప్రాంతం హౌతీల స్వాధీనంలోకి వెళ్ళడం, యెమెన్ బలగాలు ఓడిపోవడాన్ని బాధాకరమైన విషయాలుగా పేర్కొన్నారు. యెమెన్ సైన్యానికి, దానికి అనుబంధ మిలీషియాకు ఉన్న సమన్వయ లోపమే హౌతీలకు విజయంగా మారిందన్నారు. సౌదీ వైమానికదళం మోఖాను స్వాధీనం చేసుకోకుండా మౌనంగా ఉండటం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వం గడచిన 12 సంవత్సరాలుగా హౌతీ తిరుగుబాటుదారులతో పోరాటం చేస్తోంది. ఈ విడత జరిగిన యుద్ధంలో యెమెన్ దళాలు ఘోరంగా ఓడిపోతున్నాయి. మోఖా ఓడరేవును హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. ఇది యెమెన్ దళాలకు అత్యంత అవమానకరంగా మారింది. ఇది యెమెన్ దళాలకు అతిపెద్ద ఎదురుదెబ్బ. ఈ తాజా ఉద్రిక్తతలు 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఉల్లంఘన.ఇదిలా ఉండగా, ఆదివారం తెల్లవారుజామున హోర్ముజ్ జలసంధిలోని హెంగామ్ ద్వీప సమీపంలో ఒక గుర్తు తెలియని ప్రొజెక్టైల్ చేసిన దాడిలో ఇరాన్ వాణిజ్య నౌక ధ్వంసమైంది. ఈ ఘటనలో ఒకరు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ దాడి ఎవరు చేశారనే విషయంపై ఇరాన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

### సౌదీ పైప్‌లైన్ దాడి వెనుక ఇరాన్ : ట్రంప్ ఆరోపణ

సౌదీ అరేబియా ఈస్ట్-వెస్ట్ ప్రధాన పైపులైన్‌పై దాడి, ముందస్తు భయంతో పైపులైను మూసివేత భయం వెనుక ఇరాన్ హస్తం ఉండి ఉంటుందని ట్రంప్ ఆరోపించారు.ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ, ఇరాన్ దీనికి కారణమై ఉంటుందన్నారు. హౌతీలతో తమ యంత్రాంగం చర్చలు జరుపుతోందని చెప్పారు. వారు మాతో మాట్లాడారని, వారు అమెరికాతో పోరాటం చేయడానికి సిద్ధంగా లేరని చెరప్పారని అన్నారు. వారు కేవలం తమ పొరుగున ఉన్న సౌదీ అరేబియా నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారన్నారు.సౌదీ యువరాజు తనకు మంచి స్నేహితుడన్నారు. ఇదిలా ఉండగా, సౌదీ అరేబియా కీలక పైపులైపుపై తమ భూభాగం నుండే దాడి జరిగిందని ఇరాక్ అంగీకరించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి అలీ అల్ జైదీ చెప్పారు. దీనికి ఆగ్రహించి ఒక కమాండర్‌ను కూడా పదవి నుండి తొలగించినట్లు ఇరాక్ ప్రధానమంత్రి చెప్పారు.పైపులైనుపై దాడి జరిగినాగానీ సౌదీ అరేబియా ప్రతీకార దాడులు చేయలేదని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com